www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 9
మంగళవారం | 8-4-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: ఏకాదశి రా.9:14 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆశ్లేష ఉ.7:55 తదుపరి మఖ; వర్జ్యం: రా.8:56-రా.10:40; దుర్ముహూర్తం: ఉ.8:35-9:24, రా.10:15-రా.11:00; అమృతఘడియలు: ఉ.6:13-7:55; రాహుకాలం: మ.3:21-4:54; సూర్యోదయం: 6:07; సూర్యాస్తమయం: 6:26
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహా పతనం!

ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావంతో ప్రపంచ మార్కెట్లు ధమాల్

వాల్ స్ట్రీట్ నుంచి దలాల్ స్ట్రీట్ దాకా రక్తపాతమే
ఓ దశలో 5 శాతం పతనమైన భారత సూచీలు
ఇంట్రాడేలో సెన్సెక్స్ 3,939 పాయింట్ల పతనం
2,226 పాయింట్ల నష్టంతో 73,137 వద్ద క్లోజ్
అదే బాటలో నిఫ్టీ.. 742.85 పాయింట్ల నష్టం
క్షణాల్లో రూ. 20లక్షల కోట్ల సంపద ఆవిరి
ట్రేడింగ్ ముగిసేసరికి రూ. 14 లక్షల కోట్ల నష్టం
భారీగా నష్టపోయిన ప్రపంచ మార్కెట్లు

బ్రహ్మాండంగా ఉంది.. ద్రవ్యోల్బణమే లేదు!

చమురు ధరలు, వడ్డీ రేట్లు తగ్గాయి: ట్రంప్

ప్రతీకార సుంకాన్ని ఉపసంహరించకపోతే
చైనాపై 50% అదనపు సుంకం

ఒక్కరోజే గడువు.. అమెరికా అధ్యక్షుడి హెచ్చరిక

వడ్డీ రేట్ల తగ్గింపే అసలు వ్యూహం
అందుకే మాంద్యం కోసం ట్రంప్ ప్రయత్నాలు!



ట్రంప్ సుంకాల దెబ్బకు ప్రపంచ మార్కెట్లు కుదేలైపోయాయి. జపాన్ మొదలు.. అమెరికా దాకా.. అన్ని మార్కెట్లు దారుణంగా పతనమయ్యాయి. వాల్ స్ట్రీట్ మొదలు.. దలాల్‌స్ట్రీట్ వరకు మార్కెట్లన్నీ 'బేర్' మన్నాయి. రక్తపాతం జరిగిందా? అన్నట్లుగా 'బ్లాక్ మండే' రోజున సూచీలన్నీ ఎరుపెక్కాయి. అమ్మకాల హోరుతో సెన్సెక్స్ సోమవారం ఓ దశలో 5%(3,939 పాయింట్లు) వరకు నష్టపోయింది. ట్రేడింగ్ చివర్లో వాల్యూ బైయింగ్ కొనుగోళ్లతో 1,700 పాయింట్ల వరకు కోలుకుని 3%(2,226 పాయింట్లు) నష్టంతో 73,137.90 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 742 పాయింట్ల నష్టంతో రూ.22,161 పాయింట్ల వద్ద క్లోజైంది. మార్కెట్ల భారీ పతనంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ క్యాప్ సోమవారం ఒక్కరోజే రూ.14.09 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.389.25 లక్షల కోట్లకు చేరింది. మార్కెట్ ప్రారంభంలో ఈ నష్టం రూ.20లక్షల కోట్లుగా ఉండగా.. మార్కెట్ క్లోజింగ్ సమయానికి కొంత కోలుకుంది. గడిచిన పది నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఒక్క రోజులో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే మొదటిసారి. ఇక ప్రపంచ మార్కెట్లు కూడా ఘోరమైన నష్టాలను చవిచూశాయి. హాంకాంగ్ మార్కెట్లు 13.6% నష్టపోయాయి. ఈ కోవలో వరుసగా తైవాన్(9.6%), జపాన్(9.5%), ఇటలీ(8.4%), సింగపూర్(8%) మేర పతనమయ్యాయి. స్వీడన్, చైనా, స్విట్జర్లాండ్ సూచీలకు కూడా 7% మేర నష్టం వాటిల్లింది.

మరింత కిందికే..!

మార్కెట్ల పతనం మంగళవారం కూడా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. చైనా తన 34% శాతం ప్రతీకార సుంకాలను వెనక్కి తీసుకోకపోతే ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాలను ప్రస్తుత 34 నుంచి 50 శాతానికి పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా

మిగతా 2వ పేజీలో...

వంట గ్యాస్ మంట

గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంపు



ఉజ్వల వినియోగదారులకూ వర్తింపు
నేటి నుంచి అమల్లోకి
హైదరాబాద్‌లో 905కి చేరనున్న ధర
లీటరు పెట్రోల్, డీజిల్‌పై
రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకం పెంపు
వినియోగదారులపై భారం పడదు
ఎక్సైజ్ సుంకం పెంపుతో
సర్కారుకు రూ.32,000 కోట్లు
అంతర్జాతీయ మార్కెట్ ధరను బట్టి
గ్యాస్ ధర పెంచామన్న కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను సోమవారం ఏకంగా రూ.50 మేర పెంచింది. ఈ పెంపు సాధారణ వినియోగదారులకేకాకుండా ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా వర్తిస్తుంది. కొత్త ధరలు మంగళవారం (8వ తేదీ) నుంచి అమల్లోకి వస్తాయని చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. తాజా పెంపుతో ఢిల్లీలో సాధారణ వినియోగదారులు సిలిండర్‌కు రూ.853 చెల్లించాల్సి ఉంటుంది. స్థానిక పన్నులను బట్టి ధరలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం సాధారణ వినియోగదారులు సిలిండర్‌కు రూ.855 చెల్లిస్తుండగా.. పెరిగిన ధరతో ఇది రూ.905 అవుతుంది. గ్రేటర్ పరిధిలో

మిగతా 2వ పేజీలో...

గ్యాస్ సిలిండర్ ధర పెంపు.. 14

రాష్ట్రంలో 91 లక్షల కుటుంబాలపై ప్రభావం

31 లక్షల మంది మహాలక్ష్మి లబ్ధిదారులకు ఊరట
వారిపై భారం మోపకూడదని సర్కారు నిర్ణయం

మహిళలకు రైస్‌మిల్లులు

రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు

మండల సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు
ఒక్కో మిల్లు నిర్మాణానికి రూ. 3.50 కోట్ల ఖర్చు
ఉచితంగా స్థలం కేటాయించనున్న సర్కారు
స్థల సేకరణ, ఎంపిక బాధ్యత జిల్లా కలెక్టర్లకు
553 మండల మహిళా సమాఖ్యలకు మిల్లులు
ప్రభుత్వ స్థలాలున్న మండలాల్లో తొలుత షురూ
చురుగ్గా పనిచేస్తున్న, టర్నోవర్ ఎక్కువగా
ఉన్న సమాఖ్యలకు మొదట అవకాశం
ఎమ్మెల్యేల ప్రతిపాదనలకూ ప్రాధాన్యం
మిల్లులకు అనుబంధంగా మార్కెటింగ్ శాఖ
ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సౌర విద్యుదుత్పత్తి రంగాల్లో మహిళలను భాగస్వాములను చేసిన ప్రభుత్వం... రైస్‌మిల్లు పరిశ్రమలోకి కూడా వారిని తీసుకొచ్చే కార్యాచరణను ప్రారంభించింది. ప్రతి మండలంలో ఒక రైస్‌మిల్లు నిర్మించేలా మహిళా సంఘాలకు తోడ్పాటు అందించేందుకు సిద్ధమైంది. ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్‌మిల్లులు ఏర్పాటు

మిగతా 12వ పేజీలో...



కొందరు అధికారులే నిజమైన అంధులు

అంధ ఉద్యోగులను కోర్టు చుట్టూ తిప్పడంపై హైకోర్టు ఆగ్రహం 12



కొత్త వక్ఫ్ చట్టంపై సత్వర విచారణకు

సుప్రీం అంగీకారం!

లిస్టింగ్ చేస్తామని చెప్పిన సీజేఐ 2
కొత్త వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధం
సమానత్వం, మతాన్ని అనుసరించే స్వేచ్ఛకు భంగం.. పిటిషనర్ల ఫిర్యాదు



25,000 కొలువులు

మెగా టెక్స్‌టైల్ పార్కులో భర్తీకి కిటెక్స్ ప్రకటన.. నేటి నుంచే ఇంటర్వ్యూలు
విడతల వారీగా భర్తీ చేయనున్న కంపెనీ
త్వరలో వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో మరిన్ని కంపెనీల పెట్టుబడులు
విమానాశ్రయం వస్తుండడంతో ఆసక్తి
పార్కు విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
పీఎం మిత్ర పథకం కింద గుర్తించాలని కేంద్రానికి సర్కారు విజ్ఞప్తి 14

హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల

ఎత్తివేత



వర్సిటీ క్యాంపస్ నుంచి బలగాల ఉపసంహరణ
రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థుల విడుదలకు చర్యలు
ఫేక్ ఫొటోలు, వీడియోల ప్రచారంపై కేసులు తప్పవు
వర్సిటీ టీచర్లతో భేటీ అనంతరం భట్టి కమిటీ నిర్ణయం
400 ఎకరాల్లో పోలీసుల మోహరింపు ఉంటుంది
సుప్రీంలో తేలేవరకు దాని యథాతథ స్థితిని కాపాడాలి
కారణాలను వివరించిన మంత్రుల బృందం
సచివాలయ భేటీకి హాజరైన మీనాక్షి నటరాజన్
ఫేక్ వీడియోలపై కఠిన చర్యలకు సీఎం రేవంత్ ఆదేశం
ఇప్పటికే 150 మందిపై కేసులు నమోదు
పోస్టులను తొలగించిన కిషన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విషయంలో ప్రభుత్వం కొన్ని ఉపశమన చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులను చల్లబర్చే నిర్ణయాలు తీసుకుంది. కంచ గచ్చిబౌలి స్థలం విషయంలో ఉద్యమించిన విద్యార్థులపై నమోదైన కేసులను సోమవారం ఉపసంహరించింది. యూనివర్సిటీలోని పోలీసు బలగాలను కూడా ఉపసంహరించుకుంది. అయితే కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా తప్పుడు (ఫేక్) ఫొటోలు, వీడియోలు ప్రచారం చేసిన వారిపై మాత్రం కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. అలాంటి ఫొటోలు, వీడియోలను

మిగతా 13వ పేజీలో...

నెమళ్ల అరుపులు.. జింకల పరుగులు..

13

అంతా ఉత్తదే

ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం.. హైకోర్టుకు తెలిపిన సర్కారు
కౌంటర్ దాఖలుకు రెవెన్యూ, అటవీ శాఖలకు హైకోర్టు ఆదేశం
ఇరుపక్షాల కోరిక మేరకు విచారణ 24కు వాయిదా

గుట్టుగా వ్యాధులు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీపీ, షుగర్, ఫ్యాటీలివర్

దీర్ఘకాల వ్యాధులున్నట్లు తెలియకుండానే జీవిస్తున్న లక్షలాది మంది



అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదిక
దేశవ్యాప్తంగా 25 లక్షల మందికి వైద్యపరీక్షలు
తెలంగాణలో 23% మందికి అధిక రక్తపోటు
ప్రీ-హైపర్ టెన్షన్ దశలో మరో 55 శాతం మంది
షుగర్ పేషెంట్లు 25%.. ప్రీడయాబెటిక్ దశలో 34%
49% మందికి గ్రేడ్1 ఫ్యాటీలివర్.. 5శాతానికి గ్రేడ్2
ఫ్యాటీలివర్ ఉన్నవారిలో మద్యం తాగనివారు 85%
మెనోపాజ్ తర్వాత మహిళల్లో షుగర్, ఊబకాయం
స్త్రీ, పురుషులిద్దరిలోనూ డి విటమిన్ లోపం ఎక్కువే
చిన్నపిల్లల్లోనూ ఊబకాయం.. యువతకు హైబీపీ
కాలేజీ విద్యార్థుల్లో 19% ప్రీ హైపర్‌టెన్షన్ దశలో!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు.. పైకి ఏ లక్షణమూ కనిపించదు! లోలోపలే శరీరానికి తీరని నష్టం చేస్తుంది!! మధుమేహం.. అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలున్నా చాలామంది పట్టించుకోరు!! ఈ రెండింటికీ తోడు.. ఇటీవలికాలంలో బాగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్!! పరీక్ష చేస్తే కానీ బయటపడని ఈ జీవన శైలి రుగ్మతలు తమకు ఉన్నాయన్న విషయం కూడా తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాలం గడిపేస్తున్నట్టు అపోలో ఆస్పత్రి సోమవారం విడుదల చేసిన 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న అపోలో ఆస్పత్రుల్లో 25 లక్షలమందికిపైగా వ్యక్తులకు చేసిన ఆరోగ్య

మిగతా 14వ పేజీలో...

గోదావరి-బనకచర్ల చేపట్టొద్దు

పోలవరం విస్తరణతో అనుసంధానం చేస్తున్నారు
గోదావరి బోర్డు సమావేశంలో తెలంగాణ అభ్యంతరం
ప్రాజెక్టు డీపీఆర్‌ను తెలంగాణకు ఇచ్చేందుకు ఏపీ ఓకే
పెద్దవాగు ఆధునికీకరణ పనులకు ఏపీ సమ్మతి
ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించబోమన్న 2 రాష్ట్రాలు
బోర్డు సభ్యకార్యదర్శిపై విచారణ కమిటీ: బోర్డు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి-బనకచర్ల అనుసంధానంపై తెలంగాణ మరోసారి అభ్యంతరం వ్యక్తం చేసింది. బచావత్ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం ప్రాజెక్టును విస్తరించి.. ఈ అనుసంధానం చేపడుతున్నారని తప్పుబట్టింది. 1980లో బచావత్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ప్రకారం 10 వేల క్యూసెక్కుల (283 క్యూమెక్కుల) సామర్థ్యంతో పోలవరం కుడి, ఎడమ కాలువల నిర్మాణానికే అనుమతి ఉందని గుర్తు చేసింది. కానీ, ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా, ఎలాంటి సహేతుకత లేకుండా 2019లో 141వ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ)లో ఒక్కో

మిగతా 3వ పేజీలో...



వీర్య నిరోధక మాత్ర!

హార్మోన్ రహిత ట్యాబ్లెట్ వైసీటీ 529ను అభివృద్ధి చేసిన అమెరికా శాస్త్రజ్ఞులు
99% సామర్థ్యంతో పని చేస్తున్నట్టు ఎలుకలు, కోతులపై ప్రయోగాల్లో వెల్లడి
మనుషులపై తొలి దశ ట్రయల్స్ పూర్తి.. న్యూజిలాండ్‌లో 2వ దశ
ఈ దశాబ్దం చివరికి అందుబాటులోకి వచ్చే చాన్స్?

లండన్: మీరు ప్రపంచంలో ఏ దేశానికైనా వెళ్లండి. గర్భనిరోధక మాత్రలంటే మహిళలు మాత్రమే వాడేవి దొరుకుతాయి. పురుషులు వాడే మాత్రలు ఎక్కడా దొరకవు. దాదాపు ఏడెనిమిది దశాబ్దాలుగా ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నా 'మేల్ బర్త్ కంట్రోల్ పిల్స్'ను మాత్రం అభివృద్ధి చేయలేకపోయారు. కానీ, యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటాకు చెందిన శాస్త్రజ్ఞులు తాము ఆ అద్భుతాన్ని సాధించామని చెబుతున్నారు. కొలంబియా

మిగతా 2వ పేజీలో...

అధ్యక్షా..!

నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం.. కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్ 12
బీజేపీ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య
సీపీఐ నుంచి సత్యం, పీఆర్‌టీయూ శ్రీపాల్‌రెడ్డితో ప్రమాణం చేయించిన చైర్మన్ సుఖేందర్‌రెడ్డి
హాజరైన కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలు, మంత్రులు



ఎమ్మెల్సీ విజయశాంతికి కిట్‌ను అందజేస్తున్న మండలి చైర్మన్ గుత్తా

మహా పతనం!

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్ పతనానికి ఇప్పట్లో విరామం ఉంటుందనే సూచనలు కనిపించడం లేదు. గత ఏడాది అక్టోబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో.. "కమల గెలిస్తే.. మార్కెట్లు ఎరుపెక్కుతాయి. 1926 నాటి మాంద్యం తిరిగి వస్తుంది" అని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే.! కమల గెలవకున్నా.. ట్రంప్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించినా.. సుంకాల విధింపుతో మార్కెట్లు ఎరుపెక్కడం గమనార్హం.! మంగళవారం స్వల్పకాలానికి నిఫ్టీకి 21,700 దగ్గర గట్టి మద్దతు కనిపిస్తోందని, అది కూడా బ్రేకయితే 21,000 దిగువకు కూడా చేరే ప్రమాదం ఉందని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మహా నగరాల్లో ఇలాంటివి మామూలే!

▸ మహిళలపై దాడుల పట్ల కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్



బెంగళూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై హోం మంత్రి పరమేశ్వర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అర్ధరాత్రి నడిచి వెళుతున్న అన్నాచెల్లెలిపై దాడి, ఆపై సోదరిపై అత్యాచారం, సుద్దగుంటపాళ్యలో నడిచి వెళుతున్న ఇద్దరు యువతుల పట్ల ఆకతాయి అసభ్య ప్రవర్తన గురించి మీడియా ప్రశ్నించగా.. బెంగళూరు వంటి మహా నగరాల్లో ఇలాంటి ఘటనలు సాధారణమని హోం మంత్రి అన్నారు. నగరంలో గస్తీ పెంచాల్సిందిగా పోలీసులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున సుద్దగుంటపాళ్య పరిధిలోని భారతి లే అవుట్‌లో ఇద్దరు యువతులు నడిచి వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఒక్కసారిగా యువతి పట్ల అనుచితంగా ప్రవర్తించాడని, ఈ సంఘటన సీసీ కెమెరాలో రికార్డు అయిందని ఆయన అన్నారు. బాధితురాలు ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. మరోవైపు.. పరమేశ్వర్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఇది జరిగిన ఘటనను చిన్నదిగా చూపించే ప్రయత్నమని ఆ పార్టీ నేత షెహజాద్ పేర్కొన్నారు.

2026 కల్లా 12 భాషల్లో ఇంజనీరింగ్ పుస్తకాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: అన్ని ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సుల పుస్తకాలను 12 ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రతిష్ఠాత్మక ప్రణాళికపై ఏఐసీటీఈ కసరత్తు వేగవంతం చేసింది. ఇందుకు 2026 డిసెంబరును డెడ్‌లైన్‌గా పెట్టుకుంది. ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సుల మొదటి, రెండవ సంవత్సరాల కోసం 600 పుస్తకాలు ఇప్పటికే సిద్ధమయ్యాయని, వాటిని తెలుగు సహా 12 ప్రాంతీయ భాషల్లో అప్‌లోడ్ చేశామని పేర్కొన్నారు. 3, 4 సంవత్సరాలకు సంబంధించిన అనువాద పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనువాద ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏఐసీటీఈ ఏఐని వినియోగిస్తోంది.

భారత్ సహా 14 దేశాలపై సౌదీ వీసా నిషేధం

రియాద్, ఏప్రిల్ 7: సౌదీ అరేబియా తన దేశానికి వచ్చే విదేశీ పర్యాటకులపై కొరడా ఝుళిపించింది. హజ్ యాత్ర త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత్‌తోపాటు 14 దేశాల ముస్లిం పౌరులకు వీసాల జారీపై నిషేధం విధించింది. ఆ జాబితాలో దాయాది పాకిస్థాన్‌తోపాటు మొరాకో, నైజీరియా, అల్జీరియా, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాక్, జోర్డాన్, సుడాన్, ట్యునీషియా, యెమెన్ ఉన్నాయి. వీరు తమ దేశాల కోటాతో సంబంధం లేకుండా అనధికారికంగా హజ్‌యాత్రలో పాల్గొనడంతోపాటు వీసా నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ కాలం బస చేస్తున్నారని సౌదీ ఆందోళన వ్యక్తం చేసింది.

మైక్రోసాఫ్ట్ టెక్నాలజీ వల్లే గాజాలో మారణహోమం

ఇజ్రాయెల్‌కు సాయం సిగ్గుచేటు.. భారతీయ ఉద్యోగిని నిరసన



వనియా అగర్వాల్

వాషింగ్టన్, ఏప్రిల్ 7: మైక్రోసాఫ్ట్ అర్ధశత వార్షికోత్సవ కార్యక్రమంలో వనియా అగర్వాల్ అనే భారతీయ సంతతికి చెందిన ఆ కంపెనీ ఉద్యోగిని పాలస్తీనాకు అనుకూలంగా నిరసన తెలిపారు. 'సిగ్గుచేటు' అంటూ తీవ్ర స్వరం వినిపించారు. 'మీరు సంకుచిత మనుషులు. ఇజ్రాయెల్‌కు మైక్రోసాఫ్ట్ అందించిన సాంకేతికత కారణంగానే గాజాలో యాభై వేలమంది హతమయ్యారు. వాళ్ల రక్తంలో పండగ చేసుకోవడానికి ఎంత ధైర్యం? మిమ్మల్ని చూసి సిగ్గుపడుతున్నాను" అని అన్నారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సమక్షంలో వాషింగ్టన్‌లోని రెడ్‌మాండ్‌లో గత వారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో కంపెనీ సీఈవో సత్య నాదెళ్ల, మాజీ సీఈవో స్టీవ్ బాల్మెర్ వేదికపైనే ఉన్నారు. అక్కడ నుంచి బయటకురావడంతోనే, సంస్థను వీడుతున్నట్టు వనియా ప్రకటించారు. వనియా మైక్రోసాఫ్ట్‌లో 2023లో చేరారు. ప్రస్తుతం ఆ సంస్థ ఏఐ విభాగంలో ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సైన్యం గడిచిన నెల రోజుల వ్యవధిలో గాజాలో సగ భాగాన్ని అదుపులోకి తెచ్చుకుంది. దాదాపు 3కిలోమీటర్ల మేర గాజా భూభాగంలోకి చొచ్చుకుపోయింది.

2026 నాటికి ఏపీలో అణు జలాంతర్గామి స్థావరం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: సముద్ర రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా మరో కీలక ముందడుగు పడనుంది. తూర్పు తీరంలో రక్షణ అవసరాల కోసం నిర్మిస్తున్న నేవీ ప్రత్యామ్నాయ స్థావరం 'ఐఎన్ఎస్ వర్ష'ను 2026లో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి 50 కి.మీ. దూరాన అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో సముద్ర తీరాన్ని ఆనుకొని దీన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం 670 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించింది. దీని తొలి దశ నిర్మాణం 2022 నాటికి, మలి దశ నిర్మాణం 2025 నాటికి పూర్తి కావలసి ఉంది. కానీ కొవిడ్ వంటి కారణాల వల్ల ఆలస్యమైంది. ఇప్పుడు తొలిదశ నిర్మాణం పూర్తి కావొచ్చింది. హిందూ సముద్ర ప్రాంతంలో చైనా చర్యలపై నిఘాకు ఈ స్థావరం ఉపయోగపడుతుంది.

స్కైరూట్ 'కలాం-100' ఇంజన్ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్కైరూట్.. తన విక్రమ్-1 రాకెట్‌కు శక్తినిచ్చే 3వ దశ ఇంజన్ కలాం-100కు ఫైర్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించింది. పరీక్ష సమయంలో రాకెట్ 100 కేఎన్ పీక్ వాక్యూమ్ థ్రస్ట్‌ను ఉత్పత్తి చేసిందని ప్రకటించింది. కచ్చితమైన థ్రస్ట్ వెక్టర్ కోసం అధునాతన ఫ్లెక్స్ నాజిల్‌ను ఉపయోగించి కలాం-100 ఇంజన్‌ను 102 సెకన్లపాటు మండించినట్టు తెలిపింది. 'స్కైరూట్ విక్రమ్-1 మిషన్‌లో కీలక ముందడుగు పడింది. కలాం-100కు స్టాటిక్ ఫైర్ టెస్ట్ విజయవంతమైంది' అని పేర్కొంది.

ఎల్‌సీహెచ్ హెలికాప్టర్ల తయారీ ప్రైవేటుకు..!

బెంగళూరు, ఏప్రిల్ 7: భారత సైన్యం, వైమానిక దళాల కోసం 156 లైట్ కాంబాట్ హెలికాప్టర్లు (ఎల్‌సీహెచ్) అందించేందుకు రూ.62,500 కోట్లతో భారీ ఒప్పందం కుదుర్చుకున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) అందులో రూ.25వేల కోట్ల విలువైన పనులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రైవేటురంగ సంస్థలకు అప్పగించనుంది. స్వదేశీ రక్షణ తయారీని ప్రోత్సహించే దిశగా ఈ ఒప్పందం జరిగింది. ఎల్‌సీహెచ్ ప్రాజెక్టులో ప్రైవేటు రంగాన్ని పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసేందుకు హాల్ త్వరలోనే టెండర్లు పిలవనుందని రక్షణ అధికారులు వెల్లడించారు.

ఎన్‌టీఏపై కేసును మూసివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్ పరీక్షల నిర్వహణపై నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం నీట్ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై నమోదైన కేసును మూసివేసింది. గత ఏడాది నీట్-యూజీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో.. పకడ్బందీగా పరీక్ష నిర్వహణపై సిఫారసుల కోసం ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో కమిటీని కేంద్రం నియమించింది. తాజాగా, ఆ సిఫారసులను అమలు చేస్తామని కోర్టుకు తెలిపింది.

వంట గ్యాస్ మంట



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో 19 లక్షలు, ఉమ్మడి రంగారెడ్డిలో 12-13 లక్షల మంది గృహ ఎల్‌పీజీ వినియోగదారులున్నారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. అయితే ఈ పెంపు భారం వాహనదారులపై పడదని, ఇంధనాల రిటైల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని ఆయిల్ కంపెనీలు పేర్కొన్నాయి. మన దేశంలో వార్షికంగా 16,000 కోట్ల లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను వినియోగిస్తున్నారు. ఈ ఇంధనాలపై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం వల్ల కేంద్ర ఖజానాకు రూ.32,000 కోట్ల వరకు సమకూరనుంది. పెంచిన ఎక్సైజ్ సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయి.

ఎక్సైజ్ సుంకం పెంపుతో నష్టాల భర్తీ

ఎల్‌పీజీ ధరల నిర్ణయానికి వినియోగించే అంతర్జాతీయ బెంచ్ మార్క్ అయిన సౌదీ సీపీ సగటు 2023 జూలైలో టన్నుకు 385 డాలర్లు ఉండగా.. 2025 ఫిబ్రవరిలో 629 డాలర్లకు పెరిగిందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. 63 శాతం మేర పెరుగుదల నమోదైన ఫలితంగా ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధరను రూ.1,028.50గా నిర్ణయించాల్సిన అవసరం ఏర్పడినట్టు చెప్పారు. కానీ ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సర్దుబాటు చేస్తున్నాయని తెలిపారు. ఎల్‌పీజీని తక్కువ ధరకు విక్రయించడం వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు రూ.41,338 కోట్ల నష్టాన్ని చవిచూశాయని చెప్పారు. నష్టాలు కొండలా పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలను మోస్తరుగా పెంచినట్టు తెలిపారు. ప్రస్తుత ధరల వద్ద ఉజ్వల వినియోగదారుల వంటకు రోజుకు అయ్యే వ్యయం రూ.6.10 ఉండగా.. సాధారణ వినియోగదారులకైతే రూ.14.58 ఉంటోందని, ఇది సహేతుకమేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెలా రేట్లను సమీక్షిస్తామని, తగ్గితే వినియోగదారులకు బదిలీ చేస్తామని తెలిపారు. సిలిండర్‌పై పెంచిన రూ.50 ఇంతకుముందటి, భావి వ్యయాలను మాత్రమే కవర్ చేస్తాయన్న ఆయన ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఆయిల్ మంత్రిత్వ శాఖ బడ్జెటరీ మద్దతును కోరుతుందని ఆయన చెప్పారు. ఎక్సైజ్ సుంకం పెంపుతో సమకూరే అదనపు మొత్తాన్ని ఆయిల్ కంపెనీల నష్టాలను భర్తీ చేసేందుకు వినియోగించనున్నట్టు తెలిపారు.

15 నెలల్లో 9సార్లు పెంపు

11 ఏళ్ల మోదీ సర్కారు హయాంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పుడల్లా ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన సందర్భాలున్నాయి. 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకు పెట్రోల్, డీజిల్‌పై తొమ్మిదిసార్లు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పుడు కలిగే ప్రయోజనాన్ని ప్రభుత్వమే పొందినట్టయింది. ఈ 15 నెలల్లో లీటరు పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.11.77, డీజిల్‌పై రూ.13.47 పెంచారు. దీంతో 2014-15లో రూ.99,000 కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయం 2016-17లో ఏకంగా రెండింతలకు పైగా పెరిగి రూ.2,42,000 కోట్లకు చేరింది. అయితే కేంద్రం 2017 అక్టోబరులో ఎక్సైజ్ సుంకాన్ని రూ.2, ఏడాది తర్వాత రూ.1.50మేర తగ్గించింది. కానీ 2019 జూలైలో లీటరుపై రూ.2 మేర ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. తర్వాత 2020 మార్చిలో లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. 2020 మార్చి, 2020 మే మధ్య లీటరు పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.16 మేర పెంచింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రం గత ఏడాదిలో లీటరు పెట్రోల్, డీజిల్ ధరలను రూ.2 చొప్పున తగ్గించింది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాలతో తాజాగా ముడిచమురు ధరలు దిగివస్తున్నా కేంద్రం మాత్రం ధరలను తగ్గించకపోవడంతో వాహనదారులకు ఊరట లభించడం లేదని పరిశీలకులు అంటున్నారు. కాగా, ఇంద్రప్రస్థా గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) సీఎన్‌జీ ధరలను పెంచింది. ఢిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ.1మేర పెరగడంతో రూ.76.09కి చేరుకుంది.

పుండు మీద కారం చల్లినట్టుగా..: ఖర్గే

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం పెంచడం పట్ల కాంగ్రెస్ మండిపడింది. స్టాక్ మార్కెట్ కుప్పకూలడంతో కలిగిన నష్టాలతో సంతృప్తి చెందకపోగా.. పుండు మీద కారం పూసినట్టుగా తాజా నిర్ణయం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. "వాహ్ మోదీ వాహ్!! 2014 మేతో పోల్చితే అంతర్జాతీయ మార్కెట్లో ఆయిల్ ధరలు 41% మేర తగ్గాయి. ఇలాంటి తరుణంలో మీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడానికి బదులు రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. టారిఫ్ విధానంపై కుంభకర్ణుడి మాదిరిగా నిద్రపోవడం వల్ల ఒక్కసారిగా స్టాక్ మార్కెట్లో చిన్నా, పెద్దా ఇన్వెస్టర్లు రూ.19 లక్షల కోట్లు నష్టపోయినా సంతృప్తి చెందక.. మీ ప్రభుత్వం పుండుమీద కారం చల్లింది" అని మండిపడ్డారు. చివరకు ప్రధాని మోదీ ఎక్సైజ్ సుంకం పెంపుతో టారిఫ్‌లకు తగిన సమాధానమిచ్చారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.

అంతా బ్రహ్మాండంగా ఉంది!

▸ చమురు ధరలు, వడ్డీ రేట్లు తగ్గాయి.. అసలు ద్రవ్యోల్బణమే లేదు: ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 7: అమెరికా ప్రతీకార సుంకాల దెబ్బకు ఒకపక్క ప్రపంచమార్కెట్లన్నీ దారుణంగా పతనమై.. మదుపర్లకు రూ.లక్షల కోట్ల నష్టం వచ్చి 'బేర్'మంటున్నారు! మరోవైపు.. ఈ సుంకాల వల్ల వాణిజ్య యుద్ధం జరిగి, ధరలు పెరిగి ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచమంతా ఇంత కలవరపడుతున్నా.. ట్రంప్ మాత్రం 'అంతా బానే ఉంది' అంటూ తాపీగా తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్టు పెట్టారు. "చమురు ధరలు తగ్గాయి. వడ్డీరేట్లు తగ్గాయి. ఆహార ధరలు తగ్గాయి. అసలు ద్రవ్యోల్బణమే లేదు. అన్నింటికీ మించి.. దీర్ఘకాలంగా అమెరికాను మోసం చేస్తున్న దేశాల నుంచి సుంకాల రూపంలో గత వారంరోజులుగా బిలియన్ల కొద్దీ డాలర్లు వస్తున్నాయి" అని ఆ పోస్టులో ఆయన పేర్కొన్నారు. అందునా ఇన్నాళ్లుగా అమెరికాను అధిక సుంకాలతో దోచుకున్న చైనా మళ్లీ తన సుంకాలను 34 శాతం మేర అధికంగా పెంచిన తర్వాత కూడా అమెరికాకు ఇంత మంచి జరుగుతోందని పేర్కొన్నారు. అమెరికా మంచితనాన్ని అలుసుగా తీసుకుని చైనా దశాబ్దాలుగా ఇలా సుంకాలను దుర్వినియోగం చేస్తోందన్న ఆయన.. దీనికి కారణం గత పాలకులేనని విమర్శించారు.

ప్రతీకార సుంకాన్ని ఉపసంహరించకుంటే..
చైనాపై 50% అదనపు సుంకం



అమెరికా విధించిన ప్రతీకార సుంకానికి స్పందనగా.. తాము కూడా అమెరికన్ ఉత్పత్తుల దిగుమతులపై 34% సుంకం విధిస్తున్నట్టు చైనా చేసిన ప్రకటనపై ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "చైనా గనక తాజాగా మాపై విధించిన ఆ 34% అదనపు సుంకాన్ని మంగళవారంలోగా ఉపసంహరించుకోకుంటే.. చైనాపై బుధవారం నుంచి వర్తించేలా, ఇప్పుడున్నదానికి అదనంగా మరో 50% సుంకాన్ని అమెరికా విధిస్తుంది. అంతేకాదు.. మాతో చైనా అభ్యర్థన మేరకు ఆ దేశంతో చేస్తున్న చర్చలన్నింటినీ పూర్తిగా రద్దుచేస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు.

లోకం తీరు



మినికాయ్ ద్వీపం నుంచి ఢిల్లీకి
ఎగిరొచ్చిన అమీనా

▸ కేంద్రమంత్రి రామ్మోహన్ చొరవతో మోదీతో ముద్రా లబ్ధిదారు భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆమె పేరు అమీనా మనీకా. టూరిజం, ట్రావెల్ మేనేజిమెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. రైల్ టెల్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని లక్షద్వీప్‌లోని మినికాయ్ ద్వీపంలో హైస్పీడ్ ఫైబర్ టు హోమ్ ఇంటర్నెట్ సర్వీసులను ఇంటింటికీ అందించారు. ఇందుకు కొచ్చి-లక్షద్వీప్ ద్వీపంలోని సబ్‌మెరైన్ కేబుల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకున్నారు. మోదీ ముద్రా యోజన పథకం ద్వారా అందించిన ఆర్థిక సహాయంతోనే ఆమె ఈ కార్యక్రమాన్నంతటినీ నిర్వహించగలిగారు. ఈ ఘనత సాధించిన అమీనాను సత్కరించాలని కేంద్రం నిర్ణయించింది. సోమవారం ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా మూడు రోజుల కిందటే ఆమెకు ఆహ్వానం అందింది. కానీ.. లక్షద్వీప్‌లోని మినికాయ్ ద్వీపం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసు లేదు. దీంతో ఆమె తన పరిస్థితిని వివరిస్తూ పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన రామ్మోహన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో మినికాయ్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఆమె అగత్తికి, అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి వచ్చి మోదీని కలిశారు.



పవన్ హన్స్ హెలికాప్టర్ వద్ద అమీనా

రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తేస్తాం

పట్నాలో సంవిధాన్ సురక్ష సమ్మేళన్‌లో రాహుల్



పలాయన్ రోకో పాదయాత్రలో రాహుల్‌గాంధీ

పట్నా, ఏప్రిల్ 7: రిజర్వేషన్లపై 50% పరిమితి అనేది బూటకపు పరిమితి అని, దానిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోమవారం బిహార్‌లోని పట్నాలో నిర్వహించిన 'సంవిధాన్ సురక్ష సమ్మేళన్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల ప్రజలను దేశంలో రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని అన్నారు. వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం కలిగించేందుకు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తుందని రాహుల్ పేర్కొన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం(కులగణన సర్వే) నిర్వహించిందని తెలిపారు. సంవిధాన్ సురక్ష సమ్మేళన్‌లో పాల్గొనడానికి ముందు రాహుల్ బెగుసరాయి జిల్లాలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'పారిపోకండి, ఉద్యోగాలు ఇవ్వండి(పలాయన్ రోకో, నౌకరీ దో)' పాదయాత్రలో పాల్గొన్నారు. బిహార్‌లో నిర్వహిస్తున్న వైట్ టీ షర్ట్ ఉద్యమంలో పాల్గొనాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

నేడు, రేపు ఏఐసీసీ సమావేశాలు


జాతీయ రాజకీయాలకు సంబంధించిన కీలక అంశాలు, సవాళ్లపై చర్చించేందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) మంగళ, బుధవారాల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సమావేశం కానుంది. జిల్లా అధ్యక్షులకు మరిన్ని అధికారాలు ఇవ్వడం, జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సహా పార్టీ సంస్థాగత పునరుజ్జీవనానికి సంబంధించిన అనేక కీలక తీర్మానాలను ఈ సమావేశాల్లో చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాలనూ ఈ సమావేశాలలో ఖరారు చేయనున్నారు. ఈ ఏడాది బిహార్, వచ్చే ఏడాది కేరళ, అసోం, బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగనున్నాయి. ఏఐసీసీ సమావేశాల్లో తొలిరోజు సర్దార్ పటేల్ స్మారకం వద్ద సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరుకానున్నారు.

బీజేపీకి రూ.2,243కోట్ల విరాళాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి విరాళాల వరద పోటెత్తింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పార్టీకి ఏకంగా రూ.2,243 కోట్ల మేరకు విరాళాల రూపంలో నిధులు అందాయి. అన్ని జాతీయ పార్టీలకు కలిపి అందిన విరాళాల్లో 88% నిధులు ఒక్క బీజేపీ ఖాతాలోనే పడ్డాయి. 8,358 మంది నుంచి రూ.2,243 కోట్ల విరాళాలు కమలం పార్టీకి లభించాయి. వీరిలో 3,478 మంది కార్పొరేట్ దిగ్గజాలు, వ్యాపార వేత్తలే ఉండడం గమనార్హం. బీజేపీకి అందిన మొత్తం విరాళాల్లో వీరి వాటా రూ.2,262.55 కోట్లు కావడం విశేషం. ఇక, కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే రూ.281.48 కోట్లు మాత్రమే విరాళాల రూపంలో సమకూరాయి. ఈ ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం జాతీయ పార్టీలకు మొత్తం రూ.2544.28 కోట్లు విరాళాలుగా అందాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ బీజేపీకి రూ.723.675 కోట్లు విరాళంగా ఇచ్చింది. కాగా, కొన్ని కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన వివరాలను బీజేపీ దాచినట్టు ఏడీఆర్ పేర్కొంది.

కొత్త వక్ఫ్ చట్టంపై సత్వర విచారణకు సుప్రీం ఓకే!

లిస్టింగ్ చేస్తామని చెప్పిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సత్వరం వినేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం జమాత్ ఉలేమా ఇ హింద్ తరఫున న్యాయవాది కపిల్ సిబ్బల్, ఇతర పిటిషనర్ల తరుఫున అభిషేక్ సింఘ్వీ, నిజామ్ పాషా మరికొందరు న్యాయవాదులు చేసిన లిఖిత పూర్వక విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని సత్వర విచారణ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, మతాన్ని అనుసరించే స్వేచ్ఛకు కొత్త చట్టంతో భంగం కలుగుతోందని జమాత్ ఉలేమా ఇ హింద్ తన పిటిషన్‌లో పేర్కొంది. ముస్లిములకు తమ మతాన్ని అనుసరించే హక్కును హరించే ప్రమాదకరమైన కుట్రగా కొత్త వక్ఫ్ చట్టాన్ని అభివర్ణించింది. కొత్త చట్టంతో వక్ఫ్ ఆస్తుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డులకు ఉన్న హక్కులన్నీ హరించుకు పోయాయని పేర్కొంది. వక్ఫ్‌లకు ఉన్న అనేక రక్షణలను కొత్త చట్టం తొలగించివేసిందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లుకు శనివారం అర్ధరాత్రి రాష్ట్రపతి ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆ చట్టానికి సంబంధించి విధివిధానాలు రూపొందిస్తే అవి వెంటనే అమల్లోకి వస్తాయి. ఈ నేపథ్యంలోనే ముస్లిం సంస్థలు సత్వర విచారణ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఇదిలా ఉండగా, వక్ఫ్ వ్యవహారంపై మణిపూర్‌లో హింస చెలరేగింది. బీజేపీ మోర్చా అధ్యక్షుడు అస్కర్ అలీ ఇంటిని 7వేల మంది చుట్టుముట్టి నిప్పు పెట్టారు.

పిటిషనర్ల ప్రధాన అభ్యంతరాలు ఇవే


- ఎలాంటి కాగితాలు లేకుండా ఎంతోకాలంగా ముస్లిముల వినియోగంలో ఉన్న ఆస్తులు వక్ఫ్ ఆస్తులే అన్న అంశాన్ని చట్టంలో ఎత్తేశారు. దాంతో చాలా ఆస్తులు వివాదంలో పడే ప్రమాదం ఉంది. వక్ఫ్ బై యూజర్ అన్న విషయాన్ని బాబ్రీ మసీదు కేసులోనూ సుప్రీంకోర్టు అంగీకరించిందని పిటిషనర్లు గుర్తు చేశారు.
- వక్ఫ్ బోర్డుల నిర్వహణను చేపట్టే ప్రభుత్వ అధికారిగా సీఈవో ముస్లిం ఉండాలని పాత చట్టం చెబుతోంది. కొత్తచట్టం దాన్ని ఎత్తేసింది. కాగా, కొత్త వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లు ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగమని బీజేపీ వ్యాఖ్యానించింది. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న భూమాఫియా ప్రయోజనాలు మాత్రమే కొత్త చట్టంతో దెబ్బతిన్నాయని పేర్కొంది.

సుప్రీంకోర్టు చెప్పినా.. మీ ఉద్యోగాలు పోవు!

పశ్చిమ బెంగాల్‌లో సుప్రీం కోర్టు ఉత్తర్వులతో ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులకు తానున్నానని ఆ రాష్ట్ర సీఎం మమత భరోసా ఇచ్చారు. ఆమె సోమవారం వారితో సమావేశమయ్యారు. కోర్టు నిర్ణయాన్ని తాము అంగీకరించామని భావించవద్దన్నారు. ఇలా చెప్పినందుకు తాను జైలు పాలయినా లెక్క చేయనని అన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. అయితే వారిలో అర్హులెవరు ఉద్యోగాలు కోల్పోరని, వారి సర్వీసులో బ్రేక్ కూడా ఉండదని మమత హామీ ఇచ్చారు.

వీర్య నిరోధక మాత్ర!

(మొదటి పేజీ తరువాయి)



వర్సిటీ, శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన యువర్ ఛాయిస్ థెరప్యూటిక్స్ శాస్త్రజ్ఞులతో కలిసి వారు సంయుక్తంగా ఈ పరిశోధనలు జరిపి 'వైసీటీ-529' అనే 'హార్మోన్ రహిత గర్భనిరోధక మాత్ర'ను అభివృద్ధి చేశామని.. ఎలుకలపై, సైనోమోల్గస్ జాతి కోతులపై చేసిన పరిశోధనల్లో అది 99% ప్రభావవంతంగా పనిచేస్తున్నట్టు తేలిందని వారు వెల్లడించారు. వీర్యకణాల తయారీకి అత్యంత కీలకమైన విటమిన్ ఏను వృషణాలకు అందకుండా నిరోధిస్తుందని.. దానివల్ల వీర్యం ఉత్పత్తి ఆగిపోతుందని శాస్త్రజ్ఞులు వివరించారు. అదే సమయంలో ఈ మాత్ర టెస్టోస్టిరాన్ స్థాయులపై మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపదని మిన్నెసోటా వర్సిటీ కెమిస్ట్, ఫార్మసిస్ట్ జార్జ్ తెలిపారు. కోతులు, ఎలుకలపై వారు చేసిన ప్రయోగాలకు సంబంధించిన ఫలితాల నివేదిక 'కమ్యూనికేషన్స్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమైంది. దాని ప్రకారం.. ఎలుకల్లో ఈ మందు నాలుగువారాల వినియోగం తర్వాత 99% సామర్థ్యంతో పనిచేయగా, కోతుల్లో రెండు వారాల వినియోగంతోనే వీర్యకణాల సంఖ్యను తగ్గించేసింది. మందు ఆపిన ఆరువారాల్లో ఎలుకల్లో మళ్లీ వీర్య కణాల సంఖ్య మునుపటి స్థితికి చేరుకోగా.. కోతుల్లో మాత్రం అందుకు 10 నుంచి 15 వారాలు పట్టింది. ఈ మందు వాడకం వల్ల రెండింటిలోనూ అతి తక్కువ దుష్ప్రభావాలు మాత్రమే కనిపించాయి. దీంతో మనుషులపై తొలి దశ ప్రయోగాలు నిర్వహించామని.. ఈ ఔషధం మానవ వినియోగానికి సురక్షితమేనని తేలిందని జార్జ్ వివరించారు. రెండో దశ (సేఫ్టీ అండ్ ఎఫికసీ) ట్రయల్స్‌ను న్యూజీలాండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

ఆ రెండు మార్గాలే..

పురుషులకు సంబంధించినంతవరకూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న గర్భనిరోధక విధానాలు రెండే.. ఒకటి కండోమ్స్ వాడకం. రెండోది వ్యాసెక్టమీ (వీర్య వాహికలను కత్తిరించి ముడి వేసే/మూసేసే శస్త్రచికిత్స). స్త్రీలకు గర్భనిరోధక మాత్రలు అందుబాటులో ఉన్నట్టు పురుషులకు లేకపోవడానికి కారణమేంటి? ఎంతో పురగతి సాధించిన వైద్య రంగం.. ఈ విషయంలో మాత్రం ఇంకా విజయం సాధించలేకపోవడానికి కారణమేంటి? అంటే.. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి.. మహిళల్లో అండాల విడుదల దాదాపు నెలకు ఒకసారి మాత్రమే జరుగుతుంది. దానికీ ఒక క్రమం ఉంటుంది. కానీ, పురుషుల్లో నిత్యం కోట్లాది వీర్యకణాల ఉత్పత్తి జరుగుతుంటుంది. ఎప్పుడో నెలకు ఒకసారి జరిగే ప్రక్రియను నిరోధించడం సులువు. నిత్యం, నిరంతరం జరిగే ప్రక్రియను ఆపడం కష్టం. అలాగని అసాధ్యమేమీ కాదు. పురుషుల కోసం గత 60-70 ఏళ్లలో రకరకాల కాంట్రాసెప్టివ్ పిల్స్, జెల్స్, ఇంజెక్షన్లను శాస్త్రజ్ఞులు తయారు చేశారు. కానీ, వాటిలోని హార్మోన్ల వల్ల కలిగే దుష్ప్రభావాల కారణంగా ప్రతిసారీ ట్రయల్స్ దశలోనే వాటి ప్రస్థానం ముగిసిపోతూ వస్తోంది. హార్మోన్ రహిత మాత్రలపై కూడా కొన్ని పరిశోధనలు జరిగాయిగానీ అవేవీ ట్రయల్స్ దశ దాటి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఇప్పుడు అమెరికన్ శాస్త్రజ్ఞులు తయారుచేసినవి కూడా హార్మోన్ రహిత మాత్రలే. ఈ దశాబ్దం చివరికల్లా అవి మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు. అదెంతవరకూ నిజమవుతుందో చూడాలి!!

కల్యాణ రాముడికి ఘనంగా మహాపట్టాభిషేకం



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పక్కన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అత్యంత వైభవంగా మహాపట్టాభిషేకం నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణ సార్వభౌముడికి రాజ లాంఛనాలు సమర్పించారు. సీతారామచంద్రస్వామిని ఉద యం 10.20 గంటలకు విథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంపై 10.26 గంటలకు ఆసీనులను చేశారు. అనంతరం పట్టాభిషేక తంతును అర్చకస్వాములు, వేద పండితులు ప్రారంభించారు. ముందుగా శ్రీరాముడి బంగారు పాదుకలను భక్తులకు చూపించి, సమర్పించారు. ఆ తర్వాత రాజదండం, రాజముద్రిక, రామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరాముడికి, చింతాకు పతకం సీతమ్మకు, శ్రీరామమాడను లక్ష్మణుడికి అలంకరించారు. అనంతరం చామరం, బంగారు ఛత్రం, దుష్ట శిక్షణ కోసం రాజఖడ్గాన్ని రామయ్యకు అందజేసి, సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి ధరింపజేశారు. ఆ తర్వాత దేవేంద్రుడు కానుకగా పంపినట్లు చెప్పే ముత్యాలహారాన్ని తొలుత రామయ్య మెడలో వేయగా అక్కడి నుంచి సీతమ్మకు, తర్వాత రామ భక్త సామ్రాజ్యానికి అధిపతి అయిన హనుమంతుడికి సమర్పించారు. అనంతరం సమస్త నదులు, నాలుగు సముద్రాల నుంచి సేకరించిన జలాలతో రామయ్యకు ప్రోక్షణ నిర్వహించారు. శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని పురస్కరించుకొని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి తుమ్మల స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవస్థానం తరఫున గవర్నర్‌కు జ్ఞాపిక, స్వామి ప్రసాదం, శాలువా బహూకరించారు.



మహాపట్టాభిషేకం అనంతరం తిరువీధి సేవకు వెళ్తున్న సీతారామచంద్రస్వామి

గిరిజన మ్యూజియాన్ని ప్రారంభించిన గవర్నర్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం భద్రాచలంలో గిరిజన మ్యూజియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు గిరిజన సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలికారు. గిరిజన మహిళలు తయారు చేసిన వంటకాలను గవర్నర్ పరిశీలించారు.

నగరంలో కొత్తగా 6 ఎంఎంటీఎస్ ట్రైన్ లైన్లు

- 102 కిలోమీటర్ల పొడవున నిర్మాణం
- పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరవాసులకు రైల్వే మంత్రి తీపికబురు చెప్పారు. ఎంఎంటీఎస్ (మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్)విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని ప్రకటించారు. ఎంఎంటీఎస్ ప్రాజెక్టును విస్తరించాలని ఎంతో కాలంగా ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్లను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో 102.4 కి.మీ. పొడవునా 6 మార్గాల్లో కొత్త రైల్వేలైన్లు, ఫలక్‌నుమా-ఉమ్దానగర్ వంటి కీలక ప్రాంతాల్లో డబ్లింగ్ నిర్మాణాలను చేపడుతున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల పార్లమెంట్‌లో చెప్పారు. రూ. 1,169 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ విస్తరణ పనులను దక్షిణ మధ్య రైల్వే త్వరలో చేపట్టనుంది. ఘట్‌కేసర్-మౌలాలి సి-కాబిన్ వరకు 12 కి.మీ., ఫలక్‌నుమా-ఉమ్దానగర్ డబ్లింగ్ లైన్ 1.4 కి.మీ., సనత్‌నగర్-మౌలాలి బైపాస్ డబ్లింగ్ లైన్ 22 కి.మీ., తెల్లాపూర్-రామచంద్రాపురం కొత్త లైన్ 5 కి.మీ., మేడ్చల్-బొల్లారం డబ్లింగ్ లైన్ 14 కి.మీ., సికింద్రాబాద్-బొల్లారం మధ్య 15 కిలోమీటర్ల రైల్వే లైన్ విద్యుదీకరణ పనులు చేయనున్నారు. మరోవైపు ఎంఎంటీఎస్ ప్రాజెక్టు విస్తరణలో భాగంగానే ఘట్‌కేసర్-యాదాద్రి మధ్య 33 కిలోమీటర్ల 3వ రైల్వే లైన్ నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

గోదావరి-బనకచర్ల చేపట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల (496 క్యూమెక్కుల)కు పెంచారని తెలిపింది. తాజాగా గోదావరి-బనకచర్ల అనుసంధానంలో భాగంగా 40 వేల క్యూసెక్కులకు పోలవరం కుడి ప్రధాన కాలువ పనులు చేపడుతున్నారని ఆక్షేపించింది. ఈ మేరకు సోమవారం జలసౌధలో జరిగిన గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో తెలంగాణ అధికారులు తమ అభ్యంతరాలను లేవనెత్తారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవుతున్నందున.. తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని 2004-05లో చేపట్టారని, పోలవరం పూర్తయ్యాక దీనిని మూతపెట్టాలనేది ఒప్పందమని గుర్తు చేశారు. కానీ, తాడిపూడి కెనాల్ సామర్థ్యాన్ని 1400 క్యూసెక్కుల నుంచి 17 వేల క్యూసెక్కులకు పెంచే పనులు చేస్తున్నారని తెలిపారు. అయితే గోదావరి-బనకచర్ల అనుసంధానం (జీబీ లింక్) ప్రతిపాదనల దశలోనే ఉందని, ఇంకా డీపీఆర్ సిద్ధం కాలేదని ఏపీ అధికారులు చెప్పగా.. జీబీ లింక్‌లో భాగంగానే 2016లో చేపట్టిన పల్నాడు డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్టును మళ్లీ చేపట్టారని తెలంగాణ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే రూ.1000 కోట్లకు పైగా పనులు పూర్తి చేశారని అన్నారు.

పెద్దవాగు ఆధునీకరణ చేపట్టాలి..

గోదావరిపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.92.50 కోట్లు అవుతాయని, ఈలోగా తాత్కాలిక మరమ్మతులకు రూ.15 కోట్లు అవసరమని తెలంగాణ గుర్తు చేసింది. దీంతో ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టు ఉన్న మేరకు నిష్పత్తిని అనుసరించి నిధులు చెల్లించడానికి ఏపీ సుముఖత వ్యక్తం చేసింది. ఇక గోదావరి బేసిన్ పరిధిలో ఉన్న ప్రాజెక్టులను జీఆర్ఎంబీకి అప్పగించేందుకు తెలుగు రాష్ట్రాలు మరోసారి నిరాకరించాయి. షరతుల్లేకుండా ప్రాజెక్టులను అప్పగించే అంశాన్ని ఏమైనా పరిశీలిస్తారా అని ఏపీని బోర్డు ఛైర్మన్ ఏకే ప్రధాన్ కోరగా... అటువంటి ప్రసక్తే లేదని తెలిపింది. తెలంగాణ మాత్రం ఉమ్మడి ప్రాజె క్టు పెద్దవాగును మాత్రమే అప్పగిస్తామని చెప్పింది. ఇక అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో తెలంగాణలో 11, ఏపీలో 4 ఉన్నాయని, డీపీఆర్‌లను ఎప్పట్లోగా దాఖలు చేస్తారని బోర్డు ప్రశ్నించింది. అయితే తాము ఇప్పటికే రెండు ప్రాజెక్టులను తొలగించాలని కోరామని తెలంగాణ తెలిపింది. 9 ప్రాజెక్టుల డీపీఆర్‌లను దాఖలు చేశామని, ఐదింటికి టీఏసీ అనుమతి వచ్చిందని, ఒకటి పరిశీలనలో ఉందని వివరించింది.



నిజ నిర్ధారణకు త్రిసభ్య కమిటీ..

గోదావరి బోర్డు సభ్యకార్యదర్శి అళగేషన్ వ్యవహార శైలిపై తెలుగు రాష్ట్రాల అధికారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆయన భాష, మహిళా ఉద్యోగినుల పట్ల అనుచిత వైఖరిపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వాస్తవాలు తెలుసుకునేందుకు తెలంగాణ, ఏపీ అంతరరాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్లతోపాటు బోర్డుకు చెందిన ఒక సభ్యుడితో త్రిసభ్య కమిటీని వేయాలని జీఆర్ఎంబీ నిర్ణయించింది. సభ్య కార్యదర్శి వ్యవహారశైలితోపాటు పాలన వ్యవహారాలు, ఆర్థిక అంశాలపై కూడా ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. బోర్డు ఛైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, అంతరరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్, ఏపీ ఈఎన్‌సీ (ఇరిగేషన్) ఎం.వెంకటేశ్వరరావు, అంతరరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్‌రావు హాజరయ్యారు.



బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్తీకల్లు బాధితులు

కామారెడ్డి జిల్లాలో కాటేసిన కల్తీ కల్లు

- కల్లు తాగి 32 మందికి అస్వస్థత.. ఇద్దరి పరిస్థితి విషమం

నస్రుల్లాబాద్/బీర్కూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం కల్తీ కల్లు తాగి 32 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వీరందరినీ వెంటనే బాన్సువాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. కామారెడ్డి జిల్లాలోని నసుల్లాబాద్ మండలం అంకోల్ తండా, అంకోల్, దుర్కి, సంగం గ్రామాలతో పాటు బీర్కూర్ మండలం దామరాం గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో కల్లు తాగిన వారు ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో కొందరు మెడ వంకర పోవడం, కాళ్లు చేతులు లేపలేని పరిస్థితికి చేరుకున్నారు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు వారందరినీ వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు, కల్తీ కల్లు తాగడం వల్లే అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించారు. అంకోల్‌కు చెందిన రవి, మధుకుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, బాధితుల్లో చాలా మంది రోజువారీ కూలీలే ఉన్నారు. కల్తీ కల్లు ఘటనపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కల్లు శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

అనుభవం తక్కువగా ఉన్నా.. పదో తరగతి మూల్యాంకనం విధులు

- ఏడాది క్రితమే స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

పొందినవారికి వాల్యుయేషన్ డ్యూటీలపై అభ్యంతరాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అనుభవం లేని ఉపాధ్యాయులకు పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్ డ్యూటీలు వేయడం విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21నుంచి ఏప్రిల్ 4వరకు పదో తరగతి పరీక్షలను నిర్వహించారు. సోమవారం నుంచి స్పాట్ వాల్యూయేషన్(జవాబు పత్రాల మూల్యాంకనం) ప్రారంభమైంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 3.18 లక్షల జవాబు పత్రాలను దిద్దేందుకు హైదరాబాద్‌లోని రెండు చోట్ల క్యాంపులను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో మేజర్ క్యాంపుగా, ఎర్రగడ్డలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో మైనర్ క్యాంపుగా నిర్ణయించారు. మేజర్ క్యాంపు(తెలుగు, ఇంగ్లిష్ మీడియం జవాబు పత్రాల మూల్యాంకనం)లో 212 మంది చీఫ్ ఎగ్జామినర్లు(సీఈలు), 1,112 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈలు-పేపర్లు దిద్దే స్కూల్ అసిస్టెంట్లు), 350 మంది స్పెషల్ అసిస్టెంట్ల(ఎస్ఈలు)ను నియమించారు. మైనర్ క్యాంపు(ఉర్దూ, హిందీ సెకండ్ లాంగ్వేజ్ పేపర్ల మూల్యాంకనం)లో 52 మంది సీఈలు, 309 ఏఈలు, 98 మంది ఎస్ఈలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జవాబు పత్రాల మూల్యాంకనం చేసే ఏఈలకు ఆయా సబ్జెక్టులపై కనీసం రెండేళ్ల పాటు పదో తరగతి విద్యార్థులకు బోధించిన అనుభవం ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం మేజర్, మైనర్ క్యాంపుల్లో డ్యూటీలు వేసిన 1,421 మంది ఏఈల్లో 20 మందికి పైగా గతేడాది జరిగిన డీఎస్సీ ద్వారానే స్కూల్ అసిస్టెంట్లుగా విధుల్లో చేరారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగా స్కూల్ అసిస్టెంట్లుగా నియమితులైన వారికి ఏఈలుగా డ్యూటీలు వేయడంపై కొంతమంది నాయకులు ఆయా మండలాలకు చెందిన డిప్యూటీ ఈవోలు, డీఐఓఎస్‌లను ప్రశ్నించినట్లుగా సమాచారం. దీంతో, జిల్లా విద్యాశాఖాధికారులు సోమవారం సాయంత్రం కొందరిని వాల్యుయేషన్ విధుల నుంచి తప్పించినట్లు తెలిసింది.

టెండర్ పెడితే రూ.118 ..లేకుంటే రూ.164

అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పు కాంట్రాక్టర్ల పేరిట లీలలు.. 15 జిల్లాల్లో తుంగలోకి నిబంధనలు

- ఒకే కాంట్రాక్టర్‌కు 11 జిల్లాలు
- ఒక జిల్లాలో టెండర్.. మిగతాచోట్ల ఇష్టారాజ్యం



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పును సరఫరా చేసే కాంట్రాక్టర్ల ఎంపిక ఇష్టారాజ్యంగా సాగుతోంది. నిబంధనల ప్రకారం టెండర్లను ఆహ్వానించి, తక్కువ ధరకు కోట్ చేసే కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాలి. అయితే.. కందిపప్పు కొనుగోళ్లకు రాష్ట్రస్థాయి అధికారులు నిర్ణయించిన గరిష్ఠ ధర(రూ.164)ను తమకు అనుకూలంగా మలచుకుంటున్న 15 జిల్లాల అధికారులు ఎలాంటి టెండర్ లేకుండా.. కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తున్నారు. రూ.164కు కిలో చొప్పున కందిపప్పును కొనుగోలు చేస్తున్నారు. మిగతా జిల్లాల్లో నిబంధనల ప్రకారం టెండర్లను నిర్వహించారు. హైదరాబాద్‌లో రూ.118, సూర్యాపేటలో రూ.122.22, ఖమ్మంలో రూ.124.95, పెద్దపల్లిలో రూ.131 చొప్పున ధర చెల్లించి, కందిపప్పును కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర నాణ్యతను బట్టి రూ.95 నుంచి రూ.120 మధ్య ఉండడం గమనార్హం..! నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయినా.. ఇంకా కాంట్రాక్టులు ఖరారు కావాల్సి ఉంది. వరంగల్ జిల్లా అధికారులు ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు.

ఈ జిల్లాల్లో దోపిడీ!

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, హనుమకొండ, జయశంకర్-భూపాల్‌పల్లి, మహబూబాబాద్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు, జనగామా జిల్లాల్లో టెండర్లు నిర్వహించకుండానే కాంట్రాక్టర్లను ఎంపిక చేసినట్లు తెలిసింది. ఆదిలాబాద్ జిల్లాలో కొటేషన్ పద్ధతిన ఎంపిక చేశామని.. కిలోకు రూ.163 చొప్పున శివసాయి ట్రేడర్స్‌కు కాంట్రాక్టును అప్పగించినట్లు అక్కడి ఐసీడీఎస్ అధికారిణి మిల్క తెలిపారు. టెండర్లను నిర్వహించకుండా కాంట్రాక్టు ఇవ్వకూడదనే ప్రశ్నకు.. "వేరే జిల్లాల్లో అలాగే చేస్తున్నారు. కొన్ని జిల్లాల అధికారులతో మాట్లాడి, మేము కూడా టెండర్లను పిలవలేదు" అని చెప్పారు. ఇలా.. జిల్లాల అధికారులు కూడబలుక్కుని టెండర్లు లేకుండా పనికానిస్తున్నారు. టెండర్లు వేస్తే.. కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి.. తక్కువ ధరకు కోట్ చేసే అవకాశాలున్నా.. ఆ దిశలో చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ కాంట్రాక్టర్ అయితే.. ఏకంగా ఒక జిల్లాలో టెండర్ ద్వారా రూ.122కు కాంట్రాక్టు దక్కించుకుని, అదే పప్పును మరో 10 జిల్లాల్లో రూ.164కు విక్రయిస్తుండడాన్ని బట్టి పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇలా టెండర్లు లేని జిల్లాల్లో వరంగల్, నిజామాబాద్‌కు చెందిన ట్రేడర్లే కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో 149 సమీకృత శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కలిపి సుమారు 21.60 లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. బాలింతలు, గర్భిణులతో పాటు 3-6 ఏళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు ప్రతి రోజు సమతులాహారంతో భోజనం అందించాలి. అంటే వారికి అందించే భోజనంలో ప్రొటీన్లు, కాల్షియం, శక్తి తగినంతగా ఉండాలి. ఈ క్రమంలో గర్భిణులకు, బాలింతలకు రోజుకు 30 గ్రాములు, పిల్లలకు 15 గ్రాముల చొప్పున కందిపప్పుతో చేసిన వంటకాలను అందజేస్తారు. ఈ మేరకు స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మెనూను తయారు చేసింది. ఇలా పేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం విషయంలో కొన్ని జిల్లాల అధికారుల నిర్లక్ష్యంతో.. కాంట్రాక్టర్లు అడ్డంగా దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో నేతలు

బిల్లుల కోసం సత్యాగ్రహం

- బిల్డర్స్ అసోసియేషన్ నేతల వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్లందరికీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మంత్రులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో గాంధీ మహాత్ముడిలా తామంతా సత్యాగ్రహం చేస్తామని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు డీవీఎన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు బొల్లినేని శీనయ్య ప్రకటించారు. కొండాపూర్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన డీవీఎన్‌రెడ్డిని అభినందించారు. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్, సెంటర్ ఛైర్మన్లు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీవీఎన్‌రెడ్డి, బొల్లినేని శీనయ్య మాట్లాడుతూ.. గవర్నర్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరతామని తెలిపారు. కాంట్రాక్టర్లు తమ కార్యాలయాల్లో పని చేసేవారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని, ఇక నుంచి ప్రతీ ఆఫీసులో పని చేసే సిబ్బంది దీక్షలు చేయాలని కోరారు.

ఉదయం ఎండ .. సాయంత్రం వాన

- రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితి
- పలు జిల్లాల్లో గాలి వాన బీభత్సం
- నేడు, రేపు పలు జిల్లాలకు వర్షసూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతుండగా, సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం చల్లబడి వర్షం కురుస్తోంది. సోమవారం నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైంది. కాగా, మధ్యాహ్నం నుంచి మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఖమ్మం జిల్లాల్లో వడగళ్ల వాన కురవడంతో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. మరోవైపు దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలియజేశారు. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడే అవకాశం లేదని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

లంకతో మైత్రి

పరస్పర గౌరవం, చర్చల ద్వారా సమస్యల పరిష్కారం, శాంతి సామరస్యాలు, ఆర్థిక కలిమి, సంస్కృతి అనేవి ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలకు మార్గదర్శక సూత్రాలుగా ఉండాలి. దీనినే మన విదేశాంగ విధానం 'ఇరుగు పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం'గా నిర్వచించింది. 2008లో ఈ విధానానికి అంకురార్పణ చేశారు. నిజానికి దీని మూలాలు 1990 దశకంలో 11 నెలలు మాత్రమే అధికారంలో ఉన్న ప్రధానమంత్రి ఇందర్ కుమార్ గుజ్రాల్ సిద్ధాంతంలో ఉన్నాయి. పొరుగుదేశాల సమస్యలను అర్థం చేసుకుని వాటికి తగ్గట్లుగా వ్యవహరించడంలో స్వప్రయోజనాలను కూడా పక్కన పెట్టాలని గుజ్రాల్ విధాన నిర్దేశం చేశారు.

2008–10 మధ్య మన ఇరుగుపొరుగు దేశాలలో చరిత్రాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. 2008లో బంగ్లాదేశ్‌లో సైనిక ప్రభుత్వం స్థానంలో షేక్ హసీనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మాల్దీవుల్లో అబ్దుల్ గయూమ్ మూడు దశాబ్దాల నియంతృత్వ పాలన అంతమై మహమ్మద్ నషీద్ ప్రజాస్వామ్యబద్ధంగా అధికారాన్ని చేపట్టారు. 2010లో మయన్మార్‌లో రెండు దశాబ్దాల సైనిక పాలన ముగిసి ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తదనంతర కాలంలో ఈ దేశాలలో ప్రజాస్వామ్య పాలన సుస్థిరంగా కొనసాగనప్పటికీ ప్రజాస్వామ్య మూలాలు బలపడ్డాయి.

మరో పొరుగుదేశం శ్రీలంకలో పరిణామాలు కొంచెం భిన్నమైనవి. మూడున్నర దశాబ్దాల పాటు ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేసిన తమిళ వేర్పాటువాద సంస్థ ఎల్‌టీటీఈ ప్రభుత్వంతో యుద్ధంలో ఓడిపోయి, సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పొరుగుదేశాల ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్యం సువ్యవస్థితం కావడానికి భారత్ పలు విధాల సహాయసహకారాలు అందించింది. అయినప్పటికీ వివిధ కారణాలతో ఆ దేశాలతో భారత్ స్నేహ సంబంధాలు సజావుగా సాగలేదు. అవి భారత్ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే విధంగా పరిస్థితులు దిగజారిపోయాయి. అ ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు న్యూఢిల్లీ సంయమనంతో ఇరుగుపొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం విధానాన్ని అనుసరిస్తూ వస్తోంది. భారత్‌ను తీవ్రంగా వ్యతిరేకించి, చైనా వైపు మొగ్గిన మాల్దీవులు మళ్లీ భారత్ అనుకూల వైఖరి చూపుతోంది. శ్రీలంక నుంచి కూడా అటువంటి అనుకూలతను సాధించే ప్రయత్నాలలో భాగంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశంలో మూడు రోజులపాటు పర్యటించారు.

శ్రీలంక అధ్యక్షుడుగా అనూర కుమార దిస్సనాయకె అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ప్రప్రథమంగా ఆతిథ్యమిచ్చిన విదేశీ నాయకుడు మోదీయే. గత సెప్టెంబర్‌లో అధికారంలోకి వచ్చిన దిస్సనాయకె తన తొలి అధికారిక విదేశీ యాత్రకు డిసెంబర్‌లో భారత్ వచ్చారు. భారత్ ప్రయోజనాలకు భంగం వాటిల్లే కార్యకలాపాలను శ్రీలంక భూభాగంపై జరగనివ్వమని వాగ్దానం చేశారు. ఇప్పుడు కొలంబోలో మోదీ సమక్షంలో మరోసారి ఆ వాగ్దానం చేశారు. శ్రీలంక నుంచి ఐపీకెఎఫ్ (భారత శాంతి పరిరక్షణ దళం) ఉపసంహరించిన నాలుగు దశాబ్దాల అనంతరం ఉభయ దేశాల మధ్య రక్షణరంగంలో సహాయసహకారాల విషయమై ఒప్పందం కుదరడం విశేషం. హిందూ మహాసముద్రంలో చైనా కార్యకలాపాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం అమిత ప్రాధాన్యం సంతరించుకుంది. శామ్‌పూర్ విద్యుత్కేంద్రానికి ప్రధాని మోదీ, అధ్యక్షుడు దిస్సనాయకె సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ట్రికోమలీని ఎనర్జీహబ్‌గా అభివృద్ధిపరిచే విషయమై కూడా ఒక అవగాహన పత్రంపై రెండు దేశాలు సంతకాలు చేశాయి.

భారతదేశ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారు ఉద్దేశపూర్వకంగా శ్రీలంక ప్రాదేశిక జలాలలోకి ప్రవేశించడం లేదు కనుక వారిని మానవతా దృష్టితో చూడాలని కోరారు. తమిళనాడులో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే ప్రయత్నాలలో భాగంగానే మోదీ తన పర్యటనలో మత్స్యకారుల సమస్యను ప్రస్తావించారని కొందరు విమర్శించారు. హిందూ మహాసముద్ర తీరస్థ దేశాలలో ఏదో ఒక విధంగా తిష్ఠవేస్తున్న చైనాను అడ్డుకోవడానికి శ్రీలంకతో సంబంధాలకు అగ్ర ప్రాధాన్యమిచ్చి వాటిని పటిష్ఠపరచుకోవలిసి ఉన్నది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరంలో జాతీయ పాలకపక్షం, రాష్ట్ర అధికారపార్టీ, ఇతర రాజకీయ పక్షాలు సంయమనంతో వ్యవహరించడం చాలా ముఖ్యం. అలా వ్యవహరించినప్పుడు మాత్రమే ఇరుగు పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం అన్న విధానం సార్థకమవుతుంది.

విజ్ఞత లేని 'త్రిభాషా' ధిక్కారం

'భారత్ భవిష్యత్తుపై రెండు దృక్కోణాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మార్చి 22న రామచంద్ర గుహ రాసిన వ్యాసంలో మోదీ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనబడింది. తమిళ, హిందీ భాషల మధ్య పోరాటం రెండు భిన్న భారత్ భావనలకు ప్రాతినిధ్యం వహిస్తుంది అంటున్నారు ఆయన. బ్రిటిష్ వాళ్ళు నూరిపోసిన ఆర్య, ద్రావిడ సిద్ధాంతాన్ని ఈయన బాగా ఔపోసన పట్టినట్లుంది. 'ఉత్తరాది ప్రజలు ఆర్యులు అని, దక్షిణాది ప్రజలు ద్రావిడులు అని, ఉత్తరాది హిందీ ఆర్యభాషైన సంస్కృతం నుంచి వచ్చిందని బ్రిటిష్‌వారు ఈ దేశంలో తమ పాలనను శాశ్వతం చేసుకోవడానికి ఓ కొత్త వాదాన్ని లేవదీశారు. దానిని అందిపుచ్చుకొని ద్రావిడవాద నాయకులు ఈ దేశ భాషైన హిందీని వ్యతిరేకిస్తూ, హింసాత్మక ఉద్యమాన్ని లేవదీసి జన నష్టం, ఆస్తి నష్టం కలిగించిన విషయం సుస్పష్టం.

ద్రావిడవాద నాయకులు హిందీని వ్యతిరేకించడం 1937 నుంచి నేటి వరకు కొనసాగుతూనే ఉంది. దేశీయ భాషైన హిందీని వ్యతిరేకించడంలో అర్థం లేదని జాతీయ నాయకులు మొదటినుంచి వాదిస్తూ వచ్చారు. 1950 నుంచి 1967 వరకు కాంగ్రెస్ కార్యకర్తలపై ద్రావిడవాద పార్టీ కార్యకర్తలు వీధి పోరాటాలు చేశారు. 1965లో ఈ ఉద్యమం హింసాత్మకంగా మారి, పారా మిలిటరీ దళాలు కాల్పులు జరపడంతో అనేకమంది మృత్యువాత పడ్డారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభను తమిళనాడులో మూసివేయాలని ఈ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ విషయంలో వ్యాసకర్త చాలా విషయాలను దాచారు. 'కాశీ–తమిళ్ సంగమం' నూతన పార్లమెంటు భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠాపన వెనుక ఈ దేశంలో సమైక్యతను సాధించడం అనే లక్ష్యం మోదీ ప్రభుత్వానికి ఉన్నదని జాతీయ వాదుల అభిప్రాయం. వ్యాసకర్తకు ఇది రాజకీయ కోణంగా తోచింది.



రాష్ట్ర జాబితాలో ఉన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి శాసనాలు చేసే అధికారం ఉంటుంది. కొన్ని స్థానిక సంస్థలలో ప్రతిపక్ష పార్టీ వారు అధికారంలో ఉన్నంతమాత్రాన రాష్ట్ర శాసనాలను అమలు చేయబోమని ధిక్కరించవచ్చునా? వారికి ఆ హక్కు ఉంటుందా? కేంద్ర శాసనాలను తమిళనాడు ప్రభుత్వం ధిక్కరించడం ఈ కోవ కిందికి రాదా? త్రిభాషా సూత్రాన్ని ధిక్కరిస్తూ, ద్వి భాషలకు మాత్రమే మా రాష్ట్రంలో స్థానం ఉందని మూర్ఖంగా ప్రవర్తించే ద్రావిడవాద రాజకీయ నాయకుల పొగరుబోతు ధోరణిని తప్పు పట్టకుండా, ఉత్తర భారతంలో దక్షిణాది భాషను నేర్పడం లేదని కొందరు చేసే వాదనలు పసలేనివి. ఉత్తర భారతంలో రాష్ట్ర భాష, హిందీ, ఇంగ్లీష్ నేర్పుతూనే ఉన్నారు. ఇక కొన్నిచోట్ల సంస్కృతాన్ని విద్యార్థులు మార్కుల స్కోర్ కోసం తీసుకుంటున్నారు. ఒక వ్యక్తి అనేక భాషలను నేర్చుకోవడం వల్ల ఆలోచనా శక్తి, విషయ పరిజ్ఞానం పెరుగుతాయి. వ్యక్తి జీవితం సౌకర్యవంతమౌతుంది. ద్రావిడవాద రాజకీయ నాయకులకూ, వంతపాడే స్వయం ప్రకటిత మేధావులకు ఈ విషయంలో ఇంగిత జ్ఞానం లోపించింది.

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ హిందువులు ఆంగ్ల భాషను త్యజించాలని కేరళ సమావేశంలో కోరినట్లు చెప్పిన మాట శుద్ధ అబద్ధం. ఆంగ్ల భాషపై మక్కువ అనవసరమని ఆయన చెప్పిన విషయాన్ని వక్రీకరించడం ఎందుకు? ఇక దళితులు ఆంగ్ల భాష నేర్చుకుంటే వద్దనేది ఎవరు? అగ్రకులాలపై ద్వేషాన్ని, ఈర్ష్యను, క్రోధాన్ని, ఆగ్రహాన్ని కలిగించడానికి ఈ దేశంలో కొందరు నిబద్ధులైనారు.

నరేంద్రమోదీ అధికారానికి రాకముందు ఈ దేశంలో హిందీ, ఇంగ్లీష్ రెండూ దేశవ్యాప్తంగా ప్రాచుర్యాన్ని పొందాయని చెప్పడంలో రామచంద్ర గుహ ఆంతర్యం ఏమిటి? ఇంగ్లీషు భాష సాంకేతిక భాష అయినందువల్ల దాని ప్రాధాన్యతను ఎవరు తగ్గించలేరనే ఆ డొంక తిరుగుడు మాటలు ఏమిటి? మోదీ ప్రభుత్వ హయాంలో ఎక్కడైనా సాంకేతిక కళాశాలలో ఆంగ్లం బదులు ప్రాంతీయ భాషల్లో బోధనను మొదలుపెట్టారా? అధికారాన్ని అడ్డుపెట్టుకుని, ఆంగ్లభాషను అణచివేసి, హిందీ భాషకు సంఘ్ పరివార్ ప్రాచుర్యాన్ని తెచ్చిపెడుతుందని వ్యాసకర్త వాపోవడం విచిత్రం. పార్లమెంట్‌లో ఎక్కువమంది హిందీలో ప్రసంగిస్తారు. ఇది స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి జరుగుతున్న వ్యవహారం. కొంతమంది ఆంగ్లంలో కూడా మాట్లాడతారు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం ఏమైనా మార్పు చేసిందా?

ద్రావిడవాద రాజకీయాలలో హిందీని వ్యతిరేకించడం ఒక భాగం. అది వారి రాజకీయ మనుగడకు అవసరం. పైగా హిందుత్వం ఆధారంగా రాజకీయాలు నడిపే భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి హిందీ భాషపైన వీరి వ్యతిరేకత హెచ్చుగా ఉంటుంది. ద్రావిడవాద రాజకీయ నాయకులు సహజంగానే హిందు మత వ్యతిరేకులు. రామాయణంపై, రామునిపై అవాకులు, చవాకులు మాట్లాడిన కరుణానిధి, సనాతన ధర్మాన్ని అనుసరించే హిందువులు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే బ్యాక్టీరియా లాంటివారు అని నోరు పారేసుకున్న రాష్ట్ర మంత్రి, ఆయన మనుమడు ఉదయనిధి ఈ తానులోని ముక్కలే!

హిందువుల కోసం పనిచేసే సంస్థలను దూషించడం, ద్వేషించడం, ఇస్లామిక్ శక్తులకు వంతపాడడం రామచంద్ర గుహ మనుగడలో భాగం. అందుకే ఆయన ద్రావిడవాద రాజకీయ నాయకులు హిందీని వ్యతిరేకించడాన్ని సమర్థించుకొచ్చాడు. రెండు దృక్కోణాల మధ్య సంఘర్షణగా సిద్ధాంతీకరించాడు.

● కొండా సుమంత్‌రెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కేంద్రం తగ్గాలి.. రాష్ట్రాలు పెరగాలి!

కాలస్పృహలేని దేశంగా భారత్‌ను పాశ్చాత్య మేధావులు ఒకప్పుడు వర్ణించారు. సమాజంలో జరిగే మార్పులను క్రమపద్ధతిలో నమోదుచేసి ముందు తరాలకు అందించాలన్న తపన మనకు చాలా తక్కువని చెప్పటమే వారి ఉద్దేశం. పాశ్చాత్య చరిత్రలోలాగా లౌకిక విశేషాలను అక్షరబద్ధం చేసే అలవాటు మనకు ఎక్కువగా లేని మాట నిజమే! చరిత్రలో ఏ సంఘటనకైనా కాలనిర్ణయం చేయటం మనకు కత్తిమీద సామే! దానికి కారణాలు అనేకం. పాత చరిత్రను కాసేపు పక్కనబెట్టి సమకాలీన రాజకీయాలను గమనిస్తే మరో విశిష్టత కనిపిస్తుంది. అదే కాలయాపన! అవసరమైన విషయాలపై వెంటనే మనం దృష్టిపెట్టం. రాజ్యాంగం వచ్చిన పదేళ్లలో అందరినీ అక్షరాస్యులను చేయాలనుకున్నాం. చేయలేకపోయాం. అంటరానితనాన్ని సంపూర్ణంగా రూపుమాపాలనుకున్నాం. దాన్నీ చేయలేకపోయాం. ఇలా ఒకటీరెండూ కాదు.. మన కాలయాపనలు గురించి చాలా ఉదాహరణలు ఇవ్వొచ్చు. వీటిల్లో ఒకటి ఇప్పుడు మన రాజకీయాలను ఊపేస్తోంది.



ఏ కోణం నుంచి చూసినా 75 ఏళ్ల కిందట రాష్ట్రాలకు నిర్దేశించిన హక్కులు, అధికారాలు ఇప్పటి పరిస్థితుల్లో సరిపోవన్నది స్పష్టమవుతూనే ఉంది. 1991 తర్వాత మారిన ఆర్థిక విధానాలతో రాష్ట్రాలకు వ్యాపార, పారిశ్రామికాభివృద్ధిపరంగా లభిస్తోన్న వెసులుబాట్లు రాజకీయాధికారాల్లో కూడా ప్రతిఫలించాలి. పునర్వ్యవస్థీకరణ చుట్టూ రేగుతున్న వివాదాలు ఆ ప్రతిఫలన కోసం సాగుతున్న పెనుగులాటలే! దక్షిణాది ఆర్థిక ప్రగతి రాజకీయాధికారంలో అధిక వాటాకోసం గొంతెత్తేలా చేస్తుంది. దీన్ని జాతీయవాద వ్యతిరేక ధోరణిగా చూస్తే జరిగేది నష్టమే!

పదేళ్లకొకసారి జనాబా సేకరణచేసి లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించాలని రాజ్యాంగ నిబంధన ఉన్నా 50ఏళ్లపాటు కాలయాపన చేశాం. రాజకీయ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్పటి ప్రభుత్వాలు దాన్నే పరిష్కారం అనుకున్నాయి. ఇప్పుడు కూడా కాలయాపన సృష్టించిన సవాళ్లను ఎదుర్కోవటం కంటే మళ్లీ పాత దారి తొక్కాలనే వాదన కూడా వినిపిస్తోంది. మరో పాతికో, యాభై ఏళ్లో పునర్వ్యవస్థీకరణను వాయిదా వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అయిపోదు. నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచటం వల్ల రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ అసమానతలు తొలగిపోవు. ఆర్థికంగా ముందంజలో ఉన్న రాష్ట్రాల ఆదాయాన్ని వెనుకబడిన రాష్ట్రాలకు ఎంతకాలం తరలిస్తారన్న ప్రశ్నలు ఇప్పటికే బలంగా వినిపిస్తున్నాయి. 'మేం ఇచ్చేదెంత? మాకు వచ్చేదెంత?' అనే ప్రశ్నలు రాజకీయాల్లో సర్వసాధారణమైపోయాయి. కుటుంబ నియంత్రణ లక్ష్యాలను సాధిస్తే ఆదాయాల్లో కోతలు వేస్తారా అంటూ నిలదీయటం నిత్యకృత్యమైంది. ఉత్తరాది వెనుకబాటు భారాన్ని దక్షిణాది ఎందుకు మోయాలని అడగటానికీ సంశయించటం లేదు.

ఎన్నికల్లో లబ్ధి కోసమేనంటూ ఈ విమర్శలను కొట్టేయటం తేలిక. ప్రాంతీయ పార్టీలే వాటిని చేస్తున్నాయని ఆక్షేపించటమూ సులువే! కానీ సమస్య లోతుల్లోకి వెళ్లిచూస్తే ఈ విమర్శలను నిర్హేతుకమైనవిగా భావించలేం. రాష్ట్రాల మధ్య అసమానతలను కాదనలేం. వాటిని పరిష్కరించకుండా ఉత్తర–దక్షిణాదుల మధ్య నెలకొన్న భేదభావనలను పోగొట్టలేం.

రాజకీయ ఆధిపత్యం ఆర్థిక అంశాలను ప్రభావితం చేస్తుంది. చట్టసభల్లో సంఖ్యాబలం రాజకీయ ఆధిపత్యాన్ని నిర్ణయిస్తుంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్రాల బలాలు చట్టసభల్లో తారుమారైతే.. ప్రాంతాల ఆధిపత్యంలోనూ తీవ్రమార్పు వస్తుంది. హిందీ రాష్ట్రాలకు అధికాధిపత్యం ఉందన్న భావన ఇప్పటికే బలంగా నాటుకుంది. ఇతర మార్పుల జోలికి వెళ్లకుండా కేవలం జనాభా ప్రాతిపదికగా వివిధ రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్యలో మార్పులు తెస్తే ఉత్తరాది ఆధిపత్యం మరింత పెరుగుతుందన్న భయమూ ఉంది. దీన్ని నివారించి రాష్ట్రాల మధ్య సమతూకం ఉండేలా చూడటమే పెద్ద సవాలుగా మారింది.

పునర్వ్యవస్థీకరణపై దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నా ఇంతవరకూ కేంద్ర ప్రభుత్వం తన ఆలోచన ఏమిటో స్పష్టంచేయలేదు. కోవిడ్ పేరుతో వాయిదావేసిన జనాభా లెక్కల సేకరణ ఎప్పుడు మొదలుపెడతారో వెల్లడించలేదు. జనాభా ఆధారంగా మాత్రమే పునర్వ్యవస్థీకరణను చేపడితే ఒప్పుకొనేది లేదని దక్షిణాది నేతలు చేస్తున్న ప్రకటనలపై కేంద్ర మంత్రులు అప్పుడప్పుడూ స్పందిస్తున్నారు. తమిళనాడు ఒక్క లోక్‌సభ స్థానాన్నీ కోల్పోదని హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. అదే నిజమైతే లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య మొత్తంగా పెరగాలి.

నియోజకవర్గాల పెంపు నిజమైతే దానికి అనుసరించే సూత్రం ఏమిటన్న ప్రశ్న వస్తుంది. అందుకు ఉన్న రాజ్యాంగ నిబంధనలు ఏమిటి? వాటికి అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపడితే వివాదాలు సమసిపోతాయా? రాష్ట్రాల మధ్య చిచ్చుకు కారణమవుతున్న ఆదాయ పంపిణీలో అసమానతలు అంతమవుతాయా? అన్న ప్రశ్నలూ తలెత్తుతాయి. వీటిని సమగ్రంగా విశ్లేషించటం ఇటీవలే మొదలైంది. జెమీ హింట్‌సన్, మిలన్ వైష్ణవ్ 2019లో ఈ సమస్యపై రాసిన వ్యాసం ఆధారంగా ఇప్పటికీ వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత 2023లో శ్రుతీ రాజగోపాలన్ మరికొన్ని అదనపు విషయాలను విశ్లేషించారు. రాజ్యసభలో ప్రాతినిధ్యం ఎలా ఉండాలో చెబుతూ కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలు చేశారు.

లోక్‌సభ సీట్ల పంపకం రాజ్యాంగంలోని 81, 82 అధికరణాలను అనుసరించి జరగాలి. జనాభా దామాషాను బట్టి లోక్‌సభ సీట్లను రాష్ట్రాల మధ్య పంచటమే కాదు.. ఓటర్ల సంఖ్య రీత్యా ఆ సీట్లు సమానస్థాయిలో ఉండాలని కూడా ఆ అధికరణాలు నిర్దేశించాయి. ఒక ఓటుకు ఒక విలువ సూత్రం ప్రకారం ఆ నిబంధనలను పొందుపరచారు. ప్రస్తుతం మనకు 20 లక్షలలోపు ఉన్న నియోజకవర్గాలూ ఉన్నాయి. 40 లక్షల వరకూ ఓటర్లు ఉన్నవీ కనపడతాయి. అంటే ఓటు విలువలో సమానత్వం లేదు.



■ రాహుల్ కుమార్

1971 నాటి జనాభా లెక్కల ప్రకారం చేసిన పునర్వ్యవస్థీకరణ ఆధారంగానే ప్రస్తుత లోక్‌సభ, శాసనసభ సీట్లు ఉన్నాయి. ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 1976లో ఒకసారి, 2002లో మరోసారి 25 ఏళ్ల చొప్పున పునర్వ్యవస్థీకరణపై నిషేధం విధించారు. 2026 తర్వాత చేపట్టబోయే జనాభా లెక్కలను అనుసరించి మాత్రమే పునర్వ్యవస్థీకరణను చేపట్టాలని 84వ రాజ్యాంగ సవరణ(2002) నిర్దేశించింది. జనాభా సేకరణను త్వరలో చేపట్టినా తుది లెక్కలు రావటానికి రెండేళ్లైనా పట్టొచ్చు. ఏ జనాభా లెక్కలు ఆధారంగా పునర్వ్యవస్థీకరణను చేపట్టాలన్నది 84వ రాజ్యాంగ సవరణకు ప్రభుత్వం ఇచ్చే వ్యాఖ్యానమే కీలకంగా ఉంటుంది. ప్రభుత్వం కావాలనుకుంటే సీట్లల్లో మార్పులను 2031 జనాభా సేకరణ లెక్కలు వచ్చేదాకా వాయిదానూ వేయొచ్చు!

తరిగేవి... పెరిగేవి...

రాష్ట్రం	ప్రస్తుత స్థానాలు	2011 జనాభా లెక్కల ప్రకారం వచ్చే సీట్లు	2026 నాటికి వచ్చే సీట్లు	848 సీట్లకి పెంచితే రాష్ట్రాల వాటాలు
తమిళనాడు	39	32	31	49
ఆంధ్రప్రదేశ్ + తెలంగాణ	42	37	34	54
కేరళ	20	15	12	20
ఒరిస్సా	21	18	18	28
పశ్చిమ బెంగాల్	42	40	38	60
కర్ణాటక	28	27	26	41
హిమాచల్‌ప్రదేశ్	4	3	3	4
పంజాబ్	13	12	12	18
ఉత్తరాఖండ్	5	4	4	7
అస్సాం	14	14	14	21
జమ్మూ కశ్మీర్	6	6	6	9
ఛత్తీస్‌గఢ్	11	11	12	19
ఢిల్లీ	7	7	8	12
మహారాష్ట్ర	48	49	48	76
గుజరాత్	26	27	27	43
హర్యానా	10	11	11	18
జార్ఖండ్	14	15	15	24
మధ్యప్రదేశ్	29	32	33	52
రాజస్థాన్	25	30	31	50
బిహార్	40	46	50	79
ఉత్తర్ ప్రదేశ్	80	88	91	143

నోట్: కేంద్రపాలిత ప్రాంతాలు + చిన్న రాష్ట్రాలు మినహా

పెరిగిన జనాభా లెక్కలను తీసుకుని పునర్వ్యవస్థీకరణ చేస్తే మార్పులు తీవ్రంగానే ఉంటాయి. ఉదాహరణకు 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను సర్దుబాటు చేస్తే దక్షిణాది రాష్ట్రాలు కోల్పోయేది ఎక్కువని అయిదేళ్ల కిందటే జెమీ హింట్‌సన్, మిలన్ వైష్ణవ్ వివరించారు. హిందీ రాష్ట్రాలు బాగా లబ్ధిపొందుతాయనీ తేల్చారు. పైన ఇచ్చిన పట్టిక చూస్తే ఈ తేడాలు స్పష్టంగా కనపడతాయి. దక్షిణాది రాష్ట్రాలు 18 స్థానాలు కోల్పోతాయి. ఇక ఈ ఏడాదే (2026) పునర్వ్యవస్థీకరణ జరిగితే లాభనష్టాలు ఇంకా ఎక్కువగా ఉంటాయి. అప్పుడు దక్షిణాది 26 సీట్లను కోల్పోతుంది. హిందీ రాష్ట్రాలకు అదనంగా 35 సీట్లు చేరతాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రం ఒక్కోసీటు మాత్రం తగ్గుతుంది. మొత్తంమీద బీజేపీకి పరిస్థితి అనుకూలంగా మారుతుంది.

పునర్వ్యవస్థీకరణతో ప్రస్తుతం ఉన్న సీట్లను ఏ రాష్ట్రమూ కోల్పోకూడదన్న లక్ష్యంతో 2011 జనాభా లెక్కల ఆధారంగా కసరత్తు చేస్తే మొత్తం సీట్లను 718కి పెంచాల్సి వస్తుంది. ఇక 2026 జనాభాని పరిగణనలోకి తీసుకుంటే పెరిగే సీట్లు 848 అవుతాయి. అప్పుడు కేరళ మినహా అన్ని రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయి. కానీ ఉత్తర, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల మధ్య తేడాలు ఇంకా ఎక్కువవుతాయి. మొత్తం సీట్లల్లో దక్షిణాది శాతం ఇప్పటికంటే తగ్గిపోతుంది.

రాజ్యసభలో రాష్ట్రాలకు కేటాయించే సీట్లు కూడా జనాభాను బట్టే ఉంటాయి. జనాభా ప్రాతిపదికగా ఆ సీట్లను పెంచినా పరిస్థితి మారదు. లోకసభ సీట్ల విషయంలో తలెత్తిన పరిస్థితే ఇక్కడా ఎదురవుతుంది. అమెరికా సెనేట్‌లాగా ప్రతి రాష్ట్రానికి రాజ్యసభలో సమాన ప్రాతినిధ్యం కల్పించి ద్రవ్య బిల్లులకు దాని ఆమోదం తప్పనిసరి చేస్తే కొంత పరిష్కారం లభించొచ్చు. ఉత్తరాది ఎంపీలు దీనికి సిద్ధపడతారా? అన్నది పెద్దప్రశ్న. ఆధిపత్యాన్ని ఎవరూ ఉదారంగా వదులుకోరు. దీనికి భిన్నంగా శ్రుతీ రాజగోపాలన్ మరొక ప్రతిపాదన చేశారు. జనాభా ఆధారంగా రాజ్యసభ సీట్లను నిర్ణయించే ఫార్ములాకు సవరణ చేపట్టి.. ఆర్థికాభివృద్ధి ప్రకారం సీట్ల కేటాయింపులో మార్పులు చేయవచ్చనీ సూచించారు. రాష్ట్రం సొంత తలసరి రెవెన్యూని బట్టి రాజ్యసభ సీట్లను తగ్గించటం గానీ పెంచటం గానీ చేయగలగాలి. శ్రుతి ఫార్ములా ప్రకారం జాతీయ తలసరి రెవెన్యూని ప్రాతిపదికగా తీసుకుని ఒక రాష్ట్రం సొంత రెవెన్యూ నిష్పత్తి అందులో ఎంత ఉందో చూడాలి. జాతీయ తలసరికి సమానంగా అది ఉంటే, జనాభా ప్రాతిపదికన కేటాయించే రాజ్యసభ సీట్లు యథాతథంగా ఉంటాయి. ఒకవేళ తక్కువ ఉంటే ఆ మేరకు సీట్లలో కోతపడుతుంది. ఎక్కువ ఉంటే సీట్లు పెరుగుతాయి. ఉదాహరణకు బిహార్ తలసరి సొంత రెవెన్యూ.. కోవిడ్‌కు ముందు రూ.2,356 ఉంది. జాతీయ సగటు రూ.8,771తో పోల్చితే దాని నిష్పత్తి 0.27 అవుతుంది. తాజా జనాభా (2026) ప్రకారం బిహార్‌కు 21 రాజ్యసభ సీట్లు లభిస్తాయి. కానీ సొంత రెవెన్యూ నిష్పత్తి (0.27) ప్రకారం 5–6 సీట్లే దక్కుతాయి. ఈ పద్ధతి ఆర్థికంగా ముందుండే దక్షిణ, పశ్చిమాదులకు బాగా లాభిస్తుంది. ఇట్లా రాష్ట్రాల రాజ్యసభ ప్రాతినిధ్యాన్ని సొంత రెవెన్యూతో ముడిపెట్టాలి. దాంతో వెనుకబడిన రాష్ట్రాలు కూడా ఆర్థికాభివృద్ధిని సాధించి రాజ్యసభలో ప్రాతినిధ్యం పెంచుకోటానికి కృషిచేస్తాయి.

మరో పాతికో, యాభై ఏళ్లో పునర్వ్యవస్థీకరణను వాయిదా వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అయిపోదు. నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచటం వల్ల రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ అసమానతలు తొలగిపోవు.

ఏ కోణం నుంచి చూసినా 75 ఏళ్ల కిందట రాష్ట్రాలకు నిర్దేశించిన హక్కులు, అధికారాలు ఇప్పటి పరిస్థితుల్లో సరిపోవన్నది స్పష్టమవుతూనే ఉంది. 1991 తర్వాత మారిన ఆర్థిక విధానాలతో రాష్ట్రాలకు వ్యాపార, పారిశ్రామికాభివృద్ధి పరంగా లభిస్తోన్న వెసులుబాట్లు రాజకీయాధికారాల్లో కూడా ప్రతిఫలించాలి. పునర్వ్యవస్థీకరణ చుట్టూ రేగుతున్న వివాదాలు ఆ ప్రతిఫలన కోసం సాగుతున్న పెనుగులాటలే! దక్షిణాది ఆర్థిక ప్రగతి రాజకీయాధికారంలో అధిక వాటాకోసం గొంతెత్తేలా చేస్తుంది. దీన్ని జాతీయవాద వ్యతిరేక ధోరణిగా చూస్తే జరిగేది నష్టమే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)


శాంతి చర్చలకు సిద్ధమై పరిణతి చూపించారు!

చనిపోయేది ఎవరైతేనేమి, ముందుకే పోవాలని ఇరు పక్షాలూ అనుకొనే యుద్ధాలు కొన్ని ఉంటాయి. వాటిలో ఎవరి ప్రయోజనాలు వాళ్లకు ఉంటాయి. కానీ దురాక్రమణకు, స్వీయ సంరక్షణకు మధ్య సాగే యుద్ధాలు వీటికి భిన్నమైనవి. మధ్య భారతదేశంలో జరుగుతున్న యుద్ధం ఇలాంటిదే. ఈ యుద్ధంలో భారత ప్రభుత్వానికి సాధారణ ప్రజలే లక్ష్యం. బైటికి మాత్రం మావోయిస్టులతో తలపడుతున్నానని అంటోంది. కానీ మరణిస్తున్నవాళ్లలో మూడొంతుల మంది సాధారణ ప్రజలని మావోయిస్టులే చెబుతున్నారు.

ఈ హత్యాకాండ ఆగాలనే ప్రజాస్వామిక ఆందోళనలకు కొనసాగింపుగా హైదరాబాదులో శాంతి చర్చల కమిటీ ఏర్పడింది. "భారత ప్రభుత్వమూ, మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణను పాటించి శాంతి చర్చలకు సిద్ధం కావాలి" అని ఈ కమిటీ ప్రతిపాదించింది. ఈ యుద్ధంలో సాధారణ ప్రజల ప్రాణాలు పోవడానికి వీల్లేదనే మానవీయ ఆకాంక్షతో మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధపడింది. ఈ మేరకు గత నెల 28న ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది మానవ ప్రాణం పట్ల మావోయిస్టుల వైఖరిని తెలియజేస్తోంది. ఒకటిన్నర పేజీల ఈ ప్రకటనలో తమ పార్టీ నాయకుల, కార్యకర్తల మరణాల కంటే ఆదివాసుల ప్రాణాలకే వాళ్లు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.

నిజానికి మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధం కావడం ఇది మొదలు కాదు. 2002లో, 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాంతి చర్చలు ఒక దశ దాకా జరిగి విఫలమయ్యాయి. ఆ తర్వాత కూడా పశ్చిమ బెంగాల్‌లో మమత అధికారంలోకి వచ్చాక శాంతి చర్చల ప్రస్తావన వచ్చినప్పుడు మావోయిస్టు పార్టీ సానుకూలంగా స్పందించింది. 2023 డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వమే శాంతి చర్చల ప్రతిపాదన పదేపదే తీసుకొచ్చింది. దానికి రెండుసార్లు మావోయిస్టుపార్టీ దండకారణ్య కమిటీ సంసిద్ధత తెలియజేసింది. ప్రభుత్వమే శాంతి చర్చలకు సిద్ధమైంది కాబట్టి, సానుకూల వాతావరణం ఏర్పాటు చేయాలని, దీని కోసం కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలను బ్యారెక్‌లకే పరిమితం చేయాలని, కొత్త సైనిక క్యాంపులు ఏర్పాటు చేయరాదని సూచించింది. అయినా ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేదు. ఒక పక్క శాంతి చర్చలు అంటూనే ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది.

ఆపరేషన్ కగార్‌లో సాధారణ ప్రజల ప్రాణాలు పోవడానికి వీల్లేదనే మానవీయ ఆకాంక్షతో మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధపడింది. తీవ్రమైన యుద్ధం మధ్యలో చిక్కుకొని కూడా ప్రజల ప్రయోజనాల కోసం శాంతి చర్చలకు సిద్ధమని చెప్పడం మావోయిస్టుల రాజకీయ పరిణతిని సూచిస్తోంది. ఒకటిన్నర పేజీల ఆ ప్రకటనలో తమ పార్టీ నాయకుల, కార్యకర్తల మరణాల కంటే ఆదివాసుల ప్రాణాలకే మావోయిస్టులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.



ఇప్పుడు మళ్లీ హైదరాబాదులో ఏర్పడ్డ శాంతి చర్చల కమిటీ పౌర సమాజం వైపు నుంచి శాంతి చర్చల ప్రతిపాదన చేసింది. ఈసారి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీయే స్పందించింది. సాయుధ పోరాటం వల్లేనేగాక అనేక ఇతర ప్రక్రియల వల్ల ప్రజా ప్రయోజనాలు నెరవేరుతాయనే ప్రజాస్వామిక దృక్పథం ఉండటమే దీనికి కారణం. తీవ్రమైన యుద్ధం మధ్యలో చిక్కుకొని కూడా ప్రజల ప్రయోజనాల కోసం శాంతి చర్చలకు సిద్ధమని చెప్పడం మావోయిస్టుల రాజకీయ పరిణతిని సూచిస్తోంది. లక్షలాది బలగాలు, వందలాది సైనిక క్యాంపుల మధ్య ఆదివాసుల జీవితానికి భద్రత లేకుండా పోయింది కాబట్టి, గతంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందు దండకారణ్య కమిటీ పెట్టిన ప్రతిపాదనలనే ఇప్పుడు ఆ పార్టీ కేంద్ర కమిటీ పెట్టింది. ఈ విడత శాంతి చర్చల ప్రస్తావనకు ఇంత నేపథ్యం ఉన్నది.

అయితే ఈ మారణకాండ ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే జరగడం లేదు. అక్కడ తీవ్రంగా ఉన్నప్పటికీ మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిషా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా కగార్ యుద్ధం నడుస్తున్నది. అందువల్ల ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సహా, కేంద్రం ముందు శాంతి చర్చలకు తమ సమ్మతిని మావోయిస్టులు తెలియజేశారు. "మధ్య, తూర్పు భారతదేశంలోని పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడిత జాతులపై జరుగుతున్న కగార్ యుద్ధాన్ని నిలిపివేయాలి" అని మావోయిస్టులు డిమాండ్ చేశారు.

కాబట్టి ఇది మావోయిస్టులకు –ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య తలెత్తిన సమస్య కాదు. మధ్య, తూర్పు భారతదేశంలోని ఆదివాసీ, పీడిత ప్రజలకు – ప్రభుత్వానికి మధ్య నడుస్తున్న సంఘర్షణ. ఆ ప్రాంతాల్లోని సహజ సంపదలకు అక్కడున్న ఆదివాసీ ప్రజలు సంరక్షకులు. వాళ్ల అస్తిత్వానికి, స్వయం పాలనలోని రాజకీయ, సాంస్కృతిక జీవన విధానానికి భారత రాజ్యాంగం గుర్తింపును ఇచ్చింది. చట్టబద్ధమైన రక్షణ కల్పించింది. ప్రభుత్వం దీన్ని ఉల్లంఘించి అభివృద్ధి అనే పేరుతో ఆదివాసీ ప్రాంతాల కార్పొరేటీకరణకు పాల్పడుతోంది. ప్రభుత్వ అభివృద్ధి నమూనా వల్ల తలెత్తిన ఈ యుద్ధం ఆదివాసులను బలి తీసుకుంటోంది. దీన్ని ఆపడానికి శాంతి చర్చల కమిటీ చేసిన ప్రతిపాదనలను మావోయిస్టులు గౌరవించారు. "ప్రజల ప్రయోజనాల కోసం మేము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే" అని స్పష్టంగా ప్రకటించారు.

ఈ యుద్ధంలో భారత ప్రభుత్వం తన అజమాయిషీలో ఉండే సైనిక బలగాలే గాక ఆదివాసీ యువతను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకొని, వారి చేతనే ఆదివాసులను హత్య చేయిస్తున్నదని కూడా మావోయిస్టులు తమ ప్రకటనలో అన్నారు. అట్లాగే గత ఏడాది నుంచి వందలమంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రభుత్వం చెబుతోంది. అణచివేతలాగే బలవంతపు లొంగుబాటు కూడా ప్రభుత్వ వ్యూహంలో భాగం. వీళ్లంతా ఆదివాసులు. దండకారణ్య ప్రజలపై జరుగుతున్న యుద్ధంలో ఈ 'లొంగిపోయిన నక్సలైట్లను' భాగం చేసే ప్రమాదం ఉన్నది. అంటే ఒక రకమైన అంతర్యుద్ధ వాతావరణం అక్కడ నెలకొని ఉన్నది. ఏ రకంగా చూసినా ఇది ప్రజల ఉనికిని పూర్తిగా దెబ్బతీస్తుంది.

ఈ పరిస్థితుల్లో మావోయిస్టులు కేవలం ఆదివాసీల గురించేగాక గైరాదివాసీల ప్రయోజనాల గురించి కూడా ఆలోచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేస్తే ఈ అన్ని సమూహాల మౌలిక సమస్యలను ముందుకు తీసుకొస్తారు. పాలకుల అభివృద్ధి నమూనా వల్ల తలెత్తిన ఈ హత్యాకాండ ఆగాలని కోరుకుంటున్నారు కాబట్టి మావోయిస్టులు దీన్ని కేవలం రాజకీయార్థిక విషయంగానే చూడ్డం లేదు. రాజ్యాంగబద్ధ పాలనలోని సామాజిక, సాంస్కృతిక విషయాలను సహితం ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం "మత మైనారిటీలపై వివక్షతను రాజ్యాంగబద్ధం చేస్తోంది" అని చెబుతూ, ఆదివాసీ–గైరాదివాసీ సంస్కృతీ సంప్రదాయాల రక్షణ, మాతృభాషల, పర్యావరణ రక్షణ వైపు నుంచి కూడా మాట్లాడారు.

మావోయిస్టుల ప్రకటన రాగానే ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం చర్చలకు సిద్ధమే అంటూ, ఆయుధాలు వదిలిపెట్టాలని అన్నది. మావోయిస్టులు ఆయుధాలు వదిలేస్తే ఇక చర్చలు జరగాల్సిన పనే ఉండదు. శాంతి చర్చలకు మావోయిస్టులు సూత్రబద్ధ, నిర్మాణాత్మక ప్రతిపాదనలు సూచిస్తే, ప్రభుత్వం మాత్రం చర్చలు జరగనవసరం లేని కండీషన్ పెట్టింది. ఈ అసంబద్ధతను ప్రజాస్వామికవాదులు గుర్తించాలి. చర్చనీయాంశం చేయాలి. ఈ పని కూడా మావోయిస్టుల కోసం కాదు. వాళ్లూ కోరుకుంటున్న ప్రజల ప్రయోజనాల కోసం.

■ పాణి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిధిలోని ఆయా మండలాలలో ఎంపిక చేసిన గ్రామాలలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, 2బీహెచ్‌కే ఇళ్ల పురోగతిపై సోమవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎంత వరకు వచ్చాయి? బేస్‌మెంట్ దశకు ఎన్ని వచ్చాయి? తదితర వివరాలను ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక కూపన్లు అధికారులు అందజేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వారంలో మూడు రోజులు అధికారులు పర్యవేక్షించాలన్నారు. బేస్‌మెంట్ వరకు వచ్చిన ఇళ్లకు బిల్లుల చెల్లింపునకు పంపాలని, అదేవిధంగా లబ్ధిదారులుగా ఉన్న పురుషుల కుటుంబాలకు చెందిన వాటిలో రేషన్‌కార్డులో ఉన్న మహిళ పేరును ఖరారు చేస్తూ జాబితాను సమర్పించాల్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య యూడీఐడీ కార్డులు, చేయూత పెన్షన్‌లపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా హౌసింగ్ అధికారి రవీందర్, అడిషినల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వారంలోగా ప్రారంభించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రూట్ మ్యాపును తయారుచేసి వెంటనే అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని, వెంటనే మిగతా కేంద్రాలలో ప్రారంభించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల ఆకస్మిక బదిలీ యత్నాలు కలకలం రేపుతున్నాయి. ములుగు జిల్లా విఎనహా వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లిలో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసేందుకు ఆయా జిల్లాల యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నట్టు వస్తున్న వార్తలు ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి 8 నెలల కిందటే జీవో నెంబరు 80 ప్రకారం ప్రస్తుతం కార్యదర్శుల్లో 40 శాతం మందిని బదిలీ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ ఆదేశాలు లేకుండా ఎలాంటి బదిలీలు చేయరాదు. పైగా రాష్ట్రంలో బదిలీలపై నిషేధం అమలులో ఉండగా ఎలా బదిలీలు చేస్తారని కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శుల బదిలీలు అంతా మౌఖికంగానే జరుగుతున్నాయని సమాచారం. కాగా ఈ బదిలీలపై జిల్లా పంచాయతీ అధికారులు మౌనం పాటిస్తున్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మాట.. చేటు.. వేటు..!

ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు రంగం సిద్ధం?

- 8నెలలకే రెండోసారి ట్రాన్స్‌ఫర్లకు కసరత్తు
- అయోమయంలో ఐదు జిల్లాల కార్యదర్శులు
- నియోజకవర్గాల వారీగా చేయడంపై చర్చ
- బదిలీ యత్నాల వెనుక రాజకీయ కోణం
- ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికే కారణమా?
- ఇన్‌చార్జ్ మంత్రిపై ఎమ్మెల్యేల ఒత్తిడి ఫలితం
- నిబంధనలకు వ్యతిరేకమంటున్న ఉద్యోగులు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొదలైన ఆందోళనలు
- కలెక్టర్లను కలిసి వినతిపత్రాల అందజేత



రాజకీయ ఒత్తిళ్లేనా?

పంచాయతీ కార్యదర్శులను ఆకస్మిక బదిలీ కసరత్తు వెనుక రాజకీయ కోణం ఉన్నట్టు భావిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ మాటలను కార్యదర్శులు వినడం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి మొరపెట్టుకోగా ఆయన ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు అధికారులు బదిలీలు చేపడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కొద్ది నెలలుగా కార్యదర్శుల బదిలీపై ఎమ్మెల్యేలు ఇన్‌చార్జ్ మంత్రిపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో మంత్రి ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు బదిలీ చేయాల్సిన కార్యదర్శుల జాబితాను జిల్లా యంత్రాంగాలు సిద్ధం చేసినట్టు సమాచారం.

ఇందిరమ్మ ఇళ్లే కారణమా?

పంచాయతీ కార్యదర్శులను ఆగమేఘాల మీద బదిలీ చేయాలన్న ఒత్తిళ్లు రావడం వెనుక ఇందిరమ్మ ఇళ్లే కారణమని తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇందుకు కార్యదర్శులే కారణమని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు భావించినట్టు తెలుస్తోంది. 2004-2014 మధ్య రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ పార్టీయే ఉంది. ఆ సమయంలో చాలా మంది కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులుగా అవతారమెత్తి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పెద్దమొత్తంలో డబ్బులు దండుకున్నారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారుల ఎంపికలో గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను మినహాయించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు కార్యదర్శులు వారి పేర్లేవి రాకుండా జాబితాలు తయారు చేశారు. దీంతో వీరంతా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కార్యదర్శులే కావాలని తమ పేర్లను చేర్చలేదని ఫిర్యాదులు చేశారు. దీనికితోడు గ్రామాల్లో అర్హులైన చాలా మంది పేర్లు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చోటు చేసుకోలేదు. ఒక ఇంటిలో తల్లిదండ్రులతో పాటు కొడుకులు నివాసముంటున్నప్పుడు తండ్రి పేరును ఇంటి యజమానిగా పేర్కొని కొడుకులకు సొంత ఇల్లు లేవు కనుక వారు అద్దెకున్నట్టు కార్యదర్శులు పేర్కొన్నప్పటికీ వారి పేర్లేవి ఇందిరమ్మ జాబితాలో చోటు చేసుకోలేదు. ఇందుకు కార్యదర్శులు బాధ్యులు కానప్పటికీ తమ పేర్లు లేకపోవడానికి వారే కారణమంటూ ఎమ్మెల్యేలకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. తాము చెప్పినట్టు కార్యదర్శులు నడచుకోవడం లేదన్న కోపంతో ఎమ్మెల్యేలు వారిని ఏకంగా తమ నియోజకవర్గంలోనే ఉండకుండా ఇలా బదిలీలకు ప్లాన్ చేసినట్టు సమాచారం.

అయోమయం

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే

మిగతా 7వ పేజీలో

తెలంగాణను దోచుకోవడానికే

పుట్టిన పార్టీ కాంగ్రెస్

- ప్రాణాలకు తెగించి రాష్ట్రాన్ని తెచ్చింది కేసీఆర్
- మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి



ఎల్కతుర్తిలో సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలిస్తున్న మధుసూదనాచారి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంతాన్ని దోచుకోవడానికే కాంగ్రెస్ పార్టీ పుట్టిందని ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి విమర్శించారు. సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి నిర్వహణ వివరాలు, పార్కింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుసూదనాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను బలవంతంగా ఆంధ్రాలో కలిపి తెలంగాణలో ఉన్న సంపద, ఉపాధి, ఉద్యోగ, వనరులను దోచుకుందని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితేనే తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడుతాయని ప్రాణ త్యాగానికి సిద్ధపడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చింది బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రం అల్లకల్లోలంగా ఉందన్నారు. సాగు, తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. రాష్ట్రం ఏర్పడిన రెండేళ్లలోనే ప్రపంచ దేశాలు తెలంగాణ వైపు చూసేలా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఇచ్చిన, ఇవ్వని హామీలన్నింటినీ నెరవేర్చడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు చేర్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పదిహేను నెలల్లోనే రాష్ట్రం సంక్షోభంలో పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన సాగుతోందన్నారు. కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పులు చేస్తే.. కాంగ్రెస్ ఢిల్లీకి మూటలు పంపడానికి అప్పులు చేస్తోందని విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే మెడలు వంచి నెరవేర్చేలా చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ప్రజానీకానికి తేటతెల్లం చేయనున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ సభకు లక్షలాదిగా ప్రజలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని మధుసూదనాచారి కోరారు.

ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. సభ స్థలాన్ని చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల రైతులు సాగు చేసిన పంటలు చివరి దశలో ఉన్నాయని, సభ తేదీలోపు పనులను పూర్తి చేస్తామన్నారు. సభకు వేలాదిగా రానున్న వాహనాలను దృష్టిలో పెట్టుకుని సభాస్థలికి నాలుగు దిక్కులా పార్కింగ్ స్థలాలను సైతం చదును చేస్తున్నామన్నారు. పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, పది లక్షల వాటర్ బాటిళ్లు సభకు వచ్చే ప్రజల కోసం అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. వరంగల్‌లో సిటీ పోలీస్ యాక్టు 30 అమలులో ఉందన్నారు. సభ అనుమతులు రావడంలో ఎలాంటి సందేహాలు, అపోహలు వద్దన్నారు. సభ అనుమతుల కోసం వరంగల్ సీపీ, ఏసీపీ, స్థానిక సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్నామన్నారు. రెండు, మూడు రోజుల్లో పోలీసుల నుంచి క్లియరెన్స్ వస్తుందన్నారు. సభ నిర్వహణను అన్ని పార్టీల నాయకులు ఏకీభవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, మేడిపెల్లి శోభన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ శ్రీపతి రవిందర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, నాయకులు బోయినపెల్లి దేవేందర్‌రావు, కోరే రాజ్‌కుమార్, దుకిరే రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజావాణికి 106 అర్జీలు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి తీసుకునే వినతులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 106 వినతులు రాగా, ఇందులో ఎక్కువగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చాయి. మిగతా ఫిర్యాదులు వివిధ సమస్యలపై వచ్చాయి. బాధితుల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను పిలిచి వినతులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధితుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

నా భూమిని కాపాడండి..

హనుమకొండ మండలం వడ్డేపల్లి శివారులోని జవహర్‌కాలనీలోని సర్వే నెంబర్ 27లో 2310 చదరపు గజాల మా భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని న్యాయవాది సాయిని నరేందర్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు.

అటవీశాఖ అధికారుల తీరు సరికాదు

అటవీశాఖ అధికారుల తీరు సరికాదని, అటవీశాఖ వల్ల పట్టా భూములైన మా భూములను సాగుచేసుకోకుండా ఇబ్బంది పడుతున్నామని ధర్మసాగర్ మండలం ముప్పారం, దేవునూరు గ్రామాల రైతులు కలెక్టర్‌కు ప్రావీణ్యకు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే ఎఫ్ఆర్‌వో, అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేసి మా భూములు మాకు అప్పగించాలని వారు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఒంటిమామిడిపల్లి స్కూల్

రోల్‌మోడల్

- పాఠశాల పనితీరును సీఎం దృష్టికి తీసుకెళ్తా..
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఐనవోలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల రోల్‌మోడల్ కావాలని, ఆ పాఠశాల అభివృద్ధి పనితీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. పీఎంశ్రీలో ఎంపికైన ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్యా కమిషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉస్మానియ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజలతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. డిజిటల్ తరగతులు నడుస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ ప్లే టూల్స్ , సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు. పాఠశాలకు తరగతి గదుల కొరత ఉందని, నాలుగు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కమిటీ బాధ్యులు చైర్మన్‌కు వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా విద్యా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారం, పేరెంట్స్ కమిటీ పనితీరు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం లభిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధిస్తున్నప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకోసం ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకొని స్టడీ అవర్స్ పెట్టుకోవడం బాగుందన్నారు. పాఠశాల పనితీరును సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ అధ్యక్షురాలు సకీనాబీ, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, బాలవికాస డైరెక్టర్ శౌరెడ్డి, తిరుపతి, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఆరుట్ల ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు పాపిరెడ్డి, పీఎస్ హెచ్‌ఎం మోహన్‌గౌడ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెండ్లి నవీన్, వైస్ చైర్మన్ గొనే రాజు, సభ్యులు టి.ఆనందం, ఏసీరెడ్డి రవీందర్, పాఠశాల సలహాదారు మహ్మద్ రఫీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల్లో అవకతవకలు

- నిబంధనలు బేఖాతరు చేస్తూ ఉత్తర్వులు
- విదేశాల్లో ఉన్న టీచర్‌కు డ్యూటీ
- మూడేళ్ల నిబంధనను తుంగలో తొక్కిన వైనం
- సెకెండ్ లాంగ్వేజ్ ఉపాధ్యాయుడితో ఫస్ట్ లాంగ్వేజ్ మదింపు
- ప్రారంభమైన టెన్త్ స్పాట్ క్యాంపు.. 15 వరకు కొనసాగింపు

7

ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలి

- రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్
- కేయూలో మహనీయుల జయంతి సభ



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో నిత్యం చైతన్యాన్ని నింపి సామాజిక వృద్ధిని యువత పెంపొందించాలని రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) నేతృత్వంలో మహనీయులు జయంతి సభను ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎస్ కేయూ అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుద్ధుడు, సాహు మహరాజ్, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, పూలే, కాన్షీరామ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మహనీయుల జీవిత చరిత్రలను చదువుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జీవితాన్ని అధ్యయనం చేస్తే సామాజాన్ని బాగు చేయవచ్చునని వివరించారు. యువత మహనీయుల బాటలను మరువొద్దని సూచించారు. దేశంలో సామాజిక చైతన్యాన్ని నింపే బాధ్యత యువత భుజస్కందాలపై ఉందన్నారు. దేశంలో రిజర్వేషన్ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషి చేస్తోందని ఉద్బోధించారు.

కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ యువతను సన్మార్గంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. యువత చదువులతో పాటు సమాజం పట్ల సరైన అవగాహనలో నడవాలని అన్నారు. యువతతోనే దేశం అభివృద్ధి సాధ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశంలోని నిరుద్యోగం, నిరాక్షరాస్యత, పేదరికం రూపుమాపేందుకు యువత ముందుండాలని అన్నారు. వర్సిటీలో యువత బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. అంబేద్కర్ సామాజిక అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని అన్నారు. బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కళ్ళేపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ. ఏప్రిల్ నెలలో అంబేద్కర్, పూలే, బాబు జగ్జీవన్‌రామ్ జయంతిలను పురస్కరించుకుని బీఎస్ఎఫ్ నేతృత్వంలో మహనీయులు జయంతి సభను నిర్వహించినట్లు తెలిపారు. కాన్షీరామ్ ఉత్తరప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలను ఏకతాటిపైకి తెచ్చి రాజ్యాధికారాన్ని సాధించారని చెప్పారు. రాజ్యాధికారం అందరి హక్కు అని అన్నారు. మహనీయులు బాటలో నడిచి జీవితాలను ఉన్నతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇఫ్లూ వర్సిటీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ పోరిక వికాస్, బీఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు తాండ్ర శ్రీహిత, ధర్మేందర్, సూర్య, విశాల్, శివ, రాజేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి

ప్రజల కోసం కాపలా కుక్కలా ఉంటా

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం కాపలా కుక్కలా ఉంటానని కడియం శ్రీహరిలా గుంట నక్కను కాదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జనగామ మండల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదాయంలో నంబర్ 1గా ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 14వ స్థాయికి పడేసిందని ఆరోపించారు. సమస్యలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలిసి దాడులు చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారన్నారు. ప్రజల కోసం కాపలా కుక్కలా ఉంటానని, కడియం శ్రీహరిలా గుంట నక్కను కాదని, అభివృద్ధికి ఆపేసే చరిత్ర కడియం శ్రీహరిదే అన్నారు. 27న వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించే సిల్వర్ జూబ్లీ సభను అడ్డుకునే శక్తి ఎవ్వరికీ లేదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాలు, పట్టణాల నుంచి అధిక సంఖ్యల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాల్దె సిద్ధిలింగం, మేకల కళింగ రాజు, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బైరగోని యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ గార్డెనింగ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డును చూపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఉన్న గార్డెనింగ్ (పార్కు)కు రాష్ట్ర ఉద్యానశాఖ నిర్వహించిన 8వ గార్డెనింగ్ ఫెస్టివల్‌లో ఉత్తమ గార్డెనింగ్ అవార్డు వచ్చినట్లు కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో కలెక్టర్ అవార్డును ప్రదర్శించి సంబంధిత అధికారులను అభినందించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో లాన్ ఏరియాతో పాటు వివిధ రకాల సుమారు 114రకాల పూలు, నీడను ఇచ్చే మొక్కలను నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం వలన రాష్ట్రస్థాయిలో గోల్డెన్ గార్డెన్ అవార్డు కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

వ్యవసాయ సర్వీసులను వేగంగా రిలీజ్ చేయాలి

వీసీలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సర్వీసులను వేగవంతంగా రిలీజ్ చేసి ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న కార్పొరేట్ కార్యాలయంలోని సంబంధిత అధికారులను సంప్రదించాలని సీఎండీ వరుణ్‌రెడ్డి విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్పీడీసీఎల్‌లోని 12 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సోమవారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. భారీ వర్షాలు, ఈదురుగాలులు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో భూపాలపల్లి, భద్రాద్రి, కొత్తగూడెం పరివాహక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వ్యవసాయానికి అవసరం ఉన్న చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీసర్కిల్ పరిధిలో ఎల్సీ యాప్‌పై కింది స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ సదర్‌లాల్, 12 సర్కిళ్ల అధికారులు పాల్గొన్నారు.

మడికొండలో మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

కలెక్టర్‌కు సామాజికవేత్త అశోక్ ఫిర్యాదు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మడికొండ గ్రామంలోని రెవెన్యూ సర్వే నెంబర్ 909, 910లో 7 ఏళ్ల నుంచి వరికుప్పల నరేష్ అనే వ్యక్తి అక్రమంగా నడిపిస్తున్న క్వారీల అనుమతులు రద్దు చేయాలని మడికొండకు చెందిన సామాజికవేత్త పల్లపు అశోక్ సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతి పొందిన క్వారీలైన సాయి శ్రీనిధి గ్రానైట్ సర్వేనెంబర్(799) ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం, హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు క్యాంపు సర్వేనెంబర్‌లోని 469/1లోని గాయత్రి గ్రానైట్స్‌లలో రాయల్టీలను ఉపయోగించి అధిక మొత్తంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడి చట్టప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సిందిపోయి చట్టవిరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని నరేష్ కలెక్టర్‌కు వివరించారు. ఆ అక్రమ మైనింగ్‌ను ఉద్దేశించి సరైన సాక్ష్యాలతో 2023 ఆగస్టు 30న అప్పటి మైనింగ్ ఏడీ నర్సిరెడ్డికి ఫిర్యాదు చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ ఫిర్యాదులో భవిష్యత్‌లో వారికి అనుమతి ఇవ్వొద్దని విన్నవించినప్పటికీ పట్టించుకోకుండా మళ్లీ వారికే వారితో కుమ్మక్కై ఇంపీరియల్ గ్రానైట్స్‌పై ఉన్న అనుమతిని ఆది కేశవ గ్రానైట్స్‌కు అక్రమంగా ఇచ్చారన్నారు. అక్రమ మైనింగ్ చేస్తున్న వరికుప్పల నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం భారీ జరిమానా విధించాలని అశోక్ కలెక్టర్‌ను కోరారు.


హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేస్తున్న అశోక్

ఐటీఐ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆమోదిత ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఐటీఐలో ప్రైవేటు అభ్యర్థులుగా పరీక్ష రాసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత ట్రేడులో మూడేళ్లకుపైబడి సర్వీసు కలిగి, సంబంధిత సంస్థ ద్వారా ధృవీకరణ పత్రం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో రూ.100 చెల్లించి దరఖాస్తు పొందాలని తెలిపారు. ఈ నెల 12 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మే 6 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని జనవరిలో సమ్మె నోటీసు ఇస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసి కార్మికులు సమ్మె చేపట్టనున్నట్లు ఆర్టీసీ జేఏసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు హైద్రాబాద్‌లో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్, లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని నోటీసులో పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జైలు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ట్రైసిటీ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 95 మందిని మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 మందికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు మరో ఇద్దరికి సామాజిక్ష సేవ శిక్షను విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. మిగిలిన వాహనదారులకు జరిమానా విధించారన్నారు. జైలుశిక్షకు గురైన వారిలో 10 మంది కాజీపేట పీఎస్ పరిధిలో పట్టుబడగా, మరో నలుగురు హనుమకొండ పీఎస్ పరిధిలో పట్టుబడ్డట్లు ఏసీపీ పేర్కొన్నారు.

కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అరుదైన గౌరవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తాలమాలజీ 40వ అంతర్జాతీయ సదస్సు ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగింది. ఇందులో 27 దేశాల నుంచి వచ్చిన కంటి వైద్య నిపుణులు పాల్గొన్నారు. కాగా, ఇందులో వరంగల్ నగరానికి చెందిన కంటి వైద్య నిపుణుడు ప్రొఫెసర్ డాక్టర్ జీఆర్.భరత్ కుమార్ అంతర్జాతీయ సదస్సులో శాస్త్రీయ ఉపన్యాసం ఇచ్చారు. దీనితో వరంగల్ నగరం నుంచి అంతర్జాతీయ వేదికపై శాస్త్రీయ ఉపన్యాసం ఇచ్చిన మొదటి నేత్ర వైద్య నిపుణుడిగా గౌరవం దక్కించుకున్నారు. డాక్టర్ భరత్ కుమార్ ప్రస్తుతం వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల పాలనాధికారిగా, కాకతీయ మెడికల్ కాలేజీ ఆప్తాల్మాలజీ విభాగాధిపతి సేవలు అందిస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి


అయాన్ (ఫైల్)

గీసుగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బిర్యానీ సెంటర్‌లో వంటచెరకుగా ఉపయోగించి రైల్వే బొగ్గును మింగి చికిత్స పొందుతూ కొర్ర అయాన్ అనే 9 నెలల బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథపురం గ్రామానికి చెందిన కొర్ర రాజు-శ్రీలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఆయాన్ అనే బాబు ఉన్నాడు. కాగా, జీవనోపాధి కోసం కొమ్మాల బస్ స్టేజీ వద్ద బిర్యానీ సెంటర్‌ను నడుపుకుంటున్నాడు. కాగా, రాజు భార్య శ్రీలత ఈ నెల 5న బాబును తీసుకొని బిర్యానీ సెంటర్‌కు వద్దకు వచ్చింది. ఆమె షాపులో పనులు చేస్తుండగా ఆయాన్ అక్కడ ఉన్న బొగ్గును మింగాడు. కొద్దిసేపటికి గమనించిన తల్లిదండ్రులు బొగ్గును నోటి నుంచి తీసి కడిగారు. కానీ బాబు ఊపిరి ఆడకపోవడంతో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. బాబు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ఆవిష్కార్ అభియాన్ పరీక్షలో గురుకుల విద్యార్థి ప్రతిభ


విద్యార్థి ఆశిష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం కుమారస్వామి, టీచర్లు

మడికొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి డి. ఆశిష్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి విద్యార్థికి సర్టిఫికెట్స్‌తో పాటు జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఆయనతోపాటు ఉప ప్రధానోపాధ్యాయులు యు. వీరాచారి, ఉపాధ్యాయులు డి.రాజేంద్రప్రసాద్, పి.టెన్సింగ్, ఎ.జ్యోతి, వి.చలపతి, ఎస్.శ్రీనివాస్, బి.హారతి, పి.రాజేందర్ విద్యార్థి ఆశిష్‌ను అభి

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7405	5300
మక్కలు	2151	1521
కందులు	6829	3022
పెసళ్లు	7602	3022
పల్లికాయ (సూక)	6500	5200
పల్లికాయ (పచ్చిది)	4200	4575
పసుపు (కాడి)	12126	10534
పసుపు (గోల)	12009	9700
తేజ మిర్చి	12600	9500
వండర్ హాట్	14800	10000
యూఎస్ 341	11300	9000
దీపిక	13000	10000
దేశీ	28000	18000
సింగిల్ పట్టి	26000	18500
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

బీసీ ఉద్యమాలను బలోపేతం చేయాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమాలను బలోపేతం చేసి రాజ్యాంగం ద్వారా తమకు సంక్రమించిన హక్కులను సాధించుకుందామని మన ఆలోచన సాధన సమితి (మాస్) కోర్ కమిటీ రాష్ట్ర మెంబర్ దొంత ఆనందం అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు సాధికారత, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కుల సాధన కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీల హక్కుల సాధన కోసం మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే మాస్ ఆవిర్భావ సభకు రాజకీయాలకు అతీతంగా బీసీలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు సంబంధించిన కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పూస నర్సింహ, ప్రొఫెసర్ వెంకట్‌యాదవ్, కాశీనాథ్, పీఎల్ఎన్ రావు, కుడికాల కుమారస్వామి, నారాయణగిరి రాజు, మెట్టు సురేందర్, ఉప్పు సమ్మయ్య, బూర నారాయణ, సూర్యనారాయణ, ముత్తిలింగం, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దొంత ఆనందం

రేపటి నుంచి దూరవిద్య ప్రాక్టికల్స్ తరగతులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాది బీఎస్సీ (ఎంఎస్టీసీఎస్) కోర్సుల మొదటి మొదటి సెమిస్టర్ ప్రాక్టికల్స్ తరగతులు ఏప్రిల్ 9 నుంచి నిర్వహిస్తామని కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బట్టి వెంకట గోపీనాథ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 9, 10, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి తరగతులు జరుగుతాయని వెల్లడించారు. తరగతులు పూర్తి కాగానే ఏప్రిల్ 12, 13 తేదీల్లో కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తరగతులకు హాజరై పరీక్షలు రాయాలని వెల్లడించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మావోయిస్టుకు రూ.4 లక్షల రివార్డు


మావోయిస్టుకు చెక్కు అందిస్తున్న సీపీ, డీసీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 21న కమిషనరేట్ కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలు వంజం కేశే అలియాస్ జెన్నిపై ఉన్న రూ.4 లక్షల రివార్డు చెక్కును సోమవారం సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అడవి బాట పట్టిన మావోయిస్టులు హింసను వదిలి జనంలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ లు జితేందర్‌రెడ్డి, తిరుమల్, కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవాదుల పంపింగ్ బంద్


- ఫేజ్ -2 లో ఒకటి, ఫేజ్-3 లో రెండు మోటార్ల నిలిపివేత
- బ్యారేజీలో నీటి నిల్వ తగ్గడమే కారణం


పంపింగ్‌ను నిలిపివేసిన దేవాదుల మోటార్లు

కన్నాయిగూడెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్‌ను సోమవారం నిలిపివేశారు. ఎగువ నుంచి నీటి రాక పూర్తిగా తగ్గడగంతో బ్యారేజీ డెడ్ స్టోరేజీకి చేరువైంది. దేవాదుల ఇన్‌టేక్ వెల్ నుంచి శుక్రవారం వరకు ఫేజ్ -2లో రెండు మోటార్లు, ఫేజ్ -3లో నాలుగు మొత్తం 6 మోటార్ల ద్వారా 1661 క్యూ సెక్కుల నీటిని పంపింగ్ చేసిన అధికారులు బ్యారేజీలో నీటి లభ్యత తగ్గిపోవడంతో పంపింగ్ చేసేందుకు మోటార్లకు సరి పడా నీళ్లు అందకపోవడంతో శనివారం నుంచి మోటార్లను ఒక్కొక్కటిగా ఆఫ్ చేసుకుంటూ వస్తున్నారు. శనివారం ఫేజ్-3లో ఒక మోటారును నిలిపి వేసిన అధికారులు సోమవారం ఉదయానికి ఫేజ్-2లో ఒకటి , ఫేజ్-3 లో మరొకటి నిలిపివేశారు. ఫేజ్2 లో ఒకటి , ఫేజ్3 లో రెండు మోటార్లు మొత్తం మూడు మోటార్ల ద్వారా 831 క్యూసెక్కుల నీటిని భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు.

బ్యారేజీలోకి ఎగువనుంచి 600 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు మూసి ఉంచి వచ్చిన నీటిని వచ్చినట్టు నిల్వచేస్తున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీ ఎమ్సీలు కాగా ప్రస్తుతం 1.03 టీఎంసీల నీళ్లు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి వచ్చే ఇన్ ఫ్లో కంటే పంపింగ్ చేసే నీళ్లు ఎక్కువ ఉండడంతో ఈ పంపింగ్ ఇలానే కొనసాగితే మరికొద్ది రోజుల్లేనే బ్యారేజీ డెడ్ స్టోరేజీకి చేరుకోనుంది. బ్యారేజీ వద్ద 73.75మీటర్ల నీటి మట్టం నమోదవగా దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 73.25మీటర్ల నీటి మట్టం నమోదైంది.

జార్జిరెడ్డి వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ



కేయూ గేట్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8 నుంచి 14 వరకు పీడీఎస్‌యూ నేతృత్వంలో జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం కేయూ మొదటి గేటు వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు మాట్లాడుతూ.. జార్జిరెడ్డి వర్ధంతిని వారం పాటు అన్ని కళాశాలల్లో, విద్యాలయాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ కార్యదర్శి వినయ్, కేయూ జనరల్ సెక్రటరీ వి. కావ్య, ఉపాధ్యక్షురాలు పి.అనూష, గణేశ్, సహాయ కార్యదర్శులు చందన, యాదగిరి, కాశోధికారి సంగీత, నాయకులు శ్రీజు, పెరియార్, హరికృష్ణ, మనోజ్, రమ్య, వినీల, నవ్య తదితరులు పాల్గొన్నారు.

అధునాతన నక్షత్రశాల..

అదిగదిగో..



పునరుద్ధరణకు ముందు శిథిలావస్థలో ఉన్న నక్షత్రశాల



పనులు పూర్తి చేసిన తర్వాత ప్లానిటోరియం ఉంటుందిలా (నమూనా)

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో 43ఏళ్ల క్రితం వరంగల్‌లో నక్షత్రశాల (ప్లానిటోరియం) ఏర్పాటైంది. నాడు దేశంలో ఉన్న 12 ప్లానిటోరియాల్లో ఇదొక్కటి. హిందూజా ప్రతాపరుద్ర ప్లానిటోరియం పేరుతో 2004 వరకు ఖగోళంపై విజ్ఞానాన్ని పంచింది. ఎంతో మంది డైరెక్టర్లు సేవలందించారు. అలాంటి ప్లానిటోరియం ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరింది. పర్యవేక్షణ, నిర్వహణ లేక పరికరాలు తుప్పు పట్టాయి. దీంతో సుమారు 20ఏళ్లుగా ఓరుగల్లు వాసులకు ప్లానిటోరియం అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుతం ఆసక్తి ఉన్నవారంతా హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాత ప్లానిటోరియం ఉన్న స్థానంలోనే అధునాతన హంగులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ప్లానిటోరియానికి రూపుదిద్దుతున్నారు.

ఇక వరంగల్ నుంచే..

ఆకాశంలో జరుగుతున్న వింతలు విశేషాలను వరంగల్ ప్లానిటోరియం నుంచే చూడొచ్చు. విశ్వం పుట్టుక, పరిణామ క్రమం, భూమిపై ఏర్పడిన మానవ స్వరూపాల గుర్తించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు. ఇతర గ్రహాల ప్రరిభ్రమణం.. వాటి పని తీరు... అక్కడి వాతావరణ పరిస్థితి.. ఒక్కో గ్రహం ప్రత్యేకత.. ఆయా గ్రహాల్లో జరిగే వింతలు వరంగల్ కేంద్రంగా చిన్న పిల్లల నుంచి పెద్ద వారు వయోబేధం లేకుండా వీక్షించవచ్చు. ఇకపై వరంగల్ నతక్షత్రశాలలో సూర్యకుటుంబంలో మిళితమై ఉన్న అంగారకుడు (మార్స్), బృహస్పతి (జూపిటర్), శుక్రుడు (వీనస్), భూమి(ఎర్త్), శని (సటర్న్), బుధుడు (మెర్క్యూరి), కేతువు (నెప్ట్యూన్), రాహువు (యురేనస్)లను అతి సమీపం నుంచి చూసే అవకాశం ఉంది. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సరికొత్త ప్లానిటోరియాన్ని అందుబాటులోకి తేనున్నారు. హైదరాబాద్ బిర్లా సైన్స్ మ్యూజియం తర్వాత అదే తరహాలో గతంలో ఉన్న నక్షత్రశాల ప్రదేశంలో కొత్త హంగులు, సాంకేతిక పరిజ్ఞానంతో ప్లానిటోరియాన్ని పునరుద్ధరణ చేస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్న క్రమంలోనే నక్షత్రశాల పనులను కూడా ముమ్మరంగా చేస్తున్నట్టు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. ఇక్కడి పనులను మేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సదరు కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేస్తున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర (ఫైల్)



ప్లానిటోరియం పనులు పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి (ఫైల్)

ఇప్పటికే రూ. 2 కోట్ల నిధులు ఖర్చు చేసి పాత భవనాన్ని రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. వరంగల్ నగరంలో చాలా కాలంగా నిలిచిపోయిన నక్షత్రశాలను పునఃప్రారంభించాలని ఇక్కడి ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా.. గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దాంతో వెంటనే కౌన్సిల్ తీర్మానం చేసి అనుకున్నదే తడవుగా మూడు నెలలుగా పనులను ముమ్మరంగా చేస్తున్నారు. సైన్స్, సాంకేతిక విద్య పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం అత్యాధునిక నక్షత్రశాలను పునఃప్రారంభించనున్నారు.



గతంలో పని చేసిన డైరెక్టర్ల వివరాల సైన్ బోర్డు

రూ.6 కోట్లతో పనులు

ప్రస్తుతం బల్దియా ప్రధాన కార్యాలయం, ఇండోర్ స్టేడియం సమీపంలో మొత్తం రూ.6 కోట్ల బల్దియా స్మార్ట్ సిటీ నిధులతో ప్లానిటోరియాన్ని పునరుద్ధరిస్తుండగా.. త్వరలోనే ఉమ్మడిఓరుగల్లుతో పాటు చుట్టుపక్కల జిల్లాల వారికి ఖగోళ విజ్ఞానాన్ని పంచబోతోంది. రూ.2కోట్ల నిధులతో భవనం పునరుద్ధరణ పనులు, డూం, సివిల్ వర్క్‌లు జరుగుతుండగా.. మరో రూ.4 కోట్లతో డిజిటల్ లైటింగ్, 3 డి స్క్రీన్, అధునాతన సౌండ్ సిస్టం, ప్రొజెక్టర్, భూగోళ పద్ధతిలో సీటింగ్ ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్టు అధికారులు తెలిపారు. అయితే హైదరాబాద్‌కు చెందిన కృష్ణ ఇంజనీర్స్ అండ్ ఫాబ్రికేటర్స్ అనే సంస్థ టెండరును దక్కించుకుని పనులు చేస్తున్నట్టు బల్దియా ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తయ్యాయని మరో నెల రోజుల్లో నక్షత్రశాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ తెలిపారు.

- మళ్లీ ఓరుగల్లు వాసులను అలరించనున్న ప్లానిటోరియం
- రూ.6 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పునరుద్ధరణ పనులు
- ఇప్పటికే 70 శాతం పూర్తి.. నెల రోజుల్లో అందుబాటులోకి

1982లోనే నక్షత్రశాల ఏర్పాటు

దేశంలోనే వరంగల్ నగరానికి ప్రత్యేక స్థానం ఉంది. 43సంవత్సరాల క్రితమే ఇక్కడ నక్షత్రశాల ఏర్పాటైంది. 1980లో దేశంలో 12నక్షత్రశాలలు ఉండగా.. అప్పుడే ఇక్కడి నాయకులు వరంగల్ నగర ప్రజలకు సూర్యకుంటుంబంపై విజ్ఞానం కోసం ప్లానిటోరియం కావాలని ప్రతిపాదనలు చేశారు. 1982లో రూ.1.20లక్షలతో ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం వెనుక అప్పటి అవసరాలకు తగినట్టుగా నిర్మించి.. 1984లో హిందూజా ప్రతాపరుద్ర ప్లానిటోరియం పేరిట పీవీ నర్సింహరావు చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. కొద్ది పాటి రుసుము స్వీకరించి రోజుకు రెండు ప్రదర్శనలు చేసేవారు. కాగా 1984 నుంచి 1987 వరకు నక్షత్రశాల డైరెక్టర్‌గా కె.ఆంటోనిరాజ్, 1987 నుంచి 2000 వరకు ఎం.భరత్‌కుమార్‌రెడ్డి, 2000 నుంచి 2002 వరకు కె. యుగేందర్‌రావు, 2002నుంచి 2004 వరకు కె. రవి కిరణ్‌రెడ్డి ఈ ప్లానిటోరియానికి డైరెక్టర్లుగా పని చేశారు. ఆ తర్వాత నక్షత్రశాలను ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోకపోవడం, నిర్వహణ లేక సామగ్రి, పరికరాలు తుప్పుపట్టి పోయాయి. భవనం శిథిలావస్థకు చేరింది. విలువైన వస్తువులు మట్టిలో కూరుకుపోయాయి. మళ్లీ ఇన్నాళ్లకు.. రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వానికి ఓకే చెప్పింది. స్మార్ట్‌సిటీ నిధులతో ప్లానిటోరియం పునరుద్ధరణకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు జరుగుతుండగా.. మరో నెల రోజుల్లో హైదరాబాద్‌కు దీటైన నక్షత్రశాల అలరించబోతోంది.

నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

రాగి శ్రీకాంత్, బల్దియా అసిస్టెంట్ ఇంజనీర్



వరంగల్ నగరంలో ప్లానిటోరియాన్ని పురుద్ధరిస్తున్నాం. రూ.6కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో మునుపెన్నడూ లేని విధంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నాం. ఇప్పటికే పనులు 70శాతం పూర్తయ్యాయి. మిగిలిన చిన్నపాటి పనులు, స్క్రీన్, ప్రొజెక్టర్, సీటింగ్ ఏర్పాటు చేసి నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. నక్షత్రశాల ఏర్పాటుతో వల్ల ఖగోళ రహస్యాలు, వింతలు, విశేషాలను తిలకించొచ్చు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో

బయోమెట్రిక్

- ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌కు వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం
- ఉద్యోగ సంఘాల నాయకుల్లో వణుకు
- ప్రజలు, ప్రజా సంఘాల హర్షం



వరంగల్ మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్యులు, వైద్య సిబ్బంది సరైన సమయానికి విధులకు హాజరయ్యేలా ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలను అమలు పర్చాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆర్‌సీ నెంబర్ 7711/ ప్లానింగ్ తేదీ 29/03/2005 ప్రకారం అన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆధార్ బేస్డ్ అటెండెన్స్ అమలు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై ఆధార్ బేస్డ్ అటెండెన్స్ ద్వారానే ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించనున్నట్లు అధికారులు తేల్చి చెబుతున్నారు.

వ్యతిరేకిస్తున్న కొందరు నేతలు

నూతన విధానాన్ని రద్దు చేయాలని కొందరు ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా లీడర్ల ముసుగులో చెలామణి అవుతూ ఏ ఒక్కరోజు కూడా వారు విధులకు హాజు కాకుండా ప్రైవేట్ పనులు చేసుకోవడం, పైరవీలు చేసుకోవడానికి సరిపోతున్నందున ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి రుచించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొందరైతే డ్యూటీలకు రాకుండా నెల నెలా జీతాలు తీసుకోవడానికి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

పేదలకు సకాలంలో వైద్య సేవలు

ఈ విధానం వల్ల పేదలకు సకాలంలో సరైన రీతిలో వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. విధానంపై ఖమ్మం జిల్లాలో ఇప్పటికై ప్రయోగాత్మక ప్రాజెక్టుగా చేపట్టారు. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని నిర్ణయించి చర్యలు చేపడుతున్నారు.

ప్రజలు, ప్రజా సంఘాల హర్షం

పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో విధులకు డుమ్మా కొట్టే వారికి చెక్ పడనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల్లో సమయపాలన పాటించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మాట.. చేటు.. వేటు..

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ కార్యదర్శులను నియోజకవర్గాల వారీగా బదిలీ చేయాలనే నిర్ణయం అధికారులు తీసుకున్నారు. బదిలీలకు సంబంధించి కార్యదర్శుల నుంచి ఇప్పటికే ఆప్షన్లు తీసుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అయితే ఉన్నట్టుండి తమను బదిలీ చేయాలన్న అధికారుల నిర్ణయం వెనుక కారణాలు ఏమిటో తెలియక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. అయితే బదిలీలకు తాము వ్యతిరేకులం కాదని, ఒక నియోజవకర్గం నుంచి మరో నియోజకవర్గానికి కాకుండా ఒక మండలం నుంచి మరో మండలానికి అది కూడా పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే బదిలీ చేపట్టాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఆకస్మిక బదిలీ వల్ల వీరంతా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఒకే చోట రెండేళ్ల కన్నా ఎక్కువకాలం పనిచేస్తున్న కార్యదర్శులనే బదిలీ చేసేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నా.. ఇందులో వాస్తవం లేదని, 8 నెలల కిందట బదిలీపై వచ్చిన వారిలో కొందరి కూడా స్థాన చలనం తప్పేట్టు కనిపించడం లేదంటున్నారు.

మా డబ్బుల సంగతి ?

ఆకస్మికంగా తమను బదిలీ చేస్తే పంచాయతీల నిర్వహణకు తమ జేబులోంచి సొంతంగా ఖర్చుపెట్టిన డబ్బు సంగతి ఏమిటని కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసినప్పటి నుంచి తమ సొంత డబ్బుతో పాటు అప్పులు తెచ్చి అత్యవసర, అభివృద్ధి పనులకు ఖర్చుచేశామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, కార్యాలయాల నిర్వహణ వంటి పనులకు తామే సొంతంగా రూ.2 లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు చేశామని, ఆ బిల్లులన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ముందు ఆ బిల్లులను క్లియర్ చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియను చేపట్టాలంటున్నారు.

నిబంధనలకు వ్యతిరేకం

నియోజకవర్గాలవారీగా కార్యదర్శుల బదిలీలు చట్టవిరుద్ధం. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం పంచాయతీ కార్యదర్శిని ఆయన సొంత గ్రామం మినహా



వరంగల్ కలెక్టర్ సత్యశారదకు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కేటాయించిన జిల్లా, జోన్‌లో ఎక్కడికైనా బదిలీ చేయవచ్చు. కానీ ఇందుకు భిన్నంగా మొదటిసారిగా నియోజకవర్గాల వారీగా బదిలీలు అనేది నిబంధనలకు విరుద్ధం. చట్టం, న్యాయపరంగా ఇది చెల్లదు. ఏ బదిలీ అయినా పరిపాలనా అవసరాలను బట్టి ఉంటుంది. కానీ ఉమ్మడి జిల్లాలో ఇందుకు విరుద్ధంగా నియోజకవర్గాలవారీగా కార్యదర్శులను స్థానచలనం కల్పించడం అనుమానాలకు తావిస్తోంది.

ఎంత మంది బదిలీ ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,680 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. బదిలీల కారణంగా వీరిలో సుమారు 600 నుంచి 750 మంది వరకు స్థాన చలనం కలగవచ్చునని తెలుస్తోంది. హనుమకొండ జిల్లాలో 100 మంది, వరంగల్ జిల్లాలో 200 మంది, జనగామ జిల్లాలో 150 మంది, మహబూబాబాద్ జిల్లాలో 200 మంది జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 100 మంది బదిలీ కానున్నట్టు తెలిసింది.

మౌఖిక ఆదేశాలతో బదిలీ అన్యాయం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విధి విధానాలు లేకుండా కొందరి ఒత్తిడితో ఒక నియోజకవర్గంలోని కార్యదర్శిని ఇతర నియోజకవర్గంలోనికి బదిలీ చేయాలని మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం. ఇది అన్యాయం. పతీ కార్యదర్శి గ్రామ పంచాయతీలో రూ.2 నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు పెట్టారు. వారు పెట్టిన ఖర్చుల బిల్లులను విడుదల చేశాక బదిలీలు చేపట్టాలి. అదీ కూడా పక్క మండలంలోకే బదిలీ చేయాలి.

- ఎలికట్టె శ్రీకాంత్ గౌడ్, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆందోళనలు.. వినతులు..

ఆకస్మిక బదిలీలను అడ్డుకునేందుకు కార్యదర్శులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా కలెక్టర్లును కలిసి వినతి పత్రాలను అందచేస్తున్నారు. సంబంధిత శాఖ మంత్రిని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని, ఎమ్మెల్యేలను సైతం కలిసి బదిలీ ప్రయత్నాలను నిలిపివేయాలని కోరుతున్నారు. సోమవారం కార్యదర్శులు అయిదు జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలను అందచేశారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చుక్కల ప్రవీణ్, మహబూబాబాద్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఒడ్డెబోయిన శ్రీనివాస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగవెల్లి రంజిత్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, హనుమకొండ జిల్లాలో టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో టీపీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకారపు సురేష్ జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి సంతోష్ తదితరులు, వరంగల్ జిల్లాలో వరంగల్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ ఆధ్వర్యంలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టీపీఎష్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్, జనగామ జిల్లాలో టీపీఎష్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కనకం విజయకుమార్ నేతృత్వంలో కలెక్టర్లను కలిసి వినతిపత్రాలను అందచేశారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రయత్నాలను నిలిపివేయాలని, పంచాయతీల్లో వివిధ పనులకు తాము సొంతంగా ఖర్చుపెట్టిన డబ్బును వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఆదివారం ధన్వాడలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి త్రం అందజేశారు.

మూల్యాంకన విధుల్లో

అవకతవకలు!

- నిబంధనలు బేఖాతరు చేస్తూ ఉత్తర్వులు
- విదేశాల్లో ఉన్న టీచర్‌కు డ్యూటీ
- మూడేళ్ల నిబంధన తుంగలోకి..
- సెకెండ్ లాంగ్వేజ్ ఉపాధ్యాయుడితో ఫస్ట్ లాంగ్వేజ్ వాల్యుయేషన్
- ప్రారంభమైన టెన్త్ స్పాట్ క్యాంపు.. 15 వరకు కొనసాగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకన విధుల్లో అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు ఉపాధ్యాయ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇష్టం వచ్చినట్లు విధులు కేటాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం నుంచి కాజీపేటలోని ఫాతిమా గర్ల్స్ ఎయిడెడ్ హైస్కూల్లో ప్రారంభమైన పదో తరగతి మూల్యాంకనం విధుల కేటాయింపులో అధికారుల చేసిన తప్పిదాలు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీనియారిటీని పక్కన బెట్టి జూనియర్లకు ఏఈ విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయురాలికి మూల్యాంకన విధులు కట్టబెట్టడం అధికారుల తీరుకు పరాకాష్టగా నిలుస్తోంది. సోమవారం ప్రారంభమైన టెన్త్ స్పాట్ క్యాంపు 15 వరకు నిర్విరామంగా కొనసాగనుంది. స్పాట్ కేంద్రంలో మొత్తం 2.27 లక్షల జవాబు పత్రాలను ముదింపు చేయనున్నారు.

నిబంధనలు బేఖాతరు

స్పాట్ విధుల కేటాయింపుల్లో అధికారులు అడ్డగోలుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. స్పాట్ నిబంధనల ప్రకారం విధులు కేటాయించాల్సి ఉండగా అందుకు భిన్నంగా విధుల కేటాయింపు జరిగినట్లు ఉపాధ్యాయ వర్గాలు విమర్శిస్తున్నాయి. పదోతరగతి జవాబు పత్రాలు ముదింపు చేయాలంటూ వరుసగా మూడేళ్ల పదోతరగతికి బోధించిన అనుభం ఉండాలి. అయితే ఈ నిబంధనను కాదని మూడేళ్ల బోధనానుభవం లేని ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో విధుల్లో ఉన్నవారికే మూల్యాంకన విధులు కేటాయించాల్సి ఉండగా సెలవుపై విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయురాలికి స్పాట్ డ్యూటీ కేటాయించారు. ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగును సెకండ్ లాంగ్వేజ్ బోధిస్తున్న ఉపాధ్యాయుడికి స్పాట్ విధులు కేటాయించారు. 8 కిలోమీటర్లలోపు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్పెషల్ అసిస్టెంట్లు ఇవ్వరాదనే నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధన పాటించకుండానే విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. పదేళ్లుగా పదో తరగతికి సబ్జెక్టులు బోధిస్తున్న సీనియర్లకు పార్ట్-3లో విధులు కేటాయించి జూనియర్ పంతుళ్లకు పేపర్లు ముదింపు విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. అలాగే దీర్ఘకాలికంగా పదో తరగతి సబ్జెక్టులు బోధిస్తున్న కొంత మంది సీనియర్ ఉపాధ్యాయులకు ఏఈ, సీఈలుగా విధులు అప్పగించాల్సిన అధికారులు.. కేవలం పార్ట్-3, కోడింగ్ విధులను కేటాయించి జూనియర్ ఉపాధ్యాయులను ఏఈ, సీఈలుగా నియవించారు.



అధికారుల తప్పిదాలు ఇవే...

- వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలంలోని ఉర్సు ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు) బోధిస్తున్న ఉపాధ్యాయుడికి ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు) పేపర్ మదింపు చేసే విధులు కట్టబెట్టారు.
- హనుమకొండ జిల్లా కేంద్రంలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు గత సంవత్సరం నవంబరు నెల నుంచి సెలవుపై విదేశాలకు వెళ్లారు. ఆమెకు మూల్యాంకన విధులు కేటాయించారు.
- నెక్కొండ మండలం అప్పల్‌రావ్‌పేట జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ తమ పాఠశాలలో 2022-23లో పదోతరగతి బ్యాచ్ లేనందున తమ పాఠశాల ఉపాధ్యాయులు మూడేళ్ల క్రమంగా పదో తరగతికి పాఠ్యాంశాలు బోధించలేదని డీఈవోకు లేఖ రాసినా ఆ పాఠశాలకు చెందిన కొంత మంది ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయించారు.
- వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మూడేళ్ల క్రమంగా బోధించని గణితోపాధ్యాయుడికి స్పాట్ డ్యూటీ కేటాయించారు.
- వరంగల్ జిల్లా వరంగల్ ఖిలావరంగల్ మండలంలోని చింతల్ ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో సెకెండ్ లాంగ్వేజ్(తెలుగు) బోధిస్తున్న ఉపాధ్యాయుడికి ఫస్ట్ లాంగ్వేజ్‌ను మూల్యాంకనం చేసేందుకు డ్యూటీ కేటాయించారు.
- 8 కిలోమీటర్లలోపు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు కేటాయించాల్సి ఉంది. అందుకు భిన్నంగా విధులు కేటాయించి వారికి రోజుకు రూ.25 చొప్పున స్పెషల్ అలవెన్సు చెల్లిస్తున్నారు.

కైటెక్స్‌లో 25 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్

గీసుగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేటహవేలి కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కులో 200 ఎకరాల్లో నిర్మించిన కైటెక్స్ కంపెనీలో 25 వేల ఉద్యోగాలకు ఆ కంపెనీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, స్టిచ్చింగ్, వీవింగ్ వంటి పలు విభాగాలలో పనిచేసేందుకు అర్హులైన వారిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నట్లు కంపెనీ యాజమాన్యం తెలిపింది. ప్రస్తుతం కంపెనీలోని పలు విభాగాలలో ట్రయల్ రన్ జరుగుతోందని యాజమాన్యం పేర్కొంది. కంపెనీ అధికారిక కైటెక్స్ గార్మెంట్స్ కామ్ సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరిచినట్లు కంపెనీ మేనేజన్ మనోజ్ తెలిపారు. కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రకటించిన నియమావళికి అనుగుణంగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ దశలలో ఎంపికలను చేయనున్నట్లు చెప్పారు.

వడ్లు తూర్పార..

చిన్న పంకాల ముందర..

గతంలో రైతులు వడ్లు తూర్పార పట్టేందుకు సహజంగా వచ్చే గాలిపై ఆధారపడేవారు. కానీ ఇప్పుడా పరిస్థితులు మారాయి. వ్యవసాయం యాంత్రీకరణ అయింది. ఈ క్రమంలోనే వడ్లు తూర్పార పట్టేందుకు ట్రాక్టర్ ఫ్యాన్లు, ఇతర యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే కొందరు చిన్నచిన్న రైతులు ఇప్పటికీ సహజసిద్ధమైన గాలికే తమ కొద్దిపాటి భూమిలో పండిన వడ్లను తూర్పార పడుతున్నారు. కొందరు ఇదిగో ఇలా టేబుల్, స్టాండ్ ఫ్యాన్లను పెట్టుకుంటు న్నారు. సోమవారం జనగామ జిల్లా పిరకెడు గ్రామ శివార్లలో ఓ రైతు కుటుంబం గ్రామశివారులో ఇలా చిన్న పంకాల సాయంతో వడ్లను తూర్పార పడుతూ కనిపించింది.



ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

యువతకు కోచ్ ఫ్యాక్టరీలో ఉపాధి కల్పించాలి

మడికొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన పలువురు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన వారి కుటుంబంలో ఒకరికి కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పించాలని అలాగే ఇంకా నష్టపరిహారం అందని వారికి పరిహారం అందేలా చూడాలని వినతి పత్రంలో ఎంపీని కోరినట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో దేవర శ్రీనివాస్, గాదం యాదగిరి, ఏసోబు, జేరిపోతుల శంకర్, ఇలాసాగరం సురేష్, ఉల్లెంగల శ్రీనివాస్, మామిండ్ల ప్రకాష్ తదితరులు ఉన్నారు.



ఎంపీ కావ్యకు వినతిపత్రం అందజేస్తున్న అయోధ్యపురం ప్రజలు

జోరుగా హనుమాన్ మాలధారణ



భక్తులకు మాలధారణ చేస్తున్న అర్చకుడు ఐనవోలు ప్రసాద్ శర్మ

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కిషన్‌పురలోని హనుమాన్ భజన మందిర్‌లో సోమవారం ఆంజనేయ మాలధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అయినవోలు మహాప్రసాద్‌శర్మ పలువురికి మాలధారణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మే 22న హనుమాన్ జయంతి సందర్భంగా ఏటా సుమారు 600 మంది హనుమాన్ మాలధారణ చేస్తారన్నారు. కొందరు 21 రోజులు, మరికొందరు 41 రోజులు దీక్ష తీసుకుంటారని తెలిపారు. అలాగే హనుమాన్ భజన మందిర్ ఆలయంలో 25 ఏళ్లుగా హనుమాన్ మాలధారణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు మొలుగూరి మహేష్, నిహాల్, భక్తులు కావేరి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్ పోస్టులకు కౌన్సెలింగ్ పూర్తి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లాలో ఖాళీగా ఉన్న 13 ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్) పోస్టులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 13 పోస్టులకు గాను 11 మంది హాజరైనట్లు హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. ఈడబ్ల్యూఎస్ సంబంధించి ఒక అభ్యర్థి హాజరు కాలేదని, అలాగే ఎంహెచ్ వికలాంగుల కోటాకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు లేనందున ఖాళీగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్యతో పాటు, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీలత, డాక్టర్ గౌతమ్ చౌహన్, కె.రాజేష్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్ ప్రాంతంలోని పెన్షనర్ల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతోపాటు హనుమకొండ నగర శాఖ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడారు. పెన్షనర్లందరికీ రావాల్సిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ నగరశాఖ ప్రధాన కార్యదర్శి కందుల సంజీవ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

హసన్‌పర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ద్వారా విడుదల చేసిన రూ.కోటి నిధులతో చింతగట్టు క్యాంపు వద్ద పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం పద్మశాలీల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు చేనేత రంగానికి నూతన జీవం పోస్తోందన్నారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కార్పొరేటర్ అరుణ కుమారి, కమలాపూర్ వ్యవసాయ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, పద్మశాలి సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలి

మడికొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్ శివారులోని డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డంపింగ్ యార్డు నిర్మూలన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మడికొండ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ పోలీస్ సిబ్బందితో ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి మాట్లాడుతూ.. డంప్ యార్డు నుంచి వెలువడుతున్న విష వాయువులతో కూడిన పొగ గ్రామాలను కమ్మేసి ప్రజలు శ్వాస కోశ, చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తీసేస్తాం.. అంటూ హామీలే తప్ప అమలుకు మాత్రం నోచుకోవడం లేదని విమర్శించారు. డంప్‌యార్డు ఎత్తివేయకుంటే రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, పల్లపు యాదగిరి, పల్లపు నర్సింగరావు, బుర్ర రాజ్‌కుమార్, తండ శంకర్, కట్ట వెంకట్రాంనర్సయ్య, ఆవాల నరోత్తంరెడ్డి, బరిగెల కృష్ణ, పల్లపు రాజ్‌కుమార్, బత్తిని కిరణ్, బోగి మహేందర్, గడ్డం అశోక్, అరూరి తిరుపతి, వెన్నమల్ల రమేష్, మాచర్ల శ్రీధర్, పొన్నం శివ, అబ్బసాయిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, బ్యాంకు కాలనీ, చైతన్యపురికాలనీ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లి చర్చి, బాలయ్య హోటల్ ఏరియా, రాఘవేంద్రనగర్, స్నేహనగర్, భవానినగర్, సూర్య ఆస్పత్రి ఏరియాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, గోపాలపూర్, బ్యాంకు కాలనీ, ఎల్ఐసీ కాలనీ, కనకదుర్గ కాలనీ, సుభాశ్ రోడ్డు ఏరియా, ఎన్జీవోస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సిగ్మా కళాశాల ఏరియాలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ సాంబరెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

• వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం రాత్రి నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులు, భద్రకాళి మాఢవీధుల నిర్మాణ పనుల పురోగతి, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ పనులు, ఇందిరమ్మ ఇండ్లు, బీహెచ్‌కే పనుల పురోగతిపై ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత పనులను వర్షాకాలంలో కంటే ముందే పూర్తి చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రకాళి మాఢవీధుల నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ పూల్ పునరుద్ధరణ పనులు వారంలో ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. నగరంలో రోడ్ల విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఇబ్బందులు ఉంటే తనకు తెలపాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీవాకడేతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

కాజీపేట: సమాజంలో ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాజీపేట 61వ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కైలాస అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

• వరంగల్ కార్పొరేషన్ : తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు బీఆర్ఎస్ నాయకులు దోచుకుతిన్నారని, బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ 5వ డివిజన్ చేపల మార్కెట్ సమీపంలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టే పెద్ద మోరీ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చేతుల మీదుగా కొబ్బరికాయలు కొట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో దశలవారిగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, మహిళా అధ్యక్షురాలు శ్రవంతి, సోషల్ మీడియా అధ్యక్షుడు సురేందర్, కాంగ్రెస్ నాయకులు శ్రవణ్, శ్రీకాంత్, సురేష్‌బాబు, సిరబోయిన సతీష్, మోహన్, రమేష్, బాబ్లూ, రాజేశ్వరి, అనిత, కరుణ, స్వప్నతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమ్మయ్యనగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

• వడ్డేపల్లి: గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌లో సోమవారం చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు పరిశీలించారు. 57వ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రెయిన్స్, మహిళా కమ్యూనిటీ హాల్, కేయూ వంద ఫీట్ల రోడ్డులో సెంట్రల్ లైటింగ్, రిటర్నింగ్ వాల్, కుడా కాలనీ బ్రిడ్జి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికల పనుల ప్రారంభం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిధుల మంజూరుకు కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్, కాంగ్రెస్ శ్రేణులు కూర వెంకట్, పల్లె రాహుల్‌రెడ్డి, మున్సిపల్ డీఈ సారంగం తదితరులు పాల్గొన్నారు.



సమ్మయ్యనగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఈదురు గాలులతో విద్యుత్‌కు అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలో సోమవారం రాత్రి ఈదురుగాలులు వీయడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. భారీ ఈదురుగాలులు వీచడంతో చెట్లు విరిగి పడ్డాయి. దీంతో రాత్రివేళల్లో విద్యుత్ లేక కాలనీలలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై చెత్తాచెదారంతో జనాలను కంపించి వేసింది. ఉరుములు, మెరుపులతో జనాలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

నేలమట్టమైన వరి పంట

సోమవారం రాత్రి భారీగా వీచిన ఈదురు గాలులకు మొక్కజొన్న చేలు, వరి పంట నేలమట్టమైంది. బలమైన గాలులు వీయడంతో ఏపుగా పెరిగిన మొక్కజొన్న కర్రలు విరిగినట్లు రైతులు తెలిపారు. వరి పంట పొట్టదశలో ఉండడంతో గాలులకు వడ్లు రాలి నష్టం చేకూరిందని రైతులు తెలిపారు. మామిడి తోటల్లో కాయలు నేల రాలినట్లు గ్రామాల రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేసిన తర్వాతనే రెగ్యులర్ నోటిఫికేషన్ వెలురించాలని రాష్ట్ర వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ పి. కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రతతో కూడిన 7పే స్కేల్‌ను అమలు చేయాలన్నారు. అలాగే బేసిక్ పే, హెచ్ఆర్ఏ అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన 21 జీవోని వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులు పోను మిగతా పోస్టులకు నోటిఫికేషన్ వెలువరించాలని కోరారు. ఏడేళ్లుగా తమకు వేతనాలు పెరగలేదని, వెంటనే 3శాతం వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు ఆశీర్వాదం, సాదు రాజేశ్, ఫిరోజ్ పాషా, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, ప్రణీత, నాగయ్య, చందూలాల్, సూర్యనారాయణ, సంగీత్ కుమార్, శ్రీధర్, ఉషాకిరణ్‌మహి, బెస్లీ ప్రియాంక, సాంబశివరావ పాల్గొన్నారు.

కేడీసీలో రక్తదాన శిబిరం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్, హెల్త్‌క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంయుక్త నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, హెల్త్‌క్లబ్ కన్వీనర్ డాక్టర్ పద్మ రోహిణి, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, డాక్టర్ బి.సీతారాములు, గణ్‌సింగ్, బి.సంధ్యారాణి, గంగిశెట్టి శ్రీనివాస్, కేర్‌టేకర్ డాక్టర్ ప్రసూన, మాలతీలత, రమేశ్, వేణు, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజి వాకడే
- ప్రజావాణిలో 120 దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా బల్దియా ప్రజావాణి ద్వారా ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. నగర ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్‌పై ప్రతీ ప్రజావాణిలో తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయని, అధికారులు సమస్యలపై శ్రద్ధ వహించాలని సూచించారు. రానున్న వేసవిలో మంచినీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్, పన్నుల వసూళ్లలో సిబ్బంది కృషిని ప్రశంసిస్తున్నామని కమిషనర్ పొగిడారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 120 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై.రామకృష్ణ, వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	32
హెల్త్, శానిటేషన్	03
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	17
టౌన్‌ప్లానింగ్	62
తాగునీటి సరఫరా	06
మొత్తం	120

ఫిర్యాదులు ఇలా..

• హనుమకొండ 62, 53 డివిజన్ల మధ్యలో స్మార్ట్‌సిటీ నిధులతో రాజాజీనగర్ నుంచి పెగడపెల్లి డబ్బాల వరకు పెద్ద మోరీ నిర్మాణ పనుల్లో అక్రమనిర్మాణాలు చేస్తున్నారని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ సోషల్ సర్వీస్, వెల్ఫేర్ సొసైటీ నాయకులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను కాపాడేందుకు మార్కింగ్ చేసిన నక్షా కాదని బల్దియా అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

• వరంగల్ 40వ డివిజన్ ఉర్సు దర్గా ప్రాంతంలో తన పట్టా స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా చొరబడి అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నాడని, గతంలో ఇతడిపై 18 సార్లు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మూసిమెట్ల నరేష్, సంధ్యలు కమిషనర్‌ను కలిసి విన్నవించారు. కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో కొందరు అధికారులు అక్రమార్కుడికి సహాయం చేస్తున్నారని ఆరోపించారు.

• వరంగల్ ఏనుమాముల ఎంహెచ్‌నగర్‌లో ఉంటున్న తనకు ఇంటిపన్ను ఎక్కువగావస్తోందని వడ్డేపల్లి భాస్కర్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రమందించాడు.తనకున్యాయంచేయాలని విన్నవించాడు.

• 31వ డివిజన్ న్యూశాయంపేట నుంచి భట్టుపెల్లికి వెళ్లే మార్గం రోడ్డు రైల్వేట్రాక్ మీదుగా చాలా అధ్వానంగా ఉందని, సరైన రోడ్డు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు కమిషనర్‌ను కలిశారు. రైల్వే ట్రాక్ మీదుగా కొత్త రోడ్డు నిర్మాణం చేయాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే లోకల్ కోర్టులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే జిల్లా వ్యాప్తంగా లోకల్ కోర్టులు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ కమిషన్ చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. మండలంలోని నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏడీఈ పి.అశోక్ అధ్యక్షతన జరిగిన లోకల్ కోర్టుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు తమకున్న సమస్యల్ని, అధికారులు ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా వినియోగదారుల ఫోరంలో చెప్పుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామస్తులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. ఈ

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు, టెక్నికల్ మెంబర్ కె.రమేష్, ఫైనాన్స్ మెంబర్ రౌతు చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ ఎం.రామారావు, హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, హసన్‌పర్తి ఏఈ శిరీష, చింతగట్టు రూరల్ ఏఈ తరుణ్‌కుమార్, చింతగట్టు టౌన్ ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా జేఏసీ సేవలు అభినందనీయం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బల్దియా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేస్తున్న బల్దియా జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) సేవలు ప్రశంసనీయమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా కౌన్సిల్ హాల్‌లో జాక్ రూపొందించిన 2025 డైరీ, క్యాలెండర్‌ను మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాక్ గౌరవ అధ్యక్షుడు వేల్పుల ధర్మరాజ్ యాదవ్, అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్‌వర్మ, కోశాధికారి స్వర్ణన్‌రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, నాయకులు బాలునాయక్, ఆనంద్ పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులను త్వరగా పూర్తిచేయండి

- కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగుతున్న స్మార్ట్‌సిటీ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కేంద్ర గృహనిర్మాణ శాఖ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఢిల్లీ కార్యాలయం నుంచి దేశంలోని పలు మున్సిపాలిటీల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల వారిగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నగరంలో ఎన్ని పనులు జరుగుతున్నాయి? ఎన్ని పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నగరంలో స్మార్ట్‌సిటీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, స్మార్ట్‌సిటీ అధికారులు భాస్కర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పేరిణి నాట్య కళాకారులకు గజ్జె పూజ

మడికొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని సీతారామచంద్రస్వామి మెట్టురామలింగేశ్వరస్వామి క్షేత్రంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగం గా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో శేషభారతి, రామాలయం చైర్మన్ పల్లపు అర్జున్ ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి వారికి హోమం, బలిహరణ, వసంతోత్సవం, అభిషేకం నిర్వహించారు. ప్రముఖ పేరిణి నాట్యాచార్యులు గజ్జెల నవ్యజ, రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నాట్య కళాకారులకు గజ్జె పూజ నిర్వహించారు. శివాలయంలో రుద్రాభిషేకం అనంతరం శాస్త్రోక్తంగా చిన్నారుల పాదాలకు గజ్జెలను అలంకరించి ఆలయ మండపంలో మొదటి ప్రదర్శనను ప్రదర్శించారు. కార్యక్రమంలో గురుదేవ్, సంతోష్, వైష్ణవి, తేజస్విని, బరాడి విజయ్, శ్రాగ్విని, మోక్ష, సాయినక్షత్ర,వేదాంషివర్మ, నక్షత్ర పాల్గొన్నారు.

మల్లికాంబ మనోవికాస కేంద్రంలో వైద్య శిబిరం


హనుమకొండ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జున రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ విజయ్‌చందర్‌రెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించి 200 మంది చిన్నారుల కు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కేంద్రం సంస్థ నిర్వాహకులు బండ రామలీల, కల్యాణ్, వైద్యులు పాల్గొన్నారు.

కంటి సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

హసన్‌పర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకునే పిల్లల కంటి సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల సురక్ష బృందాల ద్వారా సోమవారం గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరేళ్లలోపు పిల్లలకు ముందస్తుగా కంటి పరీక్షలు నిర్వహించడం వల్ల చిన్నతనంలోనే సమస్యలు గుర్తించి తగిన చికిత్స అందించడంతో చూపు మందగించడాన్ని అరికట్టవచ్చన్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు కూడా అందిస్తామన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ జిల్లాలో మూడు ప్రాజెక్టుల్లో ఉన్నమొత్తం 788 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, మండల వైద్యాధికారి భార్గవరామ్, ఆర్బీఎస్‌కే డాక్టర్లు డాక్టర్ కుమారస్వామి, దుర్గాప్రసాద్, దివ్య, సురేష్, ఆప్తాల్మిక్ అధికారులు మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



క్యాన్సర్ కేర్



ఇమ్యునోథెరపీతో కాలేయ క్యాన్సర్ ఖతం

కాలేయంతో తిష్ఠ వేసి, సంప్రదాయ చికిత్సలకు లొంగని క్యాన్సర్‌కు ముకుతాడు వేసే ఇమ్యునోథెరపీ చికిత్స అందుబాటులోకొచ్చింది. కణితిని కృశించేలా చేయడంతో పాటు, సర్జరీ, కీమోథెరపీ చికిత్సలకు తగ్గట్టు వ్యాధి తీవ్రతను తగ్గించే ఈ చికిత్సతో సత్ఫలితాన్ని సాధించవచ్చంటున్నారు వైద్యులు.

సాధారణంగా కాలేయ క్యాన్సర్లలో రెండు రకాలుంటాయి. ఒక రకం క్యాన్సర్ శరీరంలోని ఇతరత్రా అవయవాల నుంచి కాలేయానికి సోకుతూ ఉంటుంది. ఇంకొక రకం క్యాన్సర్, కాలేయంలోనే పుడుతూ ఉంటుంది. పొట్ట, పెద్ద పేగులు... ఇలా జీర్ణ వ్యవస్థ నుంచి కాలేయానికి పాకే క్యాన్సర్లను, 'హెపటో సెల్యులర్ కార్సినోమా' (హెచ్‌సియు) అంటారు. సాధారణంగా శరీరంలో పుట్టుకొచ్చే రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ల లాంటి ఇతర క్యాన్సర్లు కాలక్రమేణా తగ్గిపోతూ ఉంటే, కాలేయ క్యాన్సర్ ఒక్కటే అంతకంతకూ పెరిగిపోతూ ఉంది. పైగా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌సియు ఆరవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా, ప్రపంచవ్యాప్తంగా మరణానికి కారణమయ్యే మూడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా గుర్తింపు పొందింది. కాలేయ క్యాన్సర్ అత్యంత ప్రాణాంతకమైన క్యాన్సర్‌గా పరిణమించడానికి కారణం, అప్పటికే సిర్రోసిస్‌తో దెబ్బతిన్న కాలేయంలో క్యాన్సర్ గడ్డ పెరగడమే! సాధారణంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ లేదా థైరాయిడ్ క్యాన్సర్లు ఆయా అవయవాలకు సోకిన సందర్భాల్లో, ఆయా అవయవాలు అప్పటివరకూ ఆరోగ్యంగానే ఉంటాయి. కాబట్టి ఆ క్యాన్సర్‌లను నయం చేయడం సులభతరం అవుతూ ఉంటుంది. కానీ హెపటో సెల్యులర్ కార్సినోమాలో, సిర్రోసిస్‌తో ముందు నుంచే దెబ్బతిన్న కాలేయానికి క్యాన్సర్ సోకుతుంది. కాబట్టి ఈ క్యాన్సర్ చికిత్స క్లిష్టమవుతుంది.

కారణాలు అనేకం

గతంలో మన దేశంలో, కాలేయ క్యాన్సర్‌కు హెపటైటిస్ బి, సి వైరస్‌లు ప్రధాన కారకాలుగా ఉండేవి. దీంతో సిర్రోసిస్‌కు గురైన కాలేయంలో క్యాన్సర్ కణుతులు పెరుగుతూ ఉండేవి. కానీ ప్రస్తుతం కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం మూలంగా కాలేయ క్యాన్సర్ సోకే సందర్భాలు పెరిగిపోతున్నాయి. అలాగే టైప్2 మధుమేహం, ఊబకాయాలు కూడా కాలేయ కొవ్వుకు తోడ్పడి, కాలేయ సిర్రోసిస్‌కూ, అంతిమంగా కాలేయ క్యాన్సర్‌కూ దారి తీస్తున్నాయి. కాలేయ కొవ్వు సమస్య ఉన్నప్పుడు కాలేయం సిర్రోసిస్ దశకు చేరుకునేలోపే క్యాన్సర్ కణుతులు ఏర్పడే ప్రమాదం 30 శాతం మేరకు ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వారు అప్రమత్తంగా ఉంటూ, క్రమం తప్పకుండా అల్ట్రాసౌండ్, సిటి స్కాన్, ట్యూమర్ మార్కర్ పరీక్షలు చేయించుకుంటూ, పరిస్థితి అనుమానాస్పదంగా కనిపించినప్పుడు ఎమ్మారై చేయించుకుని చికిత్సలను ఆశ్రయించాలి.

పలు రకాల చికిత్సలతో...

కాలేయ క్యాన్సర్‌కు వైద్యులు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తూ ఉంటారు. కణితితో పాటు దాని చుట్టూరా ఉన్న కణజాలాన్ని తొలగించడం లేదా కాలేయ మార్పిడి చేపట్టడం... ఈ రెండు చికిత్సలనే వైద్యులు ఆశ్రయిస్తూ ఉంటారు. ఒకవేళ కణితిని తొలగించే పరిస్థితి లేనప్పుడు, కణితిని కాల్చేసే మైక్రోవేవ్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చికిత్సలను అనుసరిస్తారు. అలాగే క్రయోథెరపీ ద్వారా కణితిని ఘనీభవించేలా చేయడం లేదా కణితిని చంపేలా దానితో అనుసంధానమై ఉన్న రక్తనాళం ద్వారా నేరుగా కణితికి ఔషధాన్ని సరఫరా చేసే చికిత్సను కూడా వైద్యులు ఎంచుకుంటారు. కొన్ని సందర్భాల్లో రేడియేషన్ పైపూత కలిగిన బీడ్స్‌ను కణితికి రక్తసరఫరా చేసే రక్తనాళంలో ప్రవేశపెడతారు. మునుపు, బయటి నుంచి అందించే రేడియేషన్ వల్ల, సిర్రోసిస్ బారిన పడి ముందునుంచే దెబ్బతిన్న కాలేయం మరింత దెబ్బతినే పరిస్థితి తలెత్తుతూ ఉండేది. కానీ ఈ నష్టాన్ని నివారించడం కోసం అత్యాధునిక చికిత్సా విధానం అమల్లోకొచ్చింది. అదే.. 'ఎమ్ఆర్ లినాక్!

సమర్థమైన ఇమ్యునోథెరపీ

ఎమ్ఆర్ లినాక్ చికిత్సలో రేడియేషన్ సూటిగా క్యాన్సర్ కణితికే తప్ప, దాని చుట్టూరా ఉన్న కణజాలానికి సోకదు. దాంతో రేడియేషన్ సహాయంతో క్యాన్సర్ కణితిని సమర్థంగా కాల్చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ కాలేయంలో ఒకటి కంటే ఎక్కువ కణుతులు ఉన్నప్పుడు, ఇలాంటి రేడియేషన్‌తో ఒకొక్క కణితినీ కాల్చుకుంటూ వెళ్లడం వీలుపడదు. ఇలాంటి సందర్భాల్లో వైద్యులు సిస్టమిక్ థెరపీని ఎంచుకుంటారు. సాధారణంగా పలు రకాల క్యాన్సర్ల చికిత్సల్లో మొదట సర్జరీ, ఆ తర్వాత కీమో ఇవ్వడం జరుగుతుంది. కానీ కాలేయ కణుతులు కీమోథెరపీకి పెద్దగా స్పందించవు. కాబట్టి ఈ తరహా కాలేయ క్యాన్సర్‌కు అందించే కీమోథెరపీ, నోటి మాత్రలతో కొనసాగుతుంది. అలాగే సమర్థమైన ఇమ్యునోథెరపీ కూడా సత్ఫలితాన్ని అందిస్తుంది. ఈ థెరపీలో శరీరానికి అందించే ఏజెంట్స్ వ్యాధినిరోధక వ్యవస్థను చైతన్యం చేస్తాయి. శరీరంలో కణితికి సంబంధించిన కణాలు ప్రయాణిస్తూ ఉన్నప్పుడు, నిఘా కణాలు ఈ అసాధారణ కణాలను కనిపెట్టి, అవి తిష్ఠవేసిన అవయవం దగ్గరకు చేరుకుని వాటిని అంతమొందిస్తూ ఉంటాయి. కానీ కొందర్లో ఈ నిఘా కణాలు చురుకుదనాన్ని కోల్పోతాయి. ఇలాంటి సందర్భాల్లోనే కణుతులు ఏర్పడతాయి. ఇమ్యునోథెరపీ చికిత్సతో వ్యాధినిరోధక వ్యవస్థను కుదుపుకు గురి చేసి, చురుకుదనాన్ని కోల్పోయిన కణాలను చైతన్యపరచడం జరుగుతుంది. అయితే ఇమ్యునోథెరపీలో రెండు రకాల ఔషధాలను అందిస్తారు. ఒకటి వ్యాధినిరోధక కణాల సంఖ్యను పెంచితే, ఇంకొకటి కణితి చుట్టూరా కొత్త రక్తనాళాలు పెరగకుండా నివారిస్తుంది.

మునుపు కాలేయ క్యాన్సర్ చివరి దశకు చేరుకున్న వారికి, జీవించే అవకాశాలు ఎంతో పరిమితంగా ఉండేవి. వీరి జీవితకాలం కొన్ని నెలలకే పరిమితమై ఉండేది. తాజా ఇమ్యునోథెరపీతో ఈ సమయాన్ని కొన్నేళ్లకు పెంచే వీలు కలుగుతోంది. మరీముఖ్యంగా హైబ్రిడ్ చికిత్సా విధానంతో ఐదేళ్ల వరకూ ఆయుష్షును పెంచుకునే వెసులుబాటు కలుగుతోంది. మునుపు ఈ దశకు చేరుకున్న రోగులకు సర్జరీ, కాలేయ మార్పిడిలను ఆశ్రయించే పరిస్థితి ఉండేది కాదు. కానీ తాజా ఇమ్యునోథెరపీతో కాలేయ మార్పిడికి వీలుగా, కాలేయంలోని కణుతుల సంఖ్యను తగ్గించే సౌలభ్యం దక్కుతోంది.

నివారణ ఇలా...



సిర్రోసిస్‌ను నియంత్రించగలిగితే హెపటో సెల్యులర్ కార్సినోమా అనే కాలేయ క్యాన్సర్‌ను నివరించుకోవచ్చు. కాబట్టి ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలైన హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, స్థూలకాయం, మధుమేహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. హెపటైటిస్ బి వ్యాక్సిన్లు తీసుకోవాలి. మధుమేహాన్ని సకాలంలో గుర్తించి చికిత్స మొదలుపెట్టాలి. మధుమేహం అదుపు తప్పకుండా చూసుకోవడంతో పటు సమతులాహారంతో బరువును అదుపులో పెట్టుకోవాలి. అలాగే కాలేయాన్ని దెబ్బతీసే మద్యపానం లాంటి దురలవాట్లను మానుకోవాలి.

ఈ లక్షణాల మీద కన్నేసి...

- పైపొట్ట నిండుగా ఉన్నట్టు అనిపించడం
- పక్కటెముకల అడుగున ముడి ఏర్పడినట్టు అసౌకర్యం కలుగుతూ ఉండడం
- కామెర్లు
- పొట్ట వాపు, పొట్టలో నీరు
- ఆకలి మందగించడం
- బరువు తగ్గడం
- వాంతులు, తలతిరుగుడు



డాక్టర్ ధర్మేష్ కపూర్
సీనియర్ హెపటాలజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.

పారాహుషార్

బబుల్‌గమ్‌లో ప్లాస్టిక్



నోట్లో ఒక బబుల్‌గమ్ వడేసి, అదే పనిగా నములుతూ కాలక్షేపం చేసేవాళ్లుంటారు. దీంతో నోట్లో లాలాజలం పెరిగి, దంతాలు శుభ్రపడతాయని నమ్మేవాళ్లూ ఉన్నారు. అయితే బబుల్‌గమ్‌లో హానికారక ప్లాస్టిక్ అణువులు దాగి ఉంటాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

క్వీన్స్ యూనివర్శిటీ బెల్‌ఫాస్ట్‌లో చేపట్టిన ఒక అధ్యయనంలో బబుల్‌గమ్‌లో హానికారక పదార్థాలు దాగి ఉన్నాయనే విషయం వెల్లడైంది. జోర్నల్ ఆఫ్ హజార్డస్ మెటీరియల్స్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, ఒక గంట పాటు చూయింగ్ గమ్‌ను నమిలిన వ్యక్తి లాలాజలంలో రెండున్నర లక్షల మైక్రోప్లాస్టిక్స్‌ను కనిపెట్టగలిగినట్టు పరిశోధకులు పేర్కొన్నారు. ఈ పరిశోధకులు, ఆటోమేటెడ్ రామన్ స్పెక్ట్రోస్కోపీ అనే పద్ధతి ద్వారా చూయింగ్గమ్‌ను నమలడం వల్ల మన లాలాజలంలోకి ఎన్ని ప్లాస్టిక్ అణువులు ప్రవేశిస్తాయన్నది అంచనా వేశారు. ఇలా సూక్ష్మ రూపాల్లో మన శరీరంలోకి చేరుకునే మైక్రో, నానో ప్లాస్టిక్ అణువులు, మన జీర్ణ వ్యవస్థ, ఊపిరితిత్తులు, పునరుత్పత్తి వ్యవస్థలను దెబ్బతీస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిశోధనా బృందంతో కలిసి పనిచేసిన క్వీన్స్ యూనివర్శిటీ మరొక పరిశోధకుడు, ఉదిత్ పంత్, చూయింగ్‌గమ్‌లో ఉన్న మైక్రోప్లాస్టిక్స్ గురించి వివరిస్తూ, చూయింగ్‌గమ్‌ను నమలడం మొదలుపెట్టిన మొదటి 20నిమిషాలు, 20 నుంచి 40 నిమిషాలు, 40 నుంచి 60 నిమిషాల వ్యవధుల్లోని వేర్వేరు లాలాజలాలను పరిశీలించినప్పుడు, ఆ మూడు నమూనాల్లో మైక్రో, నానో ప్లాస్టిక్స్ కనిపించాయి. మానవ శరీరం మీద ఈ కణాల దీర్ఘకాలిక ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్నది కచ్చితంగా తెలియదు కాబట్టి సాధ్యమైనంత వరకూ ఈ ప్లాస్టిక్స్ కలిగి ఉండే చూయింగ్గమ్‌లకు దూరంగా ఉండడమే మేలని పంత్, హెచ్చరిస్తున్నారు.

మూత్రం నలుపు రంగులో ఉందా?

కొన్ని రుగ్మతలు చిత్రమైన లక్షణాల ద్వారా బయల్పడుతూ ఉంటాయి. అల్కాప్టోనూరియా ఈ కోవకు చెందినదే! హోమోజెన్టిసేట్ అనే ఎంజైమ్ లోపంతో తలెత్తే ఈ రుగ్మత 'నల్లని మూత్రం'తో బయల్పడుతూ ఉంటుంది. మరిన్ని విషయాలు తెలుసుకుందాం!

అల్కాప్టోనూరియా, అత్యంత అరుదైన జన్యు సమస్య. ఇది అంతిమంగా కీళ్ల జబ్బులు, మూత్రపిండాల్లో రాళ్ల సమస్యకు దారి తీస్తుంది. శరీరంలోని హోమోజెన్టిసిక్ ఆమ్లం విచ్ఛిన్నానికి హోమోజెన్టిసేట్ అనే ఈ ఎంజైమ్ అవసరం. ఈ ఎంజైమ్ లోపించినప్పుడు, హోమోజెన్టిసిక్ ఆమ్లం శరీరంలో పెరిగిపోయి, మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. మూత్రం గాలికి బహిర్గతమైనప్పుడు దాన్లోని ఆమ్లం గాలితో ప్రతిచర్య జరిపి, మూత్రం నలుపు రంగులోకి మారిపోతుంది. అల్కాప్టోనూరియాలో కనిపించే ప్రధాన లక్షణమిది. ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో ఈ పరిస్థితి కణజాలం దెబ్బతినే ఓక్రోనోసిస్ అనే సమస్యకు దారి తీస్తుంది.



వ్యాధి నిర్ధారణ

దీర్ఘకాల సమస్యలు

- **కీళ్ల క్షీణత:** మృదులాస్థిలో పేరుకునే హోమోజిన్టిసిక్ ఆమ్ల నిల్వల మూలంగా కీళ్లు పెళుసుగా మారి, సులభంగా విరిగిపోతాయి. 30 నుంచి 40 ఏళ్ల లోపే ప్రత్యేకించి వెన్ను, తుంటి, మోకీళ్లు తీవ్ర ఆర్థ్రయిటిస్‌కు లోనవుతాయి.
- **మూత్రపిండాల్లో, ప్రోస్టేట్‌లో రాళ్లు:** మూత్రపిండాల్లో, ప్రోస్టేట్‌లో స్ఫటికాల్లా ఏర్పడే హోహోజినిస్టిక్ ఆమ్లం అంతిమంగా రాళ్ల రూపాన్ని సంతరించుకుంటుంది.
- **మంగు:** చర్మం పైన, కనుగుడ్లలోని తెల్లని భాగాల్లో మంగు మచ్చలు ఏర్పడతాయి.

నిర్ధారణ

ప్రస్తుతం ఈ రుగ్మతను సమర్థంగా సరిదిద్దే చికిత్సలు అందుబాటులో లేకపోయినా, లక్షణాలను నియంత్రించడం ద్వారా రోగుల జీవననాణ్యతను మెరుగుపరుచుకునే వీలుంది. నొప్పి నుంచి ఉపశమనం, కీళ్ల పనితీరును మెరుగ్గా ఉంచుకోవడం, మూత్రపిండాలు, ప్రోస్టేట్ పనితీరులను ఓ కంట కనిపెడుతూ ఉండడం ప్రధానమని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన

పసికందులు సురక్షితంగా..

పసికందులకు సుతిమెత్తని దుస్తులు ఎంచుకుంటాం. నాణ్యమైన సబ్బులు, పౌడర్లను వాడుకుంటాం. అయితే వాటిలో దాగి ఉండే హానికారక రసాయనాలను మనం నిర్లక్ష్యం చేస్తున్నామా? పసిపిల్లల ఉత్పత్తుల్లో దాగి ఉండే హానికారకాలు, సురక్షితమైన ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

అత్యధికంగా రసాయనాలకు బహిర్గతమైనవీ, పిల్లల చర్మానికి ఎక్కువ సమయం పాటు తగులుతూ ఉండేవే అత్యంత విషపూరితమైన పసిపిల్లల ఉత్పత్తులని వైద్యులు అంటున్నారు. పసిపిల్లల దుస్తుల తయారీలో ఉపయోగించే ఫార్మాల్డిహైడ్, విషపూరిత రంగులు పిల్లలకు అలర్జీలు, చర్మ సమస్యలను తెచ్చి పెడతాయి. అత్యంత తరచుగా ఉపయోగించే ప్లాస్టిక్ పాల సీసాలు, బొమ్మలు, డయాపర్లు, పౌడర్లు, లోషన్లు, షాంపూల్లో కూడా అత్యధిక విష మోతాదులు ఉంటున్నట్టు వైద్యులు అంటున్నారు. ఇలాంటి విషపూరిత రసాయనాలకు బహిర్గతమయ్యే పిల్లల్లో ఎదుగుదల లోపాలు, శ్వాసకోశ సమస్యలు, నాడీసంబంధ రుగ్మతలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడుకోవాలంటే, విష రహిత, బిస్ఫినాల్ రహిత, సేంద్రీయ ఉత్పత్తులను ఎంచుకోవాలి. తరచూ ఉపయోగించే బొమ్మలు, గిన్నెలు, స్పూన్లు లాంటి వాటిని తరచూ శుభ్రంగా కడుగుతూ ఉండాలి. అలాగే పాలు పట్టడం కోసం ప్లాస్టిక్ బదులుగా స్టీలు, లేదా గాజు సీసాలను ఎంచుకోవాలి. అలాగే ఘాటు వాసన కలిగి ఉండే సబ్బులు, షాంపూల వాడకం మానేయాలి. అలాగే ఈ జాగ్రత్తలు పాటించాలి.



- **లేబుల్స్:** ఉత్పత్తుల లేబుళ్ల మీద పారాబెన్ ఫ్రీ, సల్ఫేట్ ఫ్రీ, బిపిఎ ఫ్రీ అని రాసి ఉన్న వాటినే ఎంచుకోవాలి
- **ధృవీకరించినవి:** సేంద్రీయ లేదా విష రహిత ధృవీకరణల కోసం వెతకాలి
- **సహజసిద్ధమైనవి:** వృక్షాధారిత లోషన్లు, చెక్క బొమ్మలు ఎంచుకోవాలి
- **సువాసన లేనివి:** సబ్బులు, షాంపూలు సువాసన లేనివాటిని ఎంచుకోవాలి
- **కొత్తవి:** కొత్త దుస్తులు, బొమ్మలను కొన్న వెంటనే శుభ్రంగా కడగాలి
- **రీయూజబుల్:** వస్త్రంతో తయారైన డయాపర్లు, వైప్స్ వాడుకోవాలి

లైంగికారోగ్యం

ఆ ఆసక్తి కొరవడిందా?

మహిళల్లో లైంగికాసక్తి లోపం అత్యంత సహజం. జీవితంలోని వేర్వేరు దశల్లో, వేర్వేరు ఆరోగ్య కారణాలతో ఈ పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. అలాంటప్పుడు మానసికంగా కుంగిపోకుండా మూల కారణాన్ని సరిదిద్దుకోవడంతో పాటు, లైంగికాసక్తిని పెంచే మందులు వాడుకోవాలంటున్నారు వైద్యులు.

లైంగికాసక్తి లోపం ఏ వయసులోనైనా తలెత్తవచ్చు. లైంగిక కోరికలు తగ్గినప్పుడు, అందుకు కారణాలను వెతికి వాటిని సరిదిద్దుకోవడం మీద దృష్టి పెట్టాలే తప్ప, పరిస్థితితో సర్దుకుపోయే ప్రయత్నం చేయడం సరి కాదు. ఈ ఆసక్తి లోపించడానికి ప్రధాన కారణాలు ఏవంటే...

- **స్క్రీన్ టైమ్:** పక్క గదిలో ఉన్న భర్తతో వాట్సాప్ మెసేజీలతో సంభాషించే భార్యలున్నారు. లేదంటే ఒకే పడక మీద వేర్వేరు ఫోన్లలో మునిగిపోయే దంపతులూ ఉన్నారు. దంపతులిద్దరూ కలిసి తినడం, కలిసి బయటకు వెళ్లడం, కలిసి సినిమా చూడడం లాంటివన్నీ తగ్గిపోయి, ఎవరి ఫోన్లలో వాళ్లు మునిగిపోయే పరిస్థితి పెరుగుతోంది. సామాజిక మాధ్యమాలు, ఓటిటిలు, ఫోన్ కాల్స్... వీటితో అన్యోన్యంగా గడపవలసిన సమయాన్ని స్క్రీన్స్‌తో వృథా చేసుకునే ధోరణి ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. ఈ ధోరణితో లైంగికాసక్తి కుంటుపడడం అత్యంత సహజం.
- **ఆరోగ్య కారణాలు:** మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు లైంగికాసక్తి మీద ప్రభావాన్ని కనబరచడంతో పాటు, లైంగికాసక్తి లోపాన్ని పెంచుతూ ఉంటాయి. అలాగే ఈ సమస్యలకు వాడుకునే మందుల దుష్ప్రభావాల వల్ల కూడా లైంగికాసక్తి తగ్గుతుంది.
- **మానసిక కారణాలు:** మానసిక కుంగుబాటు, ఒత్తిడి, ఆందోళనలు కూడా లైంగికాసక్తిని కుంటుపరుస్తాయి. వీటిని అధిగమించేవరకూ సెక్స్ పట్ల ఆసక్తి పెరగకపోవచ్చు. అలాగే తమ శరీరంలో లేని లోపాలను ఊహించుకుని కుంగిపోయే మహిళలు ఉంటారు. లైంగికాసక్తి లోపానికి ఈ లక్షణం కూడా ఒక కారణమే!
- **హార్మోన్లలో హెచ్చుతగ్గులు:** గర్భిణిగా ఉన్నప్పుడు, పిల్లలకు పాలిచ్చేటప్పుడు, మెనోపాజ్‌కు చేరుకున్నప్పుడు.. ఇలా మహిళలు వారి జీవితంలో పలు దశల్లో హార్మోన్ల అవతకవకలకు లోనవుతూ, ఆయా సందర్భాల్లో లైంగికాసక్తిని కోల్పోతూ ఉంటారు. కొత్త తల్లులు పిల్లలకు పాలిచ్చినంత కాలం, లైంగికాసక్తి తగ్గిపోతుంది. ఇది అత్యంత సహజం. కొంత మంది ఆడపిల్లలకు పిసిఓడి ఉంటుంది. ఈ చికిత్సలో తీసుకునే హార్మోన్ మాత్రల వల్ల కోరికలు తగ్గిపోతాయి.

> పెరి మెనోపాజ్, మెనోపాజ్ దశలకు చేరుకున్న మహిళల్లో, హార్మోన్ల హెచ్చుతగ్గులకు శరీరం అలవాటుపడడానికి కనీసం రెండేళ్లు పడుతుంది. ఆ సమయంలో హార్మన్ల హెచ్చుతగ్గుల వల్ల లైంగికాసక్తి కొరవడుతుంది.

మందులున్నాయి

లైంగికాసక్తి లోపానికి మూల కారణాలను కనిపెట్టి, వాటిని సరిదిద్దుకోగలిగితే సమస్య పరిష్కారమవుతుంది. అధిక బరువు తగ్గి, థైరాయిడ్, పిసిఒడి, అధిక రక్తపోటు సమస్యలను అదుపు చేసుకోగలిగితే, ఆ సమస్యలకు వాడే మందుల మోతాదును తగ్గించుకోవచ్చు. తద్వారా కోల్పోయిన లైంగికాసక్తిని తిరిగి పొందవచ్చు. అయినప్పటికీ లైంగికాసక్తి పెరగనప్పుడు, ఆ ఆసక్తిని పెంచే అదనపు మందులు కూడా అవసరమవుతాయి. ఇప్పుడు తాజాగా మూడు రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

మెనోపాజ్‌లో...

మెనోపాజ్‌కు చేరుకోగానే అక్కడితో లైంగిక జీవితం ముగిసిపోయిందని కుంగిపోయే మహిళలే ఎక్కువ మంది ఉంటారు. కానీ నిజానికి లైంగిక జీవితానికి సంబంధించిన రెండో దశ, నడి వయసులోనే మొదలవుతుంది. ఈ దశలో గర్భం దాల్చే భయం ఉండదు, పిల్లలను పెంచే బాధ్యతలు ఉండవు. తీరుబడిగా ఇళ్లలో కాలక్షేపం చేసే ఆ దశను అనవసరపు కుంగుబాటుతో వృథా చేసుకోకూడదు. వయసైపోయిందని బాధపడుతూ లైంగిక క్రీడకు దూరంగా ఉండిపోకూడదు. మరీ ముఖ్యంగా పెరి మెనోపాజ్, మెనోపాజ్ దశలకు చేరుకున్న మహిళల్లో, హార్మోన్ల హెచ్చుతగ్గులకు శరీరం అలవాటుపడడానికి కనీసం రెండేళ్లు పడుతుంది. ఆ సమయంలో హార్మన్ల హెచ్చుతగ్గుల వల్ల లైంగికాసక్తి కొరవడుతుంది. తర్వాత పరిస్థితి సర్దుకున్నప్పటికీ కొందర్లో తీవ్రమైన మానసిక, శారీరక సమస్యలు కూడా వేధిస్తాయి. అలాంటప్పుడు హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ తీసుకోవచ్చు. హార్మోన్ ప్యాచెస్ కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. వీటికి తోడు లైంగికాసక్తిని పెంచే మాత్రలు, శరీర అసౌకర్యాన్ని తొలగించే లూబ్రికెంట్లు కూడా వాడుకోవచ్చు. క్యాల్షియం మాత్రలతో ఎముకలను దృఢంగా ఉంచుకోగలిగితే, ఈ వయసులో ఒళ్లు నొప్పులు వేధించకుండా ఉంటాయి. వ్యాయామంతో శరీరాన్ని చురుగ్గా ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, మనసును హుషారుగా ఉంచుకోగలిగితే, మెనోపాజ్‌లో సైతం, మునుపటిలా లైంగికాసక్తిని పుంజుకోగలుగుతారు.





డాక్టర్ షర్మిల మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్,
www.doctorsharmila.in

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x లఖ్‌నవూ — మ.3.30 నుంచి, వేదిక: కోల్‌కతా

పంజాబ్ x చెన్నై — రా.7.30 నుంచి, వేదిక: చండీగఢ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఆర్‌సీబీ.. హమ్మయ్య

- ఆఖరి ఓవర్‌లో అద్భుతం
- విరాట్, రజత్ హాఫ్ సెంచరీలు
- పోరాడి ఓడిన ముంబై
- రాణించిన తిలక్



ముంబై: ఐపీఎల్ అభిమానులకిది అదిరిపోయే మ్యాచ్. బ్యాటింగ్‌లో చెలరేగిన బెంగళూరు ప్రత్యర్థి ముంబై ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినా.. ఆఖరి బంతి వరకూ ఉత్కంఠను రేకెత్తించింది. ఓ దశలో ముంబై ఓటమి లాంఛనమే అనిపించినా తిలక్ వర్మ (29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 42)ల దంచుడు ఆర్‌సీబీలో గుబులు రేపింది. కానీ కీలక దశలో వారి వికెట్లు తీసి తిరిగి పోటీలోకి రావడంతో పాటు, చివరి ఓవర్‌లో స్పిన్నర్ క్రునాల్ (4/45) మూడు వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీని గట్టెక్కించాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రజత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే వాంఖడేలో ఈ జట్టు పదేళ్ల తర్వాత గెలవడం మరో విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 67), దేవ్‌దత్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), రజత్ పటీదార్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), జితేశ్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 40 నాటౌట్) చెలరేగారు. హార్దిక్, బౌల్ట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హాజెల్‌వుడ్, యష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

చివర్లో బోల్తా: భారీ ఛేదనలో ముంబై ఆరంభం నుంచే ఇబ్బంది పడింది. ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేయడంతో ఓపెనర్లు రోహిత్ (17), రికెల్టన్ (17) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అటు విల్ జాక్స్ (22)తో కలిసి సూర్యకుమార్ (28) మూడో వికెట్‌కు 41 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే సూర్య భారీ షాట్లు ఆడేందుకు కష్టపడ్డాడు. రెండు క్యాచ్ అవుట్స్ ప్రమాదం నుంచి తప్పించుకున్న తను చివరకు 12వ ఓవర్‌లో యష్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 99/4గా ఉండడంతో ఇక ముంబైకి భారీ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఈ దశలో తిలక్, హార్దిక్ బ్యాట్లు ఝుళిపించి వణుకు పుట్టించారు. 13వ ఓవర్‌లో తిలక్ 6,4,4.. 14వ ఓవర్‌లో హార్దిక్ 6,4,6,4తో మొత్తంగా 39 పరుగులు రావడంతో మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. అలాగే తిలక్ 16వ ఓవర్‌లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ అంతా సవ్యంగా సాగుతున్న దశలో ముంబై వరుస ఓవర్లలో ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయింది. సమీకరణం 6 బంతుల్లో 19 రన్స్‌కి చేరింది. అయితే క్రునాల్ ఆరు పరుగులే ఇచ్చి శాంట్నర్ (8), చాహర్ (0), నమన్ (11)ల వికెట్లు తీసి ఆర్‌సీబీని సంబరాల్లో ముంచాడు.

ఆరంభం నుంచే దంచుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఓపెనర్ విరాట్ అనూహ్యంగా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగగా, దేవ్‌దత్, కెప్టెన్ రజత్, జితేశ్ కూడా అదరగొట్టడంతో బెంగళూరు భారీ స్కోరందుకుంది. చివరి ఐదు ఓవర్లలో జట్టు 70 పరుగులు సాధించింది. బుమ్రా ఒక్కడే కాస్త కట్టడి చేశాడు. అయితే తొలి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సాల్ట్ (4)ను పేసర్ బౌల్ట్ బౌల్డ్ చేసినా.. జట్టు ఆటలో మాత్రం జోరు తగ్గలేదు. ముంబైపై బెంగళూరు తమ అత్యధిక పవర్‌ప్లే స్కోరు (73/1)ను సాధించింది. పడిక్కళ్‌ను స్పిన్నర్ విఘ్నేష్ అవుట్ చేసి రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 91 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. అనంతరం 10-13 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. అయితే శాంట్నర్ ఓవర్‌లో 20 పరుగులు రావడంతో తిరిగి లయ అందుకుంది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్, లివింగ్‌స్టోన్ (0)లను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ డెత్ ఓవర్లలో పటీదార్‌కు జితేశ్ జత కలవడంతో ముంబై బౌలర్లు గతి తప్పారు. 16వ ఓవర్‌లో జితేశ్ 4,6 రజత్ 4తో బౌల్ట్ 18 రన్స్ సమర్పించుకున్నాడు. ఇక ఆ తర్వాత పటీదార్ 6,6,4తో 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. హార్దిక్ వేసిన ఈ 17వ ఓవర్‌లో ఏకంగా 23 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో జితేశ్ రెండు సిక్సర్లతో స్కోరు 200 దాటగా రజత్ వికెట్‌ను కోల్పోయింది. వీరి మధ్య ఐదో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. చివరి ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చి కాస్త ఊరటనిచ్చాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) బౌల్ట్ 4; విరాట్ (సి) నమన్ (బి) హార్దిక్ 67; పడిక్కళ్ (సి) జాక్స్ (బి) విఘ్నేష్ 37; పటీదార్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 64; లివింగ్‌స్టోన్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0; జితేశ్ (నాటౌట్) 40; డేవిడ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 221/5. వికెట్ల పతనం:** 1-4, 2-95, 3-143, 4-144, 5-213; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-57-2; దీపక్ 2-0-29-0; బుమ్రా 4-0-29-0; జాక్స్ 1-0-10-0; శాంట్నర్ 4-0-40-0; హార్దిక్ 4-0-45-2; విఘ్నేష్ 1-0-10-1.

ముంబై: రోహిత్ (బి) యశ్ దయాల్ 17, రికెల్టన్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 17, విల్ జాక్స్ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, సూర్యకుమార్ (సి) లివింగ్‌స్టోన్ (బి) యశ్ దయాల్ 28, తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 56, హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) హాజెల్‌వుడ్ 42, నమన్ ధిర్ (సి)యశ్ దయాల్ (బి) క్రునాల్ 11, శాంట్నర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 8, దీపక్ చాహర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 0, బౌల్ట్ (నాటౌట్) 1, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 7 ; మొత్తం 20 ఓవర్లలో 209/9 ; వికెట్లపతనం :** 1-21, 2-38, 3-79, 4-99, 5-188, 6-194, 7-203, 8-203, 9/209 ; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-48-1, యశ్ దయాల్ 4-0-46-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 4-0-45-4.




నాన్నంటే.. ఎంతో భయం!

న్యూఢిల్లీ: చిన్నప్పుడు తనకు నాన్న పాన్ సింగ్ అంటే ఎంతో భయమనే విషయాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో మహేంద్ర సింగ్ ధోనీ బయటపెట్టాడు. ఆయన వల్లే ఎంతో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటైందని తెలిపాడు. తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పాడు. 'నాన్న ఎంతో కఠినంగా ఉండేవారు. కానీ, ఎన్నడూ కోప్పడలేదు. ఎప్పుడూ సమయపాలన పాటించేవారు. అది నాకు కూడా అలవడిందని తెలిపాడు. తన తండ్రి వల్లే జీవితంలో ఎప్పుడూ అభద్రతా భావానికి గురికాలేదన్నాడు.



మనోళ్లు మురిపిస్తారా?

బరిలో సింధు, సేన్, ప్రణయ్

నేటినుంచి బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్

నిన్‌గ్బో (చైనా): ఇటీవలి కాలంలో జరిగిన అన్ని ప్రధాన టోర్నీలలో భారత షట్లర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనోళ్లు ఎలా రాణిస్తారోనన్న ఉత్కంఠ ఏర్పడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోడ్, అనుపమా ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్ తలపడుతున్నారు. మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ద్వయం, పురుషుల్లో సాత్విక్/చిరాగ్ జంట టోర్నమెంట్‌లో పాల్గొనడంలేదు. తొలి రౌండ్‌లో తైపీకి చెందిన లీ చియాతో లక్ష్యసేన్ తలపడతాడు. గువాంగ్ జు (చైనా)తో ప్రణయ్, కంటపాన్ (ఇండోనేసియా)తో రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకుంటారు. మహిళల సింగిల్స్‌లో...ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు-ఎస్తేర్ నురుమి (ఇండోనేసియా)తో టోర్నీని ప్రారంభిస్తుంది. ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంటనాన్‌ను అనుపమ, చైనా షట్లర్ ఫాంగ్‌ను మాళవిక, రెండో సీడ్ యీ హాన్ (చైనా)ను ఆకర్షి ఢీకొంటారు. మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి జంట-తైపీ జోడీ యున్ సంగ్/చీన్ యుతో తలపడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ కుమార్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్/రుత్వికా శివాని, సతీష్ కరుణాకరన్/ఆద్య, ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019 తర్వాత టీ20ల్లో తన ఫాస్టెస్ట్ (29 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ. అలాగే ఈ ఫార్మాట్‌లో 13 వేల రన్స్ పూర్తి చేసిన ఐదో బ్యాటర్ అయ్యాడు.

1 ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన పేసర్‌గా భువనేశ్వర్. బ్రావో (183)ను అధిగమించాడు.

2 వాంఖడేలో ఆర్‌సీబీకిది రెండో అత్యధిక స్కోరు (221/5). 2015లో 235/1 రన్స్ చేసింది.



ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బ్రూక్

లండన్: ఇంగ్లండ్‌క్రికెట్ పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు ఇకనుంచి హ్యారీ బ్రూక్ సారథ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారిక ప్రకటన చేసింది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు పేలవ ప్రదర్శన కారణంగా జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈనేపథ్యంలో వైస్ కెప్టెన్‌గా ఉన్న 26 ఏళ్ల బ్రూక్‌కు వన్డే, టీ20 జట్ల పగ్గాలు అప్పగించారు. టెస్టు కెప్టెన్ స్టోక్స్‌కే పరిమిత ఓవర్ల కెప్టెన్సీని అప్పగిస్తారనే కామెంట్స్ వినిపించినా.. ఈసీబీ బ్రూక్ వైపు మొగ్గు చూపింది. 2022లో అరంగేట్రం చేసిన బ్రూక్ ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్నాడు.

ఇషాంత్‌కు జరిమానా

హైదరాబాద్: గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. అంతేకాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కూడా అతడి ఖాతాలో చేరింది. ఆదివారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాంత్ ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2 రూల్‌ను అతిక్రమించినట్టు తేలింది. క్రికెట్ సామగ్రి, జెర్సీ, మైదానంలోని వస్తువులను అగౌరవపర్చడం దీనికిందికి వస్తుంది. రెఫరీ శ్రీనాథ్ విధించిన ఈ జరిమానాను ఇషాంత్ అంగీకరించాడు.

టాంజానియా చరిత్ర

తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత



న్యూఢిల్లీ: ఆఫ్రికా క్రికెట్ జట్టు టాంజానియా చరిత్ర సృష్టించింది. తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. నైజీరియాలో జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో ఆరు జట్ల రౌండ్ రాబిన్ లీగ్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టాంజానియా విజయాలు సాధించింది. ఈ క్రమంలో 2026లో జరిగే జూనియర్ వరల్డ్ కప్‌నకు అర్హత సాధించిన 12వ జట్టుగా టాంజానియా నిలిచింది. 16 జట్ల టోర్నీలో ఆతిథ్య జట్టుగా జింబాబ్వేతోపాటు గత టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసిన 10 జట్లు నేరుగా క్వాలిఫై అయ్యాయి. ఆసియా, ఈస్ట్ ఆసియా పసిఫిక్, ఐరోపా, అమెరికా రీజియన్ల నుంచి ఒక్కో జట్టు అర్హత సాధించాల్సి ఉంది.

నర్మదకు ఆరో స్థానం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో సోమవారం భారత షూటర్లు నిరాశపర్చారు. సోమవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో నర్మద నితిన్ 166.3 పాయింట్లతో ఆరో స్థానంలో, సోనమ్ ఉత్తమ్ 124.4 పాయింట్లతో ఎనిమిది స్థానంలో నిలిచారు. జిఫి వాంగ్ (చైనా) స్వర్ణం నెగ్గగా.. యుంజీ కవ్సాన్ (కొరియా) రజతం, ఆడ్రే గొగ్నియాత్ (స్విట్జర్లాండ్) కాంస్యం దక్కించుకొన్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో నర్మద ఆరో స్థానం, సోనమ్ తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



శక్తిమంతమైన లుక్‌లో...

అశ్విన్‌బాబు హీరోగా ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, రియా సుమన్, ఆయేషా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి అశ్విన్‌బాబు లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన పాత్ర శక్తిమంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, డీఓపీ: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌరహరి.

గోదారి అందాల నడుమ..




విక్టరీ వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో 'గోదారి గట్టుపైన' పాట ఎంత పాపులర్ అయిందో చెప్పనక్కర్లేదు. ఆ పాటలోని మొదటి పదాన్ని తమ సినిమాకు టైటిల్‌గా నిర్ణయించింది రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ. 'గోదారి గట్టు పైన' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. సుభాష్‌చంద్ర దర్శకుడు. నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఒక చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన భావోద్వేగాలతో ఉంటుంది. గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో రూపుదిద్దుకుంటోంది. పశ్చిమ గోదావరి ప్రాంతంలోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తాయి' అని దర్శకుడు చెప్పారు. రాజీవ్ కనకాల, లైలా, దేవీ ప్రసాద్, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభినవ్ రావు ఈ చిత్రానికి నిర్మాత.



ముచ్చటగా బంధాలే!

విజయశాంతి, కల్యాణ్‌రామ్ తల్లీకొడుకులుగా నటిస్తున్న 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రం ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో వీరిద్దరి పాత్రలు చాలా కీలకం. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సింగిల్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. సెకండ్ సింగిల్ 'ముచ్చటగా బంధాలే' ను బుధవారం చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో విడుదల చేయనున్నారు. తల్లీకొడుకుల అనుబంధాన్ని అద్భుతంగా వివరించే పాట ఇది. ఇటీవలె సినిమా ప్రమోషన్స్ ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా చేసిన స్పెషల్ ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించారు. రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు.





షారుఖ్‌తో మళ్లీ..

షారుఖ్ ఖాన్ కొత్త చిత్రం 'కింగ్' గురించి వినిపిస్తున్న ఒక కొత్త వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. షారుఖ్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రను దీపిక పదుకోన్ పోషించనున్నారట. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా.. సుహానాకు ఆమెకు తల్లిగా నటించడం ప్రత్యేకతేగా మరి. షారుఖ్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఆ పాత్ర ప్రాధాన్యం గురించి దీపికకు చెప్పి ఆమెను ఒప్పించారట. షారుఖ్ చిత్రంలో దీపిక మళ్లీ నటిస్తున్నందుకు ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు కానీ ఇందులో ఆమెది తల్లి పాత్ర అని తెలియగానే నీరస పడిపోతున్నారు. ఎందుకంటే.. 'దీపికకు 39 ఏళ్లు, సుహానాకు 24 ఏళ్లు. వీరిద్దరికి పదిహేనేళ్ల ఏజ్ గ్యాపే ఉంది కనుక తల్లీకూతుళ్లుగా కంటే అక్కా చెల్లెళ్లుగా చూపిస్తే బాగుంటుంది.. ఆలోచించండి ఖాన్ సాబ్' అని అభిమానులు అభ్యర్థిస్తున్నారట.

ఎక్స్‌లోకి రీ ఎంట్రీ

నటి సమంత సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' టీజర్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'పెద్ద కలలతో మా టీమ్ చేసిన చిన్ని ప్రయత్నమిది.. ఎంతో ప్రేమతో చేసిన ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రీగుల దర్శకత్వం వహించిన ఈ చిత్ర టీజర్ ఇటీవలే విడుదలైంది. త్వరలోనే రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా, 2012లో ఎక్స్(అప్పట్లో ట్విట్టర్) ఖాతాను ప్రారంభించారు సమంత. ఇటీవలె అందులో పెట్టిన అన్ని పోస్టులను తొలగించారు. అప్పటినుంచి ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్, వ్యక్తిగత విషయాలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఇప్పుడీ చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి ఆమె ఎక్స్ ఖాతాను తిరిగి ఉపయోగించడంతో నెటిజన్లు ఖుషీ అవుతున్నారు. ఆమెను స్వాగతిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఏకే వస్తున్నాడు..




తమిళ హీరో అజిత్‌కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటించారు. షాయాజీ షిండే, జాకీ ష్రాఫ్, ప్రభు, సునీల్, అర్జున్‌దాస్, సిమ్రాన్, ప్రియాప్రకాశ్ వారియర్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 10న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నువ్వు పెద్ద విలన్‌వని విన్నా.. కానీ నా గేమ్‌లో నేనేరా నీకు విలన్', 'ఏకే వస్తున్నాడు దారివదలండ్రా', 'వాడు భయాన్ని భయపెట్టేవాడు' వంటి సంభాషణలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

రెండో సారి క్యాన్సర్... భార్యకు ధైర్యం చెప్పిన హీరో



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి, నటి, దర్శకురాలు తహీరా కశ్యప్ రెండోసారి క్యాన్సర్ బారిన పడ్డారు. తనకు తిరిగి రొమ్ము క్యాన్సర్ సోకినట్టు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లాలని తహీరా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తహీరా తన రొమ్ము క్యాన్సర్ విషయం వెల్లడించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని కోరారు. భార్య పెట్టిన పోస్ట్‌కు వెంటనే స్పందిస్తూ 'మై హీరో' అని కామెంట్ పెట్టారు. 2018 లో ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఇక అప్పటినుంచి చికిత్సలో భాగంగా జరిగే ప్రతి చర్యనీ ఆమె సోషల్ మీడియాలో పంచుకుంటూ తనలా క్యాన్సర్‌తో బాధ పడేవారికి ధైర్యాన్ని ఇచ్చారు.


ఆకట్టుకునే కన్నమ్మ



'ఆయ్', 'మారుతీనగర్ సుబ్రమణ్యం' ఫేమ్ అంకిత్ కొయ్య, నీలఖి ప్రధాన పాత్రల్లో జె.ఎస్.ఎన్. వర్ధన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'బ్యూటీ'. వానరా సెల్యులాయిడ్స్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్ బ్యానర్లపై అడిదాల విజయ్‌పాల్‌రెడ్డి, ఉమేశ్‌.కె.ఆర్.బన్సాల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రం నుంచి విడుదల చేసిన గ్లింప్స్, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ చిత్రం నుంచి 'కన్నమ్మ కన్నమ్మ' అంటూ సాగే పాటను విడుదల చేశారు. సనారే రచించిన ఈ గీతాన్ని ఆదిత్య ఆర్కే, లక్ష్మీ మేఘన ఆలపించారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్

సునామీ కిట్టీ, పి.మూర్తి, చరిష్మా ప్రధాన పాత్రల్లో ఒరాట శ్రీ తెరకెక్కించిన హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కోర'. డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ నిర్మించారు. ఇటీవలే చిత్రం నుంచి విడుదల చేసిన గ్లింప్స్, టీజర్, పాటలకు మంచి ఆదరణ లభించింది. తాజాగా, ఈ సినిమా విడుదల గురించి అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈనెలలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామనీ.. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామనీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కె.గిరీష్‌కుమార్, కెమెరామెన్: సెల్వం మత్తప్పన్, సంగీతం: బి.ఆర్.హేమంత్‌కుమార్.



క్షణక్షణం ఉత్కంఠభరితం



దినేశ్ తేజ్, దక్షిక.కె జంటగా అర్జున్ కోల తెరకెక్కిస్తున్న చిత్రం 'తత్వం'. వంశీ సీమకుర్తి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్.కె.ఎన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు అర్జున్ మాట్లాడుతూ "కొన్ని అనుకోని పరిస్థితుల్లో ఊహించని సమస్యల్లో ఇరుక్కున్న కథానాయకుడు.. వాటి నుంచి బయటపడ్డాక తెలుసుకున్న తత్వం ఏంటనేదే చిత్ర కథాంశం" అని అన్నారు. "ప్రతీ సన్నివేశం అద్భుతంగా ఉంటుంది. క్షణక్షణం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిది" అని చిత్రనిర్మాత వంశీ సీమకుర్తి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ



గీతానంద్, మిత్రా శర్మ జంటగా దయానంద్ తెరకెక్కిస్తున్న రొమాంటిక్ కామెడీ 'వర్జిన్ బాయ్స్'. రాజా దరపునేని నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్రం నుంచి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. "ఈ సినిమాలో ఆకట్టుకునే ప్రేమకథతో పాటు హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు ఉంటాయి. యువతను ఆకర్షించే కథాంశంతో వస్తున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుంది" అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: వెంకట ప్రసాద్, సంగీతం: స్మరణ్ సాయి.

బ్లాక్ మండే



ప్రపంచ మార్కెట్లో ట్రంప్ సుంకంపాలు

కుప్పకూలిన ప్రామాణిక సూచీలు.. ఆరంభ ట్రేడింగ్‌లో 5 శాతానికి పైగా క్షీణించిన సెన్సెక్స్, నిఫ్టీ

క్షణాల్లో రూ.20 లక్షల కోట్లు ఆవిరి.. చివరికి 2,226 పాయింట్ల నష్టంతో

73,137.90 వద్ద ముగిసిన సెన్సెక్స్.. నిఫ్టీ 743 పాయింట్లు డౌన్.. 22,161 వద్ద క్లోజింగ్

మదుపరులకు రూ.14 లక్షల కోట్ల నష్టం


ముంబై: ప్రపంచ స్టాక్ మార్కెట్లను ట్రంప్ సుంకాలు కుదిపేస్తున్నాయి. ఆ ధాటికి సూచీలు కుప్పకూలుతున్నాయి. మన దలాల్‌స్ట్రీట్ కూడా రక్తమోడింది. భారీ పతనంతో మదుపరుల నష్టాల ఘోష మిన్నంటింది. ట్రేడింగ్ ఆరంభంలోనే సూచీలు 5 శాతానికి పైగా క్షీణించాయి. క్షణాల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా మార్కెట్ సంపద హరించుకుపోయింది. ఈ 'సుంకష్టాలు' ఇంతటితో ఆగేలా.. ఇప్పట్లో తీరేలా కన్పించడం లేదు. ముందుంది ముసళ్ల పండగ. ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధం తీవ్రతరం కానుందని.. అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకోవడం దాదాపు ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అంటే, మార్కెట్లకు ఇది ట్రైలరేనా..? బేర్ మహా విశ్వరూపాన్ని త్వరలోనే చూడాల్సి వస్తుందా..? వేచి చూడాల్సిందే..

- బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ సోమవారం ట్రేడింగ్ ఆరంభంలోనే 3,939.68 పాయింట్లు (5.22 శాతం) పతనమై 71,425.01 వద్దకు జారుకుంది. ఆ తర్వాత కాస్త తేరుకున్న సూచీ, చివరికి 2,226.79 పాయింట్ల (2.95 శాతం) నష్టంతో 73,137.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ప్రారంభంలోనే 1,160.80 పాయింట్లు (5.06 శాతం) క్షీణించి 21,743.65 వద్దకు జారుకుంది. చివర్లో 742.85 పాయింట్ల (3.24 శాతం) నష్టంతో 22,161.60 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల దెబ్బకు సూచీలు భారీగా నష్టపోవడం వరుసగా ఇది మూడో రోజు.
- ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రారంభ ట్రేడింగ్‌లో రూ.20.16 లక్షల కోట్ల మేర కరిగిపోయింది. చివరికి రూ.14.09 లక్షల కోట్ల తరుగుదలతో రూ.389.25 లక్షల కోట్లకు (4.54 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.
- గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ ఫిబ్రవరి వరకు వరుసగా 5 నెలల పాటు దిద్దుబాటుకు లోనైన స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు గత నెలలో మళ్లీ 6 శాతం వరకు పుంజుకున్నాయి. ట్రంప్ సుంకాల ప్రభావంతో ఏర్పడిన వరుస నష్టాల కారణంగా సూచీలు మళ్లీ వేగంగా తగ్గుతూ వచ్చాయి. మార్చి 24 గరిష్ఠ స్థాయితో పోలిస్తే దాదాపు రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో హిందుస్థాన్ యూనిలీవర్ మినహా అన్నీ నష్టపోయాయి. టాటా స్టీల్ షేరు 7.73 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్ 5 శాతానికి పైగా పతనమవగా.. కోటక్ బ్యాంక్, ఎం అండ్ ఎం 4.33 శాతం వరకు నష్టపోయాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3 శాతానికి పైగా క్షీణించాయి.
- బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 4.13 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 3.46 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీలన్నీ నేలచూపులు చూశాయి. మెటల్ ఇండెక్స్ ఏకంగా 6.22 శాతం తరిగిపోయింది. రియల్టీ 5.69 శాతం పడిపోయింది. కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ 4 శాతానికి పైగా తగ్గాయి.
- బీఎస్ఈలో 3,515 కంపెనీల షేర్లు నష్టపోగా.. 570 లాభపడ్డాయి. 140 యథాతథంగా ముగిశాయి. 775 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. 11 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 32 పైసలు క్షీణించి రూ.85.76 వద్ద ముగిసింది. గడిచిన ఐదు వారాల్లో రూపాయి మారకం విలువలో ఇదే అతిపెద్ద నష్టం. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో పాటు ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉపసంహరణ మన కరెన్సీకి గండికొట్టాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి.
- అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ రకం ముడిచమురు పీపా ధర ఒకదశలో 3.61% తగ్గి 63.21 డాలర్లకు దిగివచ్చింది.

మెల్టింగ్ మెటల్

సుంకాల దెబ్బకు లోహ రంగ షేర్ల ధరలు వేగంగా కరిగిపోతున్నాయి. మిగతా రంగాలతో పోలిస్తే మెటల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి తీవ్రతరమైంది. బీఎస్ఈలో నాల్కో షేరు 8.18 శాతం పతనమవగా.. టాటా స్టీల్ 7.73 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 7.58 శాతం, సెయిల్ 7.06 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ 6.90 శాతం, వేదాంత 6.90 శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ 6.36 శాతం, హిందాల్కో 6.26 శాతం, ఎన్ఎండీసీ 5.75 శాతం, హిందుస్థాన్ జింక్ 4.89 శాతం, ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ 4.77 శాతం నష్టపోయాయి. దాంతో బీఎస్ఈలోని మెటల్ సూచీ 6 శాతానికి పైగా తగ్గింది.

టాప్-5 కుబేరులకు 85,800 కోట్ల నష్టం



స్టాక్ మార్కెట్ మహా పతనంతో దేశంలోని ఐదుగురు అత్యంత ధనవంతుల సంపద ఒక్కరోజులోనే 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.85,800 కోట్లు) మేర తరిగిపోయింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ల జాబితా ప్రకారం.. భారత కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఆస్తి 290 కోట్ల డాలర్ల (రూ.24,882 కోట్లు) మేర తగ్గి మొత్తం 8,840 కోట్ల డాలర్లకు (రూ.7.58 లక్షల కోట్లు) పడిపోయింది. రెండో అతిపెద్ద ధనవంతుడు, అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ నెట్‌వర్త్ 280 కోట్ల డాలర్ల (రూ.24,024 కోట్లు) తగ్గుదలతో 5,760 కోట్ల డాలర్లకు (రూ.4.94 లక్షల కోట్లు) జారుకుంది. దేశంలో అత్యంత సంపన్న మహిళ, జిందాల్ గ్రూప్ చైర్‌పర్సన్ 230 కోట్ల డాలర్లు (రూ.19,734 కోట్లు) నష్టపోయారు. దాంతో ఆమె కుటుంబ ఆస్తి 3,380 కోట్ల డాలర్లకు (రూ.2.90 లక్షల కోట్లు) పడిపోయింది. హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ నెట్‌వర్త్ 90.2 కోట్ల డాలర్లు (రూ.7,740 కోట్లు) తగ్గి 3,150 కోట్ల డాలర్లకు (రూ.2.70 లక్షల కోట్లు) జారుకుంది. దేశంలో ఐదో అత్యంత సంపన్నుడు, సన్ ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ 63.2 కోట్ల డాలర్లు (రూ.5,423 కోట్లు) నష్టపోయారు. దాంతో ఆయన ఆస్తి 2,630 కోట్ల డాలర్లకు (రూ.2.26 లక్షల కోట్లు) పరిమితమైంది.

బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ లూజర్స్

%		షేరు ముగింపు ధర
-7.73	టాటా స్టీల్	129.60
-5.78	ఎల్ అండ్ టీ	3070.85
-5.54	టాటా మోటార్స్	579.85
-4.33	కోటక్ బ్యాంక్	2040.50
-4.11	ఎం అండ్ ఎం	2490.90
-3.75	ఇన్ఫోసిస్	1397.80
-3.72	యాక్సిస్ బ్యాంక్	1048.95
-3.54	ఐసీఐసీఐ బ్యాంక్	1287.65
-3.27	హెచ్‌సీఎల్ టెక్	1375.30
-3.24	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1758.15

గ్లోబల్ సూచీలు విలవిల

» మన మార్కెట్టే కాస్త మెరుగు

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లతో పోలిస్తే భారత సూచీలు తక్కువ నష్టాలతోనే సరిపెట్టుకున్నాయని చెప్పాలి. ఎందుకంటే, సోమవారం చైనాకు చెందిన షాంఘై ఇండెక్స్ 7.34 శాతం, జపాన్ నిక్కీ 7.83 శాతం, హాంకాంగ్‌కు చెందిన హాంగ్‌సెంగ్ 13.22 శాతం క్షీణించాయి. యూరప్ మార్కెట్లదీ అదే పరిస్థితి. గతవారం చివరి రెండు సెషన్లలో 10 శాతం వరకు క్షీణించిన ఐరోపా సూచీలు.. సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో 4 శాతం వరకు నష్టపోయాయి. గత శుక్రవారం అమెరికాలోని డౌజోన్స్ 5.50 శాతం, నాస్‌డాక్ 5.82 శాతం, ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్ 5.97 శాతం పతనమయ్యాయి. గత వారంలో చివరి రెండు సెషన్లలో అమెరికా స్టాక్ మార్కెట్లో 5 లక్షల కోట్ల డాలర్లకు (రూ.428 లక్షల కోట్లు) సంపద ఆవిరైంది. సోమవారం ట్రేడింగ్‌లోనూ యూఎస్ ఇండెక్స్‌లు తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో డౌజోన్స్ 700 పాయింట్ల వరకు తగ్గింది. ఎస్ అండ్ పీ, నాస్‌డాక్ సైతం ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

ప్రపంచ మార్కెట్ల పతనం

సూచీ	నష్టం(%)
ఆసియా	
షాంఘై(చైనా)	7.34
నికాయ్ (జపాన్)	7.83
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	13.22
ఐరోపా	
ఎఫ్‌టీఎస్ఈ(బ్రిటన్)	4.38
సీఏసీ (ఫ్రాన్స్)	4.78
డాక్స్ (జర్మనీ)	4.13
అమెరికా (భారత కాలమానం ప్రకారం రాత్రి 12.00 నాటికి)	
డౌజోన్స్	0.86
ఎస్ అండ్ పీ 500	0.04
నాస్‌డాక్	+0.30

గత 10 నెలల్లో అతిపెద్ద క్షీణత

మన ఈక్విటీ సూచీలకు గత 10 నెలల్లో ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత. చివరగా, 2024 జూన్ 4న సెన్సెక్స్ 4,389.73 పాయింట్లు (5.74 శాతం), నిఫ్టీ 1,379.40 పాయింట్లు (5.93 శాతం) పతనమయ్యాయి. ఇంట్రాడేలోనైతే సెన్సెక్స్ 6,234.35 పాయింట్లు (8.15 శాతం), నిఫ్టీ 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పడిపోయాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం అందుకు కారణం. కాగా, కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కరోజే 13 శాతం మేర నష్టపోయాయి.

నిఫ్టీ అతిపెద్ద నష్టాలు

తేదీ	పాయింట్లు	(%)
2025 ఏప్రిల్ 7	742.85	3.24
2024 జూన్ 4	1,379.40	5.93
2020 మార్చి 23	1,135.20	12.98
2008 అక్టోబరు 24	386.00	13.11
2008 జనవరి 21	496.50	8.70
2004 మే 17	196.90	12.24
1997 మార్చి 31	89.50	8.46

డీమ్యాట్ ఖాతాలపైనా సుంకాల ఎఫెక్ట్!

ట్రంప్ సుంకాల కారణంగా గత కొంతకాలంగా ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతున్నాయి. దాంతో మార్కెట్ భవిష్యత్ దిశ, రాబడులపైనా అనిశ్చితి నెలకొంది. తత్ఫలితంగా స్టాక్ మార్కెట్లోకి కొత్తగా ప్రవేశించాలనుకునేవారూ సరైన సమయం కోసం వేచి చూస్తున్నారు. ఇది మార్కెట్లో ట్రేడింగ్ నెరిపేందుకు అవసరమైన డీమ్యాట్ ఖాతాల వృద్ధిపైనా ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది మార్చిలో కొత్తగా 20.4 లక్షల డీమ్యాట్ అకౌంట్లను తెరిచారు. నెలవారీ ఖాతాల వృద్ధిలో 23 నెలల (2023 ఏప్రిల్ తర్వాత) కనిష్ఠ స్థాయి ఇది. ఈ ఫిబ్రవరిలో కొత్తగా తెరిచిన 30.3 లక్షల అకౌంట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. కొత్త ఖాతాలు తగ్గడం వరుసగా ఇది మూడోనెల. ఫిబ్రవరిలో 19.040 కోట్లుగా ఉన్న మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య ఈ మార్చి చివరి నాటికి 19.244 కోట్లకు చేరుకుంది.

రూ.9,000 కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) సోమవారం ఒక్కరోజే నికరంగా రూ.9,040 కోట్ల షేర్లను విక్రయించారు.విలువపరంగా ఎఫ్‌పీఐలకు ఈ ఏడాదిలో ఇది రెండో అతిపెద్ద ఒక్కరోజు నికర విక్రయం. ఫిబ్రవరి28న మార్కెట్ నుంచి నికరంగా రూ.11,639 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

'బంగారం అంటే భీమ'

రామ్‌చరణ్‌తో సరికొత్త ప్రచారం

ప్రారంభం: భీమ జువెల్స్



హైదరాబాద్: ప్రముఖ జువెలరీ రిటైలర్ భీమ జువెల్స్.. 'బంగారం అంటే భీమ' పేరుతో సరికొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. సంస్థ బ్రాండ్ అంబాసిడర్ రామ్‌చరణ్‌తో ప్రత్యేకంగా ఈ క్యాంపెయిన్‌ను రూపొందించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సంస్కృతులు ప్రతిబింబించే విధంగా దీన్ని రూపొందించినట్లు భీమ జువెల్స్ వెల్లడించింది ఈ క్యాంపెయిన్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని సంస్కృతులకు ప్రతిరూపాలైన హారాలు, వడ్డాణాలు, గుట్టపూసలు, చోకర్స్, నక్షి గాజులు, జుమ్కీలు వంటి ఆభరణాలను ప్రదర్శించనున్నట్లు తెలిపింది. ప్రతి ఆభరణాన్ని భీమ జువెల్స్ పూర్తిగా నిబద్ధతతో తయారు చేసిందని పేర్కొంది. అంతేకాదు తెలుగు వారి వేడుకలు, వివాహాల్లో ఈ బంగారు ఆభరణాలు ముఖ్యమైన భాగంగా ఉంటాయని తెలిపింది. బంగారం అంటే భీమ అనేది ఒక క్యాంపెయిన్ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో బంగారాన్ని ఇష్టపడే వారికి ఒక ప్రత్యేకమైన వేడుక అని భీమ జువెల్స్ ఎండీ అభిషేక్ బిందుమాధవ్ అన్నారు.

మా కార్లపైనా సుంకాలు తగ్గించండి!

» భారత్‌కు ఈయూ సరికొత్త ప్రతిపాదన

» ట్రంప్ బాటలోనే ఈయూ

న్యూఢిల్లీ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం కింద భారత్‌లోకి దిగుమతి అవుతున్న కార్లపై జీరో సుంకాలు ప్రకటించాలని యూరోపియన్ యూనియన్ (ఈయూ) కోరుతోంది. అయితే ఆ చర్చలకు ఒక ముగింపు ఇచ్చే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం సైతం తన ప్రతిపాదనలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు సంసిద్ధత ప్రకటిస్తోంది. ప్రస్తుతం యూరప్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కార్లపై 100 శాతం సుంకం విధిస్తుండగా దాన్ని దశలవారీగా 10 శాతానికి తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దేశీయ పరిశ్రమను రక్షించడం కోసం దిగుమతి కార్లపై సుంకాన్ని కనీసం 30 శాతంగా కొనసాగించాలని ఒకపక్క పరిశ్రమ వర్గాలు కోరుతుండగా ప్రభుత్వం అందుకు భిన్నమైన వైఖరిపై సమాలోచనలు జరుపుతుండటం గమనార్హం. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం దిగుమతి సుంకాలు తగ్గించాలని ఒత్తిడి పెంచుతున్న సమయంలోనే ఈయూ నుంచి కూడా అదే తరహా ప్రతిపాదన రావటం గమనార్హం.

ఎవరి మాట నెగ్గేను: ఈయూ ప్రతిపాదనలకు ప్రభుత్వం తలొగ్గినట్టయితే అది ఫోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి కంపెనీలతో పాటు ఈ ఏడాది దేశంలో విద్యుత్ కార్ల (ఈవీ) విక్రయాలు ప్రారంభించాలన్న ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లాకు కూడా ఒక ఘన విజయమే అవుతుంది. ఈయూ డిమాండ్లను గత వారం ఆటోమొబైల్ పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం తెలియచేసింది. అయితే ఈ తాజా పరిస్థితులపై వ్యాఖ్యానించేందుకు వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులు గాని, సియామ్ ప్రతినిధులు గాని నిరాకరించారు. వాస్తవానికి ఏటా 40 లక్షల కార్ల అమ్మకాలు నమోదయ్యే మన ఆటోమొబైల్ మార్కెట్ అత్యంత సురక్షిత మార్కెట్. మరోవైపు ఈవీలపై దిగుమతి సుంకాలు తగ్గించవద్దని టాటా మోటార్స్, మహీంద్రా.. ప్రభుత్వంతో లాబీయింగ్ చేస్తున్నాయి.

వడ్డీ రేట్ల తగ్గింపే ట్రంప్ అసలు వ్యూహం

అందుకే మాంద్యం కోసం ప్రయత్నాలు



న్యూయార్క్: అన్ని దేశాల దిగుమతుల మీద ట్రంప్ సర్కారు ఎడాపెడా సుంకాలు విధిస్తోంది. దీంతో అమెరికా మరోసారి ఆర్థిక మాంద్యం బారిన పడే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఆ సుంకాలకు వ్యతిరేకంగా అమెరికాలోని పలు నగరాల్లో నిరసన ప్రదర్శనలూ వెల్లువెత్తుతున్నాయి. అయినా ట్రంప్ సర్కారు ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. ఎవరెంత అరిచి గీపెట్టినా సుంకాలపై వెనక్కి తగ్గేదేలే అని స్పష్టం చేశారు. తన సుంకాలకు ప్రతీకారంగా అమెరికా దిగుమతులపై చైనా విధించిన 34 శాతం సుంకాలనూ వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకపోతే చైనా దిగుమతులపై మరిన్ని సుంకాలు తప్పవని తాజాగా హెచ్చరించారు. ఈ సుంకాల పోరు వెనుక అధ్యక్షుడు ట్రంప్‌కు పెద్ద వ్యూహమే ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏమిటీ వ్యూహం

పేరుకు అగ్రరాజ్యమైనా అమెరికా కూడా పెద్ద అప్పులకుప్పగా మారింది. ప్రస్తుతం ఆ దేశ ప్రభుత్వ అప్పు 36 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.3,079 లక్షల కోట్లు) చేరింది. ఇది ఆ దేశ జీడీపీలో 120 శాతానికి సమానం. ఈ మొత్తం అప్పుల్లో 7.2 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.615 లక్షల కోట్లు) అప్పును వచ్చే ఏడాది జూన్‌లోగా చెల్లించాలి. ఈ అప్పుపై ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం ఏటా చెల్లిస్తున్న వడ్డీ రేటు 1 నుంచి 1.5 శాతం మాత్రమే. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీ రేటు 4 నుంచి 4.5 శాతం వరకు ఉంది. మనకు ఇది తక్కువగా కనిపించినా అమెరికన్లకు మాత్రం ఇది చాలా పెద్దమొత్తమే.

నిధుల కొరత

అయితే ప్రస్తుతం అమెరికా ఖజానా కూడా దాదాపుగా నిండుకుంది. ద్రవ్య లోటూ జీడీపీలో 6 శాతానికి చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి మన దేశంలో నమోదైన 4.7 శాతం కంటే ఇది ఎక్కువ. డాలర్ ఇంటర్నేషనల్ కరెన్సీ కావడంతో కొత్త అప్పుల సమీకరణ అమెరికాకు పెద్ద కష్టమేమీ కాదు. అలా అని 4 నుంచి 4.5 శాతం వడ్డీతో కొత్త అప్పులు తేవడం ట్రంప్ సర్కారుకు ఇష్టం లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

వడ్డీ రేట్ల తగ్గింపే అసలు లక్ష్యం !

వచ్చే ఏడాది జూన్‌లోగా 7.2 లక్షల కోట్ల డాలర్ల అప్పులు చెల్లించేందుకు సరిపడా డబ్బులు కూడా ట్రంప్ సర్కారు వద్ద లేవు. ఈ అప్పుల్ని రీ ఫైనాన్స్ చేయడం ఒక్కటే ప్రస్తుతం ట్రంప్ సర్కారు ముందున్న మార్గం. అలా అని ఈ అప్పులపై ప్రస్తుతం 4 నుంచి 4.5 శాతం వడ్డీ చెల్లించేందుకూ ట్రంప్ ఇష్టపడడం లేదు. దీంతో అన్ని దేశాల దిగుమతులపై ఎడాపెడా సుంకాలు మోపి, ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెట్టి వడ్డీ రేట్ల తగ్గింపునకు ట్రంప్ వ్యూహం పన్నారనే అంచనాలు వినిపిస్తున్నాయి. 'సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగదు, ముందు మీరు వడ్డీ రేట్లు తగ్గించండి' అని అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్‌ను ట్రంప్ తాజాగా దబాయించడం వెనుక ఇదే వ్యూహం ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ వ్యూహంతో ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్ కుప్పకూలినా ట్రంప్ పెద్దగా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. వడ్డీ రేట్లు తాను అనుకున్న 2 శాతం దిగువకు వచ్చాక ఈ రెండూ మళ్లీ రేసుగుర్రాల్లా పరిగెడతాయని ట్రంప్ నమ్మకం. ఈ నమ్మకం ఎలా ఉన్నా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్ మదుపరులు మాత్రం లబోదిబోమంటున్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో మనకు ముప్పే

» రూ.49,438 కోట్ల ఎగుమతులకు గండి: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు ఈ సంవత్సరం అమెరికాకు మన వస్తు ఎగుమతులను బాగానే దెబ్బతీయనున్నాయి. ఈ ప్రభావం ఎంత లేదన్నా 576 కోట్ల డాలర్ల (సుమారు రూ.49,438 కోట్లు) మేరకు ఉంటుందని జీటీఆర్ఐ అనే మేధో సంస్థ అంచనా. భారత్ నుంచి అమెరికాకు జరిగే మొత్తం ఎగుమతుల్లో ఇది దాదాపు 6.41 శాతానికి సమానం. ట్రంప్ టారిఫ్‌లతో గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అమెరికాకు మన మత్స్య ఎగుమతులు 20.2 శాతం, ఇనుము, స్టీల్ ఎగుమతులు 18 శాతం, ఆభరణాలు, వజ్రాల ఎగుమతులు 15.3 శాతం, ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతులు 12.1 శాతం, ఎలక్ట్రిక్, టెలికాం, ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 12 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉందని జీటీఆర్ఐ అంచనా వేసింది. ప్లాస్టిక్ వస్తువులు, తివాచీలు, పెట్రో ఉత్పత్తులు, ఆర్గానిక్ రసాయనాలు, యంత్ర పరికరాల ఎగుమతులూ నీరసిస్తాయని తెలిపింది. మన రొయ్యల ఎగుమతులపైనా ట్రంప్ సర్కారు 26 శాతం సుంకాలు విధించింది. ఇప్పటికే ఉన్న యాంటీ డంపింగ్, కౌంటర్‌వీలింగ్ డ్యూటీలను కూడా కలుపుకుంటే అమెరికాకు చేసే మన రొయ్యల ఎగుమతులపైన 36 శాతం వరకు సుంకాల పోటు పడుతుంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో రొయ్యల ధర కౌంట్‌ను బట్టి కిలోకు 20 శాతం పడిపోయింది.

ఐటీ రంగం బిక్కు బిక్కు

» వెంటాడుతున్న అమెరికా మాంద్యం భయాలు

» 2025-26 ఆదాయ, లాభాల అంచనాలు కుదించే చాన్స్

న్యూఢిల్లీ: భారత ఐటీ కంపెనీలకూ ట్రంప్ సుంకాల భయం పట్టుకుంది. ఈ వాణిజ్య యుద్ధం ఎక్కడ అమెరికాను ఆర్థిక మాంద్యంలోకి నెట్టి తమ కొంప ముంచుతుందోనని భయపడుతున్నాయి. అదే జరిగితే కీలక మార్కెట్లయిన అమెరికా, యూరప్ దేశాలకు చెందిన రిటైల్, తయారీ కంపెనీల ఐటీ బడ్జెట్‌లు తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నాయి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, లాభాల అంచనాలను ఈ కంపెనీలు మరింత కుదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజానికి ట్రంప్ సుంకాలకు ముందు 2025-26లో పరిస్థితులు గాడిలో పడతాయని కంపెనీలు భావించాయి. అయితే ట్రంప్ సుంకాలతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పరిస్థితులు చూస్తుంటే మరో మూడు నుంచి ఆరు నెలల వరకు ప్రతికూల వార్తలు తప్ప, సానుకూల వార్తలు పెద్దగా ఉండకపోవచ్చని ఐటీ కంపెనీలు భావిస్తున్నాయి. ఆర్థిక మాంద్యం వచ్చినా కంపెనీలకు కొన్ని ఐటీ సేవలు తప్పనిసరి. ఆ ప్రాజెక్టులతో పాటు ఖర్చులు తగ్గించి ఉత్పాదకత పెంచే ప్రాజెక్టులకూ పెద్దగా ఢోకా ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. ఏదేమైనా ఆర్థిక పరిస్థితులపై పూర్తి స్పష్టత వచ్చే వరకు అమెరికా కంపెనీలు ఐటీపై పెట్టే విచక్షణా పూర్వక ఖర్చులను పక్కన పెడతాయని బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఒక నివేదికలో తెలిపింది.



దిగొచ్చిన పసిడి

» ఒక్కరోజే రూ.1,550 తగ్గుదలతో రూ. 91,450కి పరిమితమైన తులం

» కిలో వెండి రూ.3,000 డౌన్

న్యూఢిల్లీ: పసిడి ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయిల నుంచి క్రమంగా దిగివస్తున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల రేటు సోమవారం రూ.1,550 తగ్గి రూ.91,450కి పరిమితమైంది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో తగ్గి రూ.91,000గా నమోదైంది. కిలో వెండి ఏకంగా రూ.3,000 తగ్గుదలతో రూ.92,500కు జారుకుంది. వెండి తగ్గడం వరుసగా ఇది ఐదో రోజు. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,027 డాలర్లు, సిల్వర్ 30 డాలర్లకు జారుకున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	440
వరంగల్	412	గోదావరి	435
చిత్తూరు	480	విశాఖపట్నం	445
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	87
కర్నూలు	100	నెల్లూరు	92
విశాఖపట్నం	109	అనంతపురం	92
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,380 ▼	82,850 ▼	1,03,000 ▼
విజయవాడ	91,300 ▼	85,500 ▼	90,200 ▼
విశాఖపట్నం	88,470 ▼	81,100 ▼	89,880 ▲
రాజమండ్రి	90,380 ▼	82,850 ▼	95,200 ▼
ప్రొద్దుటూరు	90,300 ▼	83,080 ▼	92,000 ▲
ముంబై	89,085 ▼	81,602 ▼	90,392 ▼

కొందరు అధికారులే నిజమైన అంధులు

అంధ ఉద్యోగులను కోర్టు చుట్టూ తిప్పడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అంధ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని కొంతమంది ప్రభుత్వ అధికారులే నిజమైన అంధులని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అంధులను కోర్టుల చుట్టూ తిప్పడంపై అసహనం వ్యక్తం చేసింది. వివిధ కారణాలు చూపుతూ అక్రమంగా తమను ఉద్యోగాల నుంచి తొలగించారని పేర్కొంటూ పలువురు అంధ ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై సోమవారం జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ దివ్యాంగుల శాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేసింది. పిటిషనర్‌లు కోర్టుల చుట్టూ తిరగడానికి కారణమైన అధికారుల తీరును తప్పుబట్టింది.

భట్టిని కలిసిన ఉద్యోగుల జేఏసీ

- 57 పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వినతి
- 12న సమావేశం అవుతామని డిప్యుటీ సీఎం హామీ

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా తమ సమస్యల పరిష్కారం కోసం కృషి జరగలేదని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు భట్టి విక్రమార్కకు తెలిపారు. సోమవారం ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఉద్యోగులు 57 పెండింగ్ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. 2023 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతో పాటు 2022 నుంచి చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడం, ఈ కుబేర్ వ్యవస్థను రద్దు చేసి ట్రెజరీ ద్వారా బిల్లులు చెల్లించేలా పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తక్షణమే 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు, వికలాంగుల కార్పొరేషన్ ఏర్పాటు తదితర డిమాండ్లను ప్రస్తావించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం 12 గంటలకు మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమవుతుందని భట్టి హామీ ఇచ్చారని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదరి ఏలూరి శ్రీనివాస్ రావు తెలిపారు.

జీవో 29 రద్దు చేయాలి

- తెలంగాణ భవన్‌లో గ్రూప్ 1 అభ్యర్థుల నిరసన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు నష్టం కలిగించేలా రాజ్యాంగ విరుద్ధంగా రూపొందించిన జీవో 29ను రాష్ట్రప్రభుత్వం రద్దు చేయాలని గ్రూప్ 1 అభ్యర్థులు డిమాండ్ చేశారు. జీవో 29ను రద్దు చేయాలని తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గ్రూప్ 1 అభ్యర్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రూప్ 1 నియామకాల్లో జీవో 54ను రద్దు చేసి జీవో 29ను అమలు చేసి అగ్రవర్ణ విద్యార్థులకు ఉద్యోగాలు కట్టబెట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు.

బీఆర్ఎస్ సభకు 3వేల బస్సులు

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు రూ.8 కోట్ల చెక్కు అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవాల నేపథ్యంలో ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో చేపట్టనున్న భారీ బహిరంగసభ కోసం ఆ పార్టీ చర్యలు ముమ్మరం చేసింది. సభకు జనాన్ని తరలించేందుకు 3వేల ఆర్టీసీ బస్సులు ఇవ్వాలంటూ మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగబాలు, కురువ విజయ్ కుమార్ తదితరులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిశారు. బస్సుల అద్దెలో భాగంగా రూ.8 కోట్ల చెక్కును కూడా అందజేశారు.

స్వశక్తి చీరలకు కూలీ నిర్ణయించాలి

- సిరిసిల్ల నేతన్నల 24 గంటల దీక్ష

సిరిసిల్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్వశక్తి చీరలకు కూలీ నిర్ణయించాలంటూ నేత కార్మికులు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. ప్రభుత్వ చీరలకు కూలీ నిర్ణయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్‌లూం, వార్పిన్, వైపని కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. ఏడు రోజులుగా కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. యజమానులకు కూలీ నిర్ణయించి కార్మికులకు నిర్ణయించకపోవడం సరైంది కాదన్నారు. చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సచివాలయంలో మీనాక్షి సమీక్షలా: రఘునందన్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ సచివాలయంలో సమీక్షలు నిర్వహించడం అర్థరహితమని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రికి పనిచేసే స్వేచ్ఛ ఇవ్వాలి తప్ప.. ఢిల్లీ నుంచి వచ్చిన వాళ్లు ఇక్కడ సమీక్షలు చేయడం సరికాదని అన్నారు. సీఎంకు, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌కు మధ్య ఏదైనా వివాదం ఉందేమోనని, దానిపై రాహుల్ దృష్టిపెట్టాలని సూచించారు. కాంగ్రెస్ వ్యవహారాలపై ఆమె గాంధీ భవన్‌లో సమీక్షలు చేసుకోవచ్చని.. ఎంపీగా పని చేసిన మీనాక్షి నటరాజన్, తన పరిధి ఏంటో గుర్తుంచుకోవాలని అన్నారు.

జీవో 21 ఉపసంహరించుకోవాలి

- వర్సిటీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి
- విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ

పంజాగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక నియామకాల విధివిధానాలపై తీసుకొచ్చిన జీవో 21ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ డిమాండ్ చేసింది. 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, యూజీసీ పే స్కేల్స్ వర్తింప చేసిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని జేఏసీ నాయకులు కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ కన్వీనర్ డాక్టర్ ధర్మతేజ, సమన్వయకర్త డాక్టర్ ఉపేందర్ రావు, డాక్టర్ పరశురామ్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ కనకయ్య తదితరులు మాట్లాడారు. 12 విశ్వవిద్యాలయాల్లో 1270 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కొనసాగుతున్నారని, తమను క్రమబద్ధీకరించిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. 10 రోజుల్లో తమ డిమాండ్లు పరిష్కరించకపోతే వీసీల ఇల్లు ముట్టడిస్తామని, నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

తెలియదు.. గుర్తులేదు

- రఘురామ కేసులో డాక్టర్ ప్రభావతి జవాబులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలియదు.. గుర్తులేదు అంటూ డాక్టర్ ప్రభావతి విచారణకు సహకరించకుండా దాటవేత ధోరణిని ప్రదర్శించినట్లు తెలిసింది. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్) మాజీ సూపరింటెండెంట్ అయిన డాక్టర్ ప్రభావతి సుప్రీం కోర్టు ఆదేశాలతో సోమవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ఒంగోలులోని ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. రాత్రి 9 గంటల వరకు విచారణ సాగింది. రఘురామ శరీరంపై గాయాలకు సంబంధించి వైద్యులు ఇచ్చిన నివేదికలను ఎందుకు తారుమారు చేశారు.. మీపై ఎవరు ఒత్తిడి చేశారని ఎస్పీ దామోదర్ అడిగినట్లు తెలిసింది. మొత్తం 40 ప్రశ్నలు సంధించగా.. తెలియదు, గుర్తులేదంటూ దాటవేత ధోరణితో ఆమె జవాబులిచ్చినట్లు సమాచారం.

31మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో 31మంది మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయారు. వీరంతా పలు విధ్వంసకర ఘటనల్లో నిందితులుగా ఉన్నారని, వీరిలో ముగ్గురిపై రూ.4లక్షల 50వేల రివార్డు ఉందని ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఈ ఏడాది బస్తర్ డివిజన్‌లో సుమారు 180మంది మావోయిస్టులు లొంగిపోయారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో సోమవారం ఐదుగురు మహిళా మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో ఒకరిపై రూ. లక్ష రివార్డు ఉందని జిల్లా ఎస్పీ ప్రభాత్ కుమార్ తెలిపారు.




ప్రమాణ స్వీకారం చేసిన నూతన ఎమ్మెల్సీలు వరుసగా చిన్నమైల్ అంజిరెడ్డి (బీజేపీ), అద్దంకి దయాకర్ (కాంగ్రెస్), కేతావత్ శంకర్ నాయక్ (కాంగ్రెస్)



నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

- కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్.. బీజేపీ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డితో ప్రమాణం చేయించిన చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్, ఎమ్మెల్యే కోటా శాసనమండలి ఎన్నికల్లో విజయం సాధించిన వారు సోమవారం ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. తొలుత బీజేపీ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికైన మల్కా కొమురయ్య, పట్టభద్రులు ఎమ్మెల్సీగా ఎన్నికైన చిన్నమైల్ అంజిరెడ్డి, పీఆర్‌టీయూ తరఫున గెలుపొందిన పింగిళి శ్రీపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ తరఫున ఎన్నికైన అద్దంకి దయాకర్, ఎం.విజయశాంతి, కేతావత్ శంకర్‌నాయక్‌తోపాటు సీపీఐకి చెందిన నెల్లికంటి సత్యం ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘువీర్‌రెడ్డి, బీజేపీ తరఫున కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, మందుల సామేలు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పేరి వెంకట్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన ఎన్.సత్యం (సీపీఐ)



ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన పింగిళి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూ)

జీతంలో సగం పార్టీకి, ప్రజలకు: దయాకర్

పార్టీ కోసం పని చేసిన తనను గుర్తుంచుకొని ఏఐసీసీ, టీపీసీసీ కలిసి ఎమ్మెల్సీ పదవి ఇచ్చాయని, అందరి ప్రోత్సాహంతో పెద్దల సభకు వెళ్లడం తనకు సంతోషం కలిగిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య తాను వారధిలా ఉంటానన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని భావిస్తున్నానని, ఎమ్మెల్సీగా ప్రతి నెలా వచ్చే వేతనంలో 25 శాతాన్ని కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. భవిష్యత్తులో మరో 25 శాతం వేతనాన్ని ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ సమాజానికి వెచ్చించే యోచనలో ఉన్నానని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, దీనిపై శాసనమండలిలో ప్రశ్నిస్తానని అన్నారు. విద్యాసంస్థలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను అమ్మాలని ప్రభుత్వం చూస్తోందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని, వారిపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, విద్యావ్యవస్థకు సంబంధించిన సమస్యలపై పోరాటం చేస్తానని మరో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య అన్నారు.

ఉపాధ్యాయుల గొంతుకనవుతా: శ్రీపాల్‌రెడ్డి

శాసనమండలిలో విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ఉపాధ్యాయుల గొంతుకనవుతానని పీఆర్టీయూ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసేలా పోరాడతానని, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. దీంతోపాటు ఉపాధ్యాయ ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించేందుకు, అన్నిరకాల గురుకుల, మోడల్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇప్పించేందుకు పోరాడతానన్నారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ, ఆశ్రమ, సింగరేణి పాఠశాలల ఉపాధ్యాయినులకు మినిమమ్ టైం స్కేలు ఇప్పించేందుకు, మిగిలిపోయిన పండిట్, పీఈటీ, అప్‌గ్రేడేషన్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.



ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన మల్కా కొమురయ్య (బీజేపీ)

హైదరాబాద్ ఎమ్మెల్సీ బరిలో బీజేపీ వర్సెస్ ఎంఐఎం

ఇద్దరు స్వతంత్రుల నామినేషన్ల తిరస్కరణ

23న పోలింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ, ఎంఐఎం ముఖాముఖీ పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నిక కోసం నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా, ఇద్దరి నామినేషన్లు మాత్రమే చెల్లుబాటవుతాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి సోమవారం తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ఎన్ గౌతంరావు, ఎంఐఎం తరఫున మిర్జా రియాజ్ ఎల్ హసన్ ఎఫెండి పోటీలో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన మరో ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు చలిక చంద్రశేఖర్, కంటె సాయన్న నామినేషన్లను పది మంది ఓటర్ల చొప్పున ప్రతిపాదించాలి. సోమవారం ఉదయం వరకూ గడువు ఇచ్చినా చంద్రశేఖర్, సాయన్న ఆ వివరాలు తెలిపే ఫామ్-2ఈ సమర్పించక పోవడంతో వారి నామినేషన్లను ఆర్‌ఓ తిరస్కరించారు. ఈ నెల 23 ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికలో 112 మంది ఓటర్లలో ఎంఐఎంకు 49 ఓట్లు, బీజేపీకి 25, బీఆర్ఎస్‌కు 24, కాంగ్రెస్ పార్టీకి 14 ఓట్లు ఉన్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు పదవీ కాలం మే ఒకటో తేదీతో ముగియనుండగా.. కొత్త ఎమ్మెల్సీ ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది.

ఆనాడు బీజేపీ నేతల కళ్లు మూసుకుపోయాయా?

- బీఆర్ఎస్ హయాంలో బంగారం లాంటి భూములను అమ్మినప్పుడు ఏం చేశారు?
- ఎవరి అండతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో బీజేపీ అభ్యర్థిని నిలబెట్టింది..
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్, 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు బంగారం లాంటి భూములను విక్రయించినప్పుడు బీజేపీ నేతల కళ్లు మూసుకుపోయాయా అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో చర్చకు సిద్ధమా అంటూ ఆ పార్టీ నేతలకు సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 11 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ ఏం ఉద్ధరించారో కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. దేశంలో బీజేపీ విభజన రాజకీయాలకు పాల్పడుతూ ఇతర పార్టీలపై విమర్శలు చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని వ్యాఖ్యానించారు. సంఖ్యాబలం లేకపోయినా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరి అండ చూసుకుని బీజేపీ అభ్యర్థిని నిలబెట్టిందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు సంఖ్యాబలం లేకపోవడంతోనే అభ్యర్థిని నిలబెట్టలేదని.. ఎవరికి మద్దతు ఇచ్చే విషయంపై కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. విభజన హామీల గురించి రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ఏనాడైనా మాట్లాడారా అని నిలదీశారు. కేంద్రం సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా తెలంగాణపై వివక్ష చూపుతోందని విమర్శించారు. మోదీ, షా అనుమతి లేనిదే సంజయ్ టిఫిన్ కూడా తినరని ఎద్దేవా చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా తెలంగాణ బీజేపీ నేతలు ఎందుకు చొరవ తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

- రవీంద్ర నాయక్ డిమాండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని అమలు చేయడానికి కేంద్రప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ప్రస్తుత జనాభా ప్రకారం పెంచాలన్నారు. బంజారా సామాజికవర్గానికి చెందిన లఖీ షా కుటుంబానికి చెందిన భూమిలో కొత్త పార్లమెంటు భవనాన్ని నిర్మించారని, అందువల్ల ఆ పరిసరాల్లో లఖీ షా కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కేంద్రాన్ని రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. 'జాతీయ బంజారా వారసత్వ బోర్డు'ను స్థాపించాలని కోరారు.

మహిళలకు రైస్‌మిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామని, గోదాములు నిర్మించి ఇస్తామని మహిళా దినోత్సవం రోజున సీఎం రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పౌరసరఫరాలు- గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా 32 జిల్లా మహిళా సమాఖ్యలు ఉండగా.. వాటి పరిధిలో 553 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. గ్రామస్థాయిలో 18 వేల గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 4.37 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉండగా.. వాటిలో 47.40 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇందులో మహిళా సమాఖ్యలున్న మండలాలకు రైస్‌మిల్లులను మంజూరు చేస్తే 553 మిల్లులను నిర్మించాల్సి ఉంటుంది.

ఒక్కో మిల్లుకు రూ.3.50 కోట్లు..

నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఒక్కో రైస్‌మిల్లు నిర్మాణానికి కనీసం రూ. 3.50 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. యంత్ర సామాగ్రి కూడా రాష్ట్రంలోనే లభిస్తుంది. గంటకు 4 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న యంత్ర సామాగ్రి కొనుగోలు, వాటిని నిర్ణీత ప్రదేశంలో బిగించి సిద్ధం చేయడానికి సుమారు రూ. 1.10 కోట్లు అవుతుంది. దీనికి 'సార్టెక్స్ మిషినరీ (మట్టిపెళ్లలు, బెరుకులను వేర్వేరు చేసి తొలగించే యంత్రాలు)'ను జోడించటానికి మరో రూ.75 లక్షలు కావాలి. భవన నిర్మాణం, నీటి సరఫరా, విద్యుత్, ఇతర సదుపాయాలు కలసి రూ.3.50 కోట్ల వరకు అవసరం అవుతాయని లెక్కించారు. ఇక రైస్‌మిల్లు నిర్మాణానికి ఒకటిన్నర ఎకరాల మేర స్థలం అవసరం. స్థలాన్ని ప్రభుత్వమే ఉచితంగా సమకూర్చనుండటంతో ఈ మేరకు మహిళా సంఘాలపై భారం తప్పుతుంది. మొత్తం 553 మండల మహిళా సమాఖ్యలకు రైస్‌మిల్లులు మంజూరు చేయాలంటే.. రూ.1,935 కోట్లు ఖర్చవుతుంది. అంటే సుమారు రూ. 2 వేల కోట్లతో ఈ పథకాన్ని చేపట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థల సేకరణ చేయాల్సి వస్తే.. ఆ మేరకు అదనపు భారం ఉంటుందని పేర్కొంటున్నారు. రైస్‌మిల్లుల నిర్మాణానికి స్థలం ఎంపిక, సేకరణ బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో పరిశీలన జరిపించి స్థలాలు ఎంపిక చేయనున్నారు. ఈ పథకాన్ని దశలవారీగా చేపట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న మండలాలను.. చురుగ్గా పథకాల్లో భాగస్వామ్యం అవుతూ, వార్షిక టర్నోవర్ బాగున్న మండల మహిళా సమాఖ్యలను మొదట ఎంపికచేయనున్నారు. ఎమ్మెల్యేలు ఏవైనా మండల సమాఖ్యలను ఈ పథకం కోసం ప్రతిపాదిస్తే.. పరిగణనలోకి తీసుకోవాలనే ఆదేశాలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.



ప్రభుత్వ గ్యారంటీతో బ్యాంకు రుణాలు

సాధారణంగా రైస్‌మిల్లులు నిర్వహించే వ్యాపారవేత్తలు నాబార్డు నుంచి రుణాలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఆస్తులు తనఖా పెట్టాల్సి ఉంటుంది. కానీ మహిళా సమాఖ్యలకు ఈ అవసరం ఉండదని.. ప్రభుత్వమే మహిళలు, బ్యాంకులకు మధ్యవర్తిగా వ్యవహరించడంతోపాటు గ్యారంటీ కూడా ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రతి మండల సమాఖ్యకు పాలకవర్గాలున్నాయి. గ్రామైక్య సంఘాల (వీవో) నుంచి మండల సమాఖ్యలో పాలకవర్గ ప్రతినిధులు ఉంటారు. ఈ పాలకవర్గాలకే రైస్ మిల్లుల బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రభుత్వం చెల్లించే మిల్లింగ్ చార్జీలు, ఉప ఉత్పత్తుల విక్రయంతో వచ్చే ఆదాయంతో మహిళా సమాఖ్యలు బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించాలి.

మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని తొలుత నిల్వ చేయటానికి, మరాడించిన తర్వాత బియ్యం నిల్వ చేయటానికి గోదాములు అవసరం. ఈ క్రమంలో మహిళా సమాఖ్యలకు గోదాముల నిర్మాణం కూడా చేసిస్తామని సీఎం ఇప్పటికే ప్రకటించారు. ఈ గోదాముల నిర్మాణ బాధ్యతలను మార్కెటింగ్ శాఖకు అప్పగించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న తరహాలోనే మార్కెటింగ్ శాఖ నిధులతో గోదాములు నిర్మించి.. మహిళా సమాఖ్యలకు అప్పగించేలా కసరత్తు జరుగుతోంది.

ప్రజాపాలన చేస్తున్న విప్లవకారుడు సీఎం రేవంత్

సంజయ్ తొండి, మొండి మాటలు మానాలి: మల్లు రవి

- కంచ గచ్చిబౌలి భూములపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర: చామల
- సన్నబియ్యం పథకంపై బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని సహించం: మేడిపల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రబ్బర్ స్టాంప్ కాదని, ప్రజాపాలన చేస్తున్న విప్లవకారుడని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చేపట్టిన 15 నెలల్లోనే ఎన్నో విప్లవాత్మక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. సీఎంను రబ్బర్ స్టాంప్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించడం అవివేకమన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. '56 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత రేవంత్‌ది. రాజీవ్ యువవికాసం పేరుతో 6 లక్షల మంది యువతకు సబ్సిడీతో ఉపాధి కల్పిస్తున్నారు. సన్నబియ్యం పథకాన్ని అమలు చేసి పేదల కడుపు నింపుతున్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాలు చేస్తున్న సీఎంను రబ్బర్ స్టాంప్ అంటారా..?' అని నిలదీశారు. మీనాక్షి నటరాజన్ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అని.. ఆమె ఇక్కడ పార్టీ వ్యవహారాల్లో మాట్లాడితే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇకనైనా బండి సంజయ్ తొండి, మొండి మాటలు మాని, తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి కుట్రకు తెరలేపాయని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆ భూములపై ఎలాంటి హక్కు లేదని హెచ్‌సీయూ విద్యార్థులకు, వారిని రెచ్చగొట్టేవారికి కూడా తెలుసని చెప్పారు. ఈ భూముల వ్యవహారానికి సంబంధించిన కొందరు ఏఐ ఫేక్ ఫొటోలు, వీడియోలు సోషల్‌మీడియాలో షేర్ చేశారని.. విషయం తెలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తాను పెట్టిన ట్వీట్‌ను డిలీట్ చేయడాన్ని హర్షిస్తున్నామన్నారు. పేదోడు సన్నబియ్యం బువ్వ తినాలన్న ఆశయంతో సీఎం రేవంత్ గొప్ప పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సన్నబియ్యం పథకంపై బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తోందని, పేదోడి కంచంలో మట్టిపోయాలని చూస్తే పాతరేస్తాం జాగ్రత్త అని హెచ్చరించారు. వక్ఫ్(సవరణ) చట్టంపై న్యాయ పోరాటంతో పాటు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ చెప్పారు. కాగా, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీ వీహెచ్ కొనియాడారు. ఈనెల 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి, 14వ తేదీన అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.






సీఎం రేవంత్‌తో సింగపూర్ కాన్సుల్ జనరల్ భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చెన్నైలోని సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గార్ పాంగ్ సోమవారం కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనను పాంగ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సింగపూర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం: భట్టి

హరిత ఇంధన శక్తి(గ్రీన్ ఎనర్జీ), రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్), మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, విద్య అభివృద్ధికే తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయా రంగాల్లో సింగపూర్ సంస్థలతో కలిసి పని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సింగపూర్ కాన్సుల్ జనరల్ ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎంతో భేటీ అయింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. హరిత ఇంధన పాలసీలో భాగంగా సౌర, జల విద్యుత్తు, పంప్డ్ స్టోరేజీ విభాగాలపై దృష్టి పెట్టామని తెలిపారు. తెలంగాణ ఒక నగర రాజ్యమని.. ఇక్కడ పట్టణాలు అత్యధికంగా ఉన్నందున పట్టణాభివృద్ధిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. తెలంగాణతో ఆర్థిక సంబంధాల బలోపేతానికి సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, దీనికి డిప్యూటీ సీఎం సహకారం కావాలని సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ కోరారు.

యువతను నైపుణ్య మానవ వనరులుగా తీర్చిదిద్దాలి

- డిమాండ్ గల కోర్సులపై దృష్టి సారించండి
- గ్రామీణ అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ
- స్కిల్ వర్సిటీ అధికారులకు మంత్రి దుద్దిళ్ల దిశా నిర్దేశం



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అవసరాలకనుగుణంగా అన్ని రంగాల్లో తెలంగాణ యువతను నైపుణ్యవంతులైన మానవ వనరులుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎ్ఎసీ)లో ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అటుపై యూనివర్సిటీ అధికారులతో జరిగిన సమీక్షలో వారికి దిశానిర్దేశం చేశారు. తెలంగాణను అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామా మార్చాలన్న సంకల్పంతోనే తమ ప్రభుత్వం.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర యువతలో ప్రతిభకు కొదవ లేదని.. మార్కెట్ అవసరాలకనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణనిస్తే మరింత మెరుగవుతారని చెప్పారు. యూనివర్సిటీ కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలను భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. పరిశ్రమల నుంచి ఎక్కువ డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని మంత్రి దుద్దిళ్ల కోరారు.

చిన్న నీటిపారుదల సీఈగా వి.రఘునాథరావు

చిన్న నీటిపారుదల, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడా), చెక్‌డ్యామ్‌ల చీఫ్ ఇంజనీర్(సీఈ)గా వి.రఘునాథరావును నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పోస్టులో పనిచేస్తున్న కేఎస్ఎస్ చంద్రశేఖర్ మార్చి 31వ తేదీన పదవీ విరమణ చేశారు. దాంతో రఘునాథరావును సీఈ(చిన్న నీటిపారుదల)గా నియమించారు. ఈమేరకు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు ఇచ్చారు.

పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై నేడు భేటీ

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై తెలంగాణ లేవనెత్తిన అంశాల గురించి నేడు అధికారులు చర్చించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని కృష్ణా- గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ (కేజీబీవో) కార్యాలయంలో రెండు తెలుగు రాష్ట్రాల అధికారులతో పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సమావేశం కానుంది. వర్షాకాలంలో తెలంగాణలో ముంపునకు గురయ్యే భూభాగానికి సంబంధించిన అన్ని అంశాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)ని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కోరింది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో కిన్నెరసాని, ముర్రెడువాగుల నుంచి వచ్చే నీరు గోదావరిలో కలిస్తే ఏర్పడే ముంపు ప్రభావంపై గతంలో సర్వే నిర్వహించిన విధంగానే మిగిలిన 7 వాగుల ప్రభావంపై కూడా సర్వే నిర్వహించాలని రాష్ట్రం కోరుతోంది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో మొత్తం 954.15 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని తెలంగాణ నొక్కి చెబుతోంది. ఈ నేపథ్యంలో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పుతో పాటు సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ సమావేశం జరుగనుంది.

ల్యాండ్ స్కేప్ డిజైనింగ్‌లో కొత్త కోర్సులు

డిజైన్ ఫీల్డ్‌లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్.. ఇంటర్న్‌షిప్‌తో కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చింది. ఇంటీరియర్ డిజైనర్ కోర్సులో 3 నెలల సర్టిఫికేషన్, 6 నెలల ఇంటర్న్‌షిప్, ల్యాండ్ స్కేప్ డిజైనింగ్‌లో 45 రోజుల సర్టిఫికేషన్‌తో కొత్త కోర్సులు ప్రవేశపెట్టింది. శిక్షణతోపాటు ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు న్యాక్ డైరెక్టర్ తెలిపారు. ఏదైనా డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఈ కోర్సులు చేసేందుకు అర్హులు. పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆసక్తిగల వారు మరింత సమాచారం కోసం 906320870 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని, లేదా www.nac.edu.in వెబ్‌సైట్ చూడొచ్చని న్యాక్ డైరెక్టర్ సూచించారు.

మద్యం ఆదాయం రూ.34,600 కోట్లు

- గత ఏడాదికన్నా 7శాతం అధికం

మద్యం అమ్మకాల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.34,600 కోట్ల ఆదాయం సమకూరింది. క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 7 శాతం అధికమని ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. లిక్కర్ అమ్మకాలు బాగా పెరగడంతో ఈమేరకు ఆదాయం సమకూరినట్లు చెప్పారు. అయితే యునైటెడ్ బ్రూవరీస్ కొన్ని రోజులు తమ బ్రాండ్ బీర్ల సరఫరాను ఆపేయడంతో మొత్తంగా బీర్ల అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే 3శాతం తగ్గినట్టు తెలిపారు.

ఫార్మాసిటీ భూముల్లో హద్దుల గుర్తింపు

యాచారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో మూడో రోజు సోమవారం కూడా రంగారెడ్డి జిల్లా యాచారం రెవెన్యూ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు హద్దులు గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు రెవెన్యూ అధికారులు కందుకూరు-యాచారం మండలాల సరిహద్దు వరకు హద్దులు గుర్తించారు. రెండు కిలో మీటర్ల వరకు కంచె వేయగా.. మరో 25 కిలోమీటర్ల మేర కంచె వేస్తే పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇద్దరు ఏసీపీలు, 8 మంది సీఐలు, 15 మంది ఎస్సైలు, 150 మంది పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. మేడిపల్లిలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి పల్లె చెల్కతండాకు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. కాగా టీజీఐఐసీ అధికారులు సర్వే చేస్తుండగా ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి మేడిపల్లి రైతులతో సమావేశమై తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వకుండా భూములు స్వాధీనం చేసుకునేందుకు కంచె వేయడం సరైంది కాదన్నారు.

కేసుల ఎత్తివేత



(మొదటిపేజీ తరువాయి)

రూపొందించి ప్రచారం చేస్తున్న వారు ఎవరైనా, వారి వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించవద్దని, అందరిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల కమిటీ సచివాయ వర్సిటీ ఉపాధ్యాయులతో, ప్రజాసంఘాల ప్రతినిధులతో సమావేశమైంది. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబులతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి, న్యాయశాఖ అధికారులు కూడా హాజరయ్యారు. వర్సిటీ అధ్యాపకుల సంఘం, పౌర సంఘాల ప్రతినిధులు పలు డిమాండ్లను మంత్రుల కమిటీ ముందు ఉంచారు. వర్సిటీలో బలగాల ఉపసంహరణ, విద్యార్థులపై కేసుల ఎత్తివేత అందులో ప్రధానమైనవి. కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టాన్ని అంచనా వేయడానికి, జీవవైవిధ్య సర్వే నిర్వహణకు నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకుల బృందానికి అనుమతి ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చిన తర్వాతే జేఏసీ నాయకులు మంత్రుల కమిటీతో భేటీ అవుతారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి స్పందిస్తూ, కేసుల తీవ్రతను తెలుసుకున్న తర్వాత వాటిని ఎత్తివేయడంపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వర్సిటీ విజ్ఞప్తి మేరకే క్యాంపస్‌లో బలగాలను మోహరించామని, మళ్లీ వర్సిటీయే లిఖితపూర్వకంగా కోరితే తొలగిస్తామని తెలిపారు. సమావేశం ముగిసిన కాసేపటికే వర్సిటీ ఉపాధ్యాయ సంఘం, ప్రజా సంఘాల విజ్ఞప్తిని అనుసరించి, విద్యార్థులపై కేసులను ఎత్తేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. పోలీసు బలగాలను ఉపసంహరించాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జ్యుడీషియల్ రిమాండులో ఉన్న ఇద్దరు విద్యార్థుల కేసుల ఉపసంహరణకు తక్షణమే చర్యలు చేపట్టాలని నిర్దేశించినట్లు ప్రకటించారు. కేసుల ఉపసంహరణ క్రమంలో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. తాము తీసుకున్న నిర్ణయాలను వివరిస్తూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావుకు లేఖ రాశారు. 400 ఎకరాల్లో మినహా యూనివర్సిటీలో ఉన్న పోలీసు బలగాలను ఉపసంహరిస్తున్నామని, వర్సిటీలో శాంతి భద్రతల సమస్యను యూనివర్సిటీయే చూసుకోవాలని తేల్చిచెప్పారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని రక్షించడానికి పోలీసుల పహారా తప్పనిసరి అని స్పష్టం చేశారు. తదుపరి కోర్టు ఆదేశాలు జారీ చేసే వరకు అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరినీ 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని చెప్పారు. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి మంత్రుల కమిటీ అనుకూలంగా ఉన్నప్పటికీ సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్న దృష్ట్యా న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికిప్పుడు రావడం కుదరదని స్పష్టం చేశారు. అయితే, విద్యార్థుల నుంచి సూచనలు, సలహాలు వినడానికి మంత్రుల కమిటీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మంత్రుల బృందాన్ని కలిసిన వారిలో వర్సిటీ అధ్యాపకులు సౌమ్య దేవమ్మ, శ్రీపర్ణ దాస్, భంగ్యా భూక్య, పౌర సంఘాల ప్రతినిధులు కిరణ్ కుమార్, వి.సంధ్య, సజయ, ఇమ్రాన్ సిద్దిఖీ తదితరులు ఉన్నారు.

సమావేశానికి ముందు సీఎంతో మంతనాలు

వర్సిటీ టీచర్లతో సమావేశానికి ముందు ఉదయం మంత్రుల బృందం సచివాలయంలోనే ఉన్న ముఖ్యమంత్రితో చర్చించింది. విద్యార్థుల విషయంలో ఎలా వ్యవహరించాలనే విషయమై నలుగురూ మాట్లాడుకున్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కేసుల నమోదుకు వెనుకాడవద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫేక్ పోస్టులపై ఇప్పటి వరకు నమోదైన కేసులు, న్యాయస్థానాల్లో విచారణ అంశాలను సీఎం ఆరా తీశారు. ఇందులో రాజకీయ నాయకులు, ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సినీ ప్రముఖుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

పోలీసు బలగాలను ఉపసంహరిస్తున్నాం

అధ్యాపక సంఘం విజ్ఞప్తి మేరకు వర్సిటీ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరిస్తున్నామని డిప్యూటీ సీఎం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావుకు రాసిన లేఖలో వెల్లడించారు. 'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్వయంప్రతిపత్తి, బోధన, పరిశోధనల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి అచంచల విశ్వాసం ఉంది. యూనివర్సిటీలో శాంతి భద్రతలు, విద్యార్థులు, అధ్యాపకుల భద్రతకు క్యాంపస్‌లో పోలీసులను అందుబాటులో ఉంచాలంటూ ఈ నెల 2న మీ రిజిస్ట్రార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు గతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయ జేఏసీ, పౌర సంఘం సభ్యుల విజ్ఞప్తికి స్పందించి కంచ గచ్చిబౌలి లోని 400 ఎకరాల భూమిలో మినహా మెయిన్ క్యాంపస్ సమీపంలో పోలీసు బలగాలను ఉపసంహరించుకుంటున్నాం" అని వివరించారు. వీసీ నుంచి లిఖితపూర్వకంగా హామీ లభించిన తర్వాతే బలగాలను ఉపసంహరిస్తున్నట్లు భట్టి తెలిపారు.

మీనాక్షి హాజరుపై చర్చ

సచివాలయంలో మంత్రుల కమిటీ సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హాజరవడం హాట్ టాపిక్‌గా మారింది. శనివారం మంత్రుల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొనడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఏ హోదాలో ఆమె పాల్గొన్నారని నిలదీశారు. గాంధీభవన్ ఉండగా ఆమె సచివాలయానికి వచ్చి మంత్రులతో పాటు సమీక్షించడమేంటని అన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ సోమవారం ఆమె మంత్రుల కమిటీ సమావేశంలో పాల్గొనడం చర్చనీయంగా మారింది.

కట్టడి చేయండి: డీజీపీ జితేందర్


సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీజీపీ జితేందర్ పోలీసు అధికారులను కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాల వల్ల కొన్ని సందర్భాల్లో ప్రజలు భయాందోళనకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాంటి వాటి కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ సోమవారం తన కార్యాలయంలో సమీక్షించారు. ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, సీఐడీ చీఫ్ శిఖా గోయెల్, శాంతి భద్రతల అదనపు డీజీ మహేష్ భగవత్ ఇతర ముఖ్య అధికారులు, కమిషనర్లు, ఎస్పీలు, డీసీపీలు పాల్గొన్నారు. 2024లో మొదటి అర్ధ భాగంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రంలో నేరాల సంఖ్య 4.9% తగ్గాయని సీఐడీ చీఫ్ శిఖా గోయెల్ వివరించారు. దొంగతనాలు మినహా అన్ని ప్రధాన నేరాలు తగ్గాయన్నారు. దర్యాప్తులో ఉన్న కేసుల పరిష్కారం 20.49 శాతం పెరిగిందని తెలిపారు.

అటవీ శాఖ అధికారుల భేటీ

కంచ గచిబౌలి భూములపై అటవీ శాఖ అధికారులు అరణ్య భవన్‌లో సోమవారం కీలక సమావేశం నిర్వహించారు. అవి అటవీ భూములు కాదన్న విషయంలో స్పష్టత ఉన్నప్పటికీ వన్య ప్రాణుల రక్షణ అటవీ శాఖ పరిధిలోకి వస్తుండటంతో ప్రధానంగా ఆ అంశంపైనే చర్చించినట్లు సమాచారం. వివాదాస్పద భూముల్లో వన్య ప్రాణుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించాలని న్యాయస్థానాలు ఆదేశించిన నేపథ్యంలో శాఖాపరంగా ఇవ్వాల్సిన సమాధానాలపై చర్చించారు. జింకలు మృతి చెందడం, గాయపడి జనావాసాల్లోకి వస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వాటిల్లో వాస్తవికత ఎంత అన్న దానిపై నివేదికలు రూపొందిస్తున్నారు. ఆ ప్రాంతంలో కుక్కల దాడిలో జింకలు గాయపడటం, మృతి చెందడం అప్పుడప్పుడూ జరుగుతున్నదే అయినప్పటికీ వర్సిటీ వివాదం నేపథ్యంలో వాటి రక్షణకు ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, భవిష్యత్తులో అనుసరించనున్న విధానాలపై అటవీ శాఖ అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు.

పోస్టులు తొలగించిన కిషన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

ఫేక్ ఫోటోలనే ఆరోపణలతో పోలీసు కేసులు, న్యాయస్థానంలో విచారణల నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి సోమవారం వివాదాస్పద పోస్టులను తొలగించారు. మరికొంత మంది సినీ ప్రముఖులు, నాయకులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఫేక్ ఫొటోలను తమ ఖాతాల నుంచి తొలగించినట్లు సమాచారం. కంచ గచ్చిబౌలి భూముల్లో వన్యప్రాణులకు సంబంధించి ఏఐ సాయంతో రూపొందించిన ఫొటోలను, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వారిపై సైబరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో పోలీసులు వరుస కేసులు నమోదు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్‌తో పాటు మరికొందరిపై గచ్చిబౌలి పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేశారు. సుమారు 150 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పోలీసు కేసుల నేపథ్యంలో ఇప్పటి వరకు తెలిసి తెలియక తప్పుడు ఫొటోలను సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసిన వారు ఒక్కొక్కరుగా తొలగిస్తున్నారు.



నకిలీ వీడియోలు పోస్ట్ చేయలేదు

తెలంగాణ సీఎం వాస్తవాలు తెలుసుకోవాలి

రేవంత్ ట్వీట్‌కు నటి దియా మీర్జా స్పందన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై నకిలీ వీడియోలు, ఫొటోలు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఈ అంశంపై బాలీవుడ్ నటి దియామీర్జా స్పందించారు. తాను ఎలాంటి నకిలీ వీడియోలు, ఫొటోలు షేర్ చేయలేదని 'ఎక్స్'లో పేర్కొన్నారు. తెలంగాణ సీఎం ఆరోపణలు చేసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు. "కంచ గచ్చిబౌలికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి నిన్న (ఆదివారం) ఒక ట్వీట్‌లో పలు ఆరోపణలు చేశారు. అందులో.. తెలంగాణ ప్రభుత్వం వేలం వేయాలని చూస్తున్న 400 ఎకరాల భూములను కాపాడాలంటూ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా నేను ఏఐ ద్వారా రూపొందించిన నకిలీ వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేశానని ఆరోపించారు. కానీ, ఇది పూర్తిగా తప్పుడు ఆరోపణ. నేను ఒక్కటి కూడా ఏఐతో రూపొందించిన ఫొటోగానీ, వీడియో గానీ పోస్ట్ చేయలేదు. ఇలాంటి ఆరోపణలు చేసే ముందు తెలంగాణ ప్రభుత్వం, మీడియా వాస్తవాలు చెక్ చేసుకోవాలి" అని దియామీర్జా ట్వీట్ చేశారు. ఆమె చేసిన ఈ ట్వీట్ ఇప్పుడు వైరల్‌గా మారింది.

దేశానికే దిక్సూచిగా ప్రజాపాలన

- పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ
- డెహ్రాడూన్‌లో మంత్రి పొన్నం



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రైతులకు రూ.2 లక్షల దాకా రుణ మాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సన్న బియ్యం పంపిణీ, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం, సాధికారతపై కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ అధ్యక్షతన డెహ్రాడూన్‌లో నిర్వహించిన చింతన్ శిబిర్‌కు మంత్రులు పొన్నం, ధనసరి సీతక్క హాజరయ్యారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో పొన్నం మాట్లాడారు. ప్రజాపాలనలో భాగంగా ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న పథకాలు, సంస్కరణలు దేశానికి దిక్సూచిగా నిలిచాయని చెప్పారు. సామాజిక రుగ్మతలను తొలగించడానికి కులగణన ఒక్కటే పరిష్కారమని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ప్రకటించారని, దానికి అనుగుణంగానే కుల గణన నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో బీసీలు 56 శాతం ఉన్నారని, వారికి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లను 42శాతానికి పెంచడానికి వీలుగా అసెంబ్లీలో బిల్లును ఆమోదించి, కేంద్రానికి పంపించామన్నారు. సామాజిక సమానత్వం సాధించాలంటే బీసీ రిజర్వేషన్ల పెంపునకు మద్దతివ్వాలని కోరారు.

అభాగ్యుల అభ్యున్నతికి కృషి: మంత్రి సీతక్క




అభాగ్యుల అభ్యున్నతికి కృషి చేస్తూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు., వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం వరకు పెంచడంతో పాటు, ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినట్లు చెప్పారు. తెలంగాణలో 32.69 లక్షల మంది వృద్ధులకు నెలవారీ పెన్షన్ల కోసం క్రితం ఏడాది రూ. 3,056.94 కోట్లను వెచ్చించినట్లు చెప్పారు.

నెమళ్ల అరుపులు, జింకల పరుగులు ఉత్తవే

సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం.. దీనిపై నివేదిక సమర్పిస్తామని వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

- కంచ గచ్చిబౌలి భూములపై కౌంటర్‌లు దాఖలు చేయండి
- రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలకు హైకోర్టు ఆదేశాలు
- ఇరుపక్షాల కోరిక మేరకు విచారణ 24కు వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి 400 ఎకరాల భూమి వ్యవహారంలో కొన్ని దుష్ట శక్తులు పని గట్టుకుని తప్పుడు ప్రచారం సాగించాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. నెమళ్లు అరిచినట్లు.. జింకలు భయంతో పరిగెత్తినట్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంలో ఫేక్ వీడియోలు, ఫొటోలను సృష్టించి సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించింది. ఇలా తప్పుడు ప్రచారం చేసిన వ్యవహారంపై నివేదిక సమర్పిస్తామని హైకోర్టుకు చెప్పింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల్లో చెట్ల నరికివేతను అడ్డుకోవాలని, టీజీఐఐసీకి భూబదలాయించే జీవో 54ను కొట్టేయాలని, అక్కడ నేషనల్ పార్క్ అభివృద్ధి చేయాలని కోరుతూ వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు, శాస్త్రవేత్తలు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ యార రేణుక ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. వట ఫౌండేషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు ప్రారంభించారు. చెట్ల నరికివేత వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిందని.. ఏప్రిల్ 16న సుప్రీంకోర్టు మరోసారి విచారణ చేపట్టబోతోందని తెలిపారు. వివాదాస్పద ప్రాంతాన్ని సందర్శించి నివేదిక ఇవ్వాలని సెంట్రల్ ఎంపవర్ కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. పర్యావరణ అనుమతులు, పర్యావరణ ప్రభావం ఎలా ఉంటుంది అని అధ్యయనం చేయడం వంటి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సైతం సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. వివాదాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తున్న నేపథ్యంలో హైకోర్టు ఎదుట ఉన్న పిటిషన్‌లను వాయిదా వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఇంకా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని, సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని చేపట్టినందున హైకోర్టు ఎదుట ఉన్న పిటిషన్‌లను వాయిదా వేయాలని కోరారు. రాష్ట్ర అటవీ శాఖ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కొంత మంది తప్పుడు ప్రచారానికి తెర తీశారని, ఫేక్ వీడియోలు, ఫొటోలతో నెమళ్లు అరుస్తున్నట్లు.. జింకలు పరిగెత్తుతున్నట్లు తప్పుడు కథనాలు అల్లారని, దీనిపై ప్రభుత్వం తరఫున నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అన్నివర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. కౌంటర్‌లు, నివేదికలు దాఖలు చేయడానికి అన్ని శాఖలకు అనుమతిస్తున్నామని, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు ఈ నెల 24 వరకు దాఖలు చేయాలని పేర్కొంది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. ప్రస్తుతం ఉన్న పిటిషన్లలోని డిమాండ్లతోనే కేఏ పాల్ తాజాగా మరో పిల్ దాఖలు చేశారు. సదరు భూమి అటవీ ప్రాంతానికి చెందినదని.. దాన్ని రూ.75 కోట్లకు ఎకరం చొప్పున వేలం వేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. పాల్ పిటిషన్‌ను విడిగా పిటిషన్లతో విచారించేందుకు హైకోర్టు అంగీకరించింది.

వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ!

- మొత్తం ఖాళీలు 1,061
- రిక్రూట్‌మెంట్‌కు సర్కారు మార్గదర్శకాలు
- 15 ఏళ్ల తర్వాత నియామకాలపై స్పష్టత
- మూడుదశల్లో ఎంపిక ప్రక్రియ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త..! 15 ఏళ్ల నిరీక్షణ ఫలించేలా ప్రభుత్వం నియామకాలకు కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో అన్ని సంప్రదాయ కోర్సుల్లో సహాయక అధ్యాపకుల నియామకానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఆదివారం మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ వర్సిటీల్లో 2,817 బోధన పోస్టులుండగా.. వాటిల్లో 1,524 పోస్టులు అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీకి సంబంధించినవి. అయితే.. ప్రస్తుతం 463 మంది రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తుండగా.. 1,061 ఖాళీలున్నాయి. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో ఓ కమిటీని నియమించిన విషయం తెలిసిందే..! ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన నిబంధనలు అమలయ్యేలా మార్గదర్శకాల్లో సవరణలు చేశారు. కనీసం 50% ఖాళీలను భర్తీ చేయాలని, వందల మందిని ఇంటర్వ్యూలకు పిలవకుండా.. పరీక్షలతో వడబోత ద్వారా ఒక్కో పోస్టుకు ఇద్దరిని పిలవాలని కమిటీ సూచించింది. యూజీ, పీజీ, సాంకేతిక, ఫిజికల్ విద్యాబోధనకు సంబంధించిన వారికి ఒకేరకమైన నిబంధనలను అమలు చేయాలని కోరింది. త్వరలోనే ఈ నియామకాల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నత విద్యా మండలి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది.

తాజా మార్గదర్శకాల్లో కీలకాంశాలు

- విశ్వవిద్యాలయంలో నియామకాలకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసి, రోస్టర్ పద్ధతి, రిజర్వేషన్ ప్రక్రియలను పూర్తిచేస్తారు
- అకాడమిక్ రికార్డు, పరిశోధనలకు, అర్హత పరీక్షకు సంబంధించి 50 మార్కులు.. విషయ పరిజ్ఞానం, బోధనలో నైపుణ్యానికి 30 మార్కులు, ఇంటర్వ్యూకి 20 మార్కులు ఉంటాయి
- అకాడమిక్ మార్కుల్లో.. యూజీ, పీజీల్లో 70శాతానికి పైన మార్కులు సాధించిన వారికి 8+12 మార్కులు ఇస్తారు. 60-70% మధ్య మార్కులుంటే 6+10, 50-60 మధ్యన ఉంటే 4+8 మార్కులు కేటాయిస్తారు. 50%లోపు మార్కులుంటే యూజీకి 2, పీజీకి సున్నా మార్కులిస్తారు
- అర్హత పరీక్షలకు సంబంధించి.. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి 10, నెట్/సెట్/స్లేట్ ఉత్తీర్ణులైన వారికి 5, పీహెచ్‌డీ చేసిన వారికి 10, ఎంఫిల్ చేసిన వారికి 5, పరిశోధన పత్రాలు ప్రచురితమైన వారికి/హాజరైన సదస్సులకు గరిష్ఠంగా 5 మార్కులు ఇస్తారు. సంబంధిత సబ్జెక్టుపై పుస్తక రచనకు 5, సంయుక్త రచనకు 3, ఎడిటర్‌కు 2 చొప్పున మార్కులను కేటాయిస్తారు. పోస్ట్ డాక్టర్ ఫెలోషిప్, రిసెర్చ్ అసోసియేట్‌లకు ఒక్కో సంవత్సరానికి 2 చొప్పున గరిష్ఠంగా 5 మార్కులను ఇస్తారు
- ప్రతి దశలోనూ ఎంపిక ప్రక్రియపై అపోహలకు తావులేకుండా మార్కులతోపాటు.. అభ్యర్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో పెడతారు
- 1:10 నిష్పత్తిలో టాప్ 10 మందిని రెండో దశకు ఎంపిక చేస్తారు. 1:5 నిష్పత్తిలో టాప్ 5 గురిని ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు
- ఉపకులపతి అధ్యక్షతన సెలెక్షన్ కమిటీ ఉంటుంది. ఎంచుకున్న సబ్జెక్టుపై అభ్యర్థికి ఉండే అవగాహన, రిసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వం అంచనా ఆధారంగా మార్కులను కేటాయిస్తారు.

ఆర్టీసీలో సమ్మె సైరన్!

- మే 6 అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి కార్మికులు
- ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రకటన
- 21 అంశాలతో జనవరిలో సమ్మె నోటీస్
- తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మె: జేఏసీ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగనుంది. మే 6 అర్ధరాత్రి నుంచి సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ప్రత్యక్ష సమ్మెకు దిగాలని ఆర్టీసీ సంఘాలు నిర్ణయించాయి. సమ్మె కారణంగా మే 7వ తేదీ మొదటి షిఫ్టు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు విధుల్లో ఉండరని జేఏసీ ప్రకటించింది. ఆర్టీసీ కార్మికులకు సంబంధించి 21 అంశాలను ప్రస్తావిస్తూ.. వాటిని పరిష్కరించాలని, లేదంటే తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతామంటూ జేఏసీ నేతలు జనవరి 27న ఆర్టీసీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. కార్మికులతో చర్చలు జరపాల్సిందిగా పేర్కొంటూ లేబర్ కమిషనర్ కార్యాలయ అధికారులు కూడా ఆర్టీసీ యాజమాన్యానికి గతంలో లేఖ పంపారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా చర్చలకు హాజరు కావడం లేదని చివరి నిమిషంలో ఆర్టీసీ అధికారులు సమాచారం పంపించారు. ఆ తర్వాత మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు కోరినా.. ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సోమవారం జేఏసీ నేతలు లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సమావేశమై సమ్మె తేదీని ప్రకటించారు.

స్పందన రానందునే సమ్మె..

కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చిన సమ్మె నోటీసుపై ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన రాలేదని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో-చైర్మన్ హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ఎన్ని రకాలుగా ఒత్తిడి తెచ్చినా ప్రయోజనం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్తున్నట్లు చెప్పారు. సోమవారం లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు జేఏసీ పిలుపునివ్వగా ప్రభుత్వం, యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ నిరసనలో పాల్గొనకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాయని అన్నారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కార్మికులను అక్రమంగా అరెస్ట్ చేశారని, దీనిని జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. అక్రమ అరెస్టులు, కార్మికులపై అణచివేతలు ఇలాగే కొనసాగిస్తే మెరుపుసమ్మె చేపడతామని హెచ్చరించారు. కాగా, సమ్మె నోటీసులో ఆర్టీసీ జేఏసీ ప్రధానంగా 21 అంశాలను ప్రస్తావించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ, 2017 వేతన సవరణ జవరణ జరిగినా... ఇప్పటివరకు ఎరియర్స్ అందకపోవడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు 2017 వేతన సవరణ ఫిక్సేషన్లు జరపకపోవడం, 2021 వేతన సవరణ కాలపరిమితి అయిపోయినందున వెంటనే వేతన సవరణ జరిపి కార్మికులను ఆర్థికంగా ఆదుకోవడం వంటి అంశాలను నోటీసులో జేఏసీ పేర్కొంది.

జేఎన్‌టీయూ కాలేజీలో మెరిట్ జాబితా

- 10% మంది మెరిట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు
- బ్యాక్‌లాగ్స్ పూర్తికోసం జేఎన్‌టీయు 'వన్‌టైం చాన్స్'..!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ఈ ఏడాది నుంచి మెరిట్ విద్యార్థుల జాబితా ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. తమ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో ప్రతి విభాగం నుంచి 10 శాతం మంది మెరిట్ విద్యార్థులను ఈ జాబితాకు ఎంపిక చేస్తామని సోమవారం పేర్కొన్నారు. అలా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాల ప్రదానం చేయడంతోపాటు కళాశాల ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, రెక్టార్, వైస్ చాన్స్‌లర్ సంతకాలు చేసిన సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని నర్సింహారెడ్డి చెప్పారు. ఈ ఏడాది నుంచి కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహణకు వైస్ చాన్స్‌లర్ అనుమతించారన్నారు. కాగా, తన అనుబంధ కళాశాలల్లో విద్యాభ్యాసం గడువు ముగిసినా సబ్జెక్టులు పాస్ కాలేకపోయిన విద్యార్థులకు జేఎన్‌టీయూ 'వన్‌టైమ్ చాన్స్' కల్పిస్తోంది. బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థుల కోసం మే/జూన్ నెలల్లో ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నది.

వాహనాల ట్రాకింగ్‌కు రూ.4.19 కోట్లు

- నిర్భయ ఫండ్ నుంచి రాష్ట్రానికి కేంద్ర నిధులు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా ప్రయాణికుల భద్రతా చర్యల్లో భాగంగా వాహనాలకు వెహికల్ లోకేషన్ ట్రాకింగ్ డివైజ్(వీఎల్‌టీడీ) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్భయ ఫండ్ నుంచి రాష్ట్రానికి రూ. 4.19 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు పత్రాన్ని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ అధికారులు పంపించారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. మహిళా ప్రయాణికులపై కదులుతున్న వాహనాల్లో అకృత్యాలు తరుచూ ఎక్కడో ఒకచోట వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో మహిళల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. వీఎల్‌టీడీ ఏర్పాటు, వాహనాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణానికి మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఈ నిధులు మంజూరు చేసింది.

ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదన

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావుకు ఎట్టిపరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వరాదని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ప్రధాన నిందితుడైనప్పటికీ ప్రభాకర్‌రావు దేశం విడిచి పారిపోయారని తెలిపింది. ఇతర నిందితులకు బెయిల్ వచ్చింది కాబట్టి తనకూ ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతున్నారని గుర్తు చేసింది. దేశం విడిచి పారిపోయిన నిందితుడికి ముందస్తు బెయిల్ ఇస్తే సమాజంలో తప్పుడు సంకేతాలు వెళ్తాయని తెలిపింది. అమెరికా ప్రభుత్వం తనను అప్పగిస్తుందని పసిగట్టి ముందస్తు బెయిల్ కోసం ఈ కోర్టును ఆశ్రయించారని పేర్కొంది. వాదనలు విన్న జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం.. తదుపరి విచారణను ఈనెల 15కు వాయిదా వేసింది.

ఏపీ వాట్సాప్ గవర్నెన్స్‌లో 'టీటీడీ దేవాలయ సేవలు'

- ప్రస్తుతం నాలుగు సేవలు అందుబాటులోకి

తిరుమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్‌లో టీటీడీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. 'మన మిత్ర-ప్రజల చేతిలో ప్రభుత్వం' పేరుతో దేశంలోనే తొలిసారిగా ఏపీలో పలు సేవలు వాట్సాప్‌లో జనవరి నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇందులో టీటీడీకి సంబంధించిన నాలుగు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. తిరుపతిలో ప్రతిరోజు భక్తులకు ఇచ్చే స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ కేంద్రాలు, ఎన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయనే సమాచారంతో పాటు తిరుమలలో సర్వదర్శనం క్యూలైన్ ఎక్కడి దాకా ఉంది? దర్శనానికి ఎన్ని గంటలు పడుతోంది, శ్రీవాణి టికెట్ల సమాచారం వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే గదులు పొందే సమయంలో చెల్లించే డిపాజిట్ రీఫండ్ వివరాలు, ప్రస్తుత స్థితి కూడా తెలుసుకోవచ్చు. ఇందుకోసం మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009కు 'హాయ్' అని మెసెజ్ పంపితే 'సేవను ఎంచుకోండి' అనే ఆప్షన్ కనిపిస్తుంది. అందులో 'దయచేసి ఓ సేవను ఎంచుకోండి' అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే 'టీటీడీ దేవాలయ సేవలు' అని కనిపిస్తుంది. అందులో 1.స్లాటెడ్ సర్వదర్శనం, 2.సర్వదర్శనం, 3.శ్రీవాణి కౌంటర్ స్టేటస్ 4.డిపాజిట్ రీఫండ్ లైవ్ స్టేటస్ ఉంటాయి. భక్తులు వీటిద్వారా తమకు కావలసిన సమాచారం తెలుసుకోవచ్చు.

గ్యాస్ బండ ధర పెంపు ఎఫెక్ట్..

రాష్ట్రంలో 91 లక్షల కుటుంబాలపై ప్రభావం

- 31 లక్షల మహాలక్ష్మి లబ్ధిదారులకు రిలీఫ్
- మహాలక్ష్మి వినియోగదారులకు రూ. 500లకే సిలిండర్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం లబ్ధిదారులు మినహా మిగతా ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులపై ప్రభావం పడుతుంది. 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచుతూ తీసుకున్న నిర్ణయం మంగళవారం నుంచి అమల్లోకి రానున్నది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ప్రస్తుతం సిలిండర్ ధర రూ.855 పలుకుతుండగా, పెరిగిన ధరతో రూ.905లకు చేరుతుంది. రాష్ట్రంలో మొత్తం 130 లక్షల మంది వంటగ్యాస్ వినియోగదారులు ఉంటే.. వారిలో 39 లక్షల మందికి 'మహాలక్ష్మి' పథకం కింద ఉపశమనం లభిస్తుంది. మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీచేస్తోంది. కేంద్రం నిర్ణయంతో హైదరాబాద్ గ్యాస్ వినియోగదారులకు ప్రభుత్వం రూ.405 భరిస్తుంది. రాష్ట్రంలో మరో 11 లక్షల మంది ఉజ్వల పథకం లబ్ధిదారులున్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకూ పెంచిన ధర వర్తిస్తుంది కనుక వారు కూడా పెరిగిన ధర చెల్లించాల్సిందే. ఉజ్వల లబ్ధిదారులు మొత్తం చెల్లించి గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పెంచిన గ్యాస్ ధర ప్రభావం మహాలక్ష్మి పథకం మినహా 91 లక్షల మంది గ్యాస్ వినియోగదారులపై భారం ఉంటుంది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గ్యాస్ ధరలు

ప్రాంతం	పాత ధర	పెరిగిన ధర	ప్రస్తుత ధర
హైదరాబాద్	రూ. 855	రూ. 50	రూ. 905
వరంగల్	రూ. 874	రూ. 50	రూ. 924
కరీంనగర్	రూ. 878.50	రూ. 50	రూ. 928.50
నిజామాబాద్	రూ. 878.50	రూ. 50	రూ. 928.50
వికారాబాద్	రూ. 872	రూ. 50	రూ. 922
జగిత్యాల	రూ. 875	రూ. 50	రూ. 925
భద్రాద్రి-కొత్తగూడెం	రూ. 842	రూ. 50	రూ. 892

25,000 కొలువులు

మెగా టైక్స్‌టైల్ పార్కులో భర్తీకి కిటెక్స్ కంపెనీ ప్రకటన.. నేటి నుంచే ఇంటర్వ్యూల నిర్వహణ

- త్వరలో పార్కులో మరిన్ని కంపెనీల పెట్టుబడులు
- విమానాశ్రయం వస్తుండడంతో ముందుకొస్తున్న సంస్థలు

వరంగల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లోని అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తులు తయారు చేస్తున్న కిటెక్స్ కంపెనీ 25 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ప్రకటన ఇచ్చింది. మంగళవారం నుంచే ఇంటర్వ్యూలు కూడా నిర్వహించనుంది. పలు విభాగాల్లో వైస్ ప్రెసిడెంట్స్/జనరల్ మేనేజర్స్, మేనేజర్స్/ అసిస్టెంట్ మేనేజర్స్, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్/ ఎగ్జిక్యూటివ్స్, ఇంజనీర్స్-సివిల్/ఎలక్ట్రికల్/ మెకానికల్, ఇన్‌చార్జిలు/సూపర్‌వైజర్లు సహా పలు పోస్టులను భర్తీ చేయనుంది. అర్హులైన నిరుద్యోగులు కంపెనీ ప్రకటించిన నియమావళికి అనుగుణంగా kitex-ga-r-ment-s.-com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పలు దశలలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు చేపడతామని కంపెనీ మేనేజర్ మనోజ్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీలో ట్రయల్ రన్ జరుగుతోందని యాజమాన్యం తెలిపింది. వరంగల్‌కు విమానాశ్రయ సౌకర్యం అందుబాటులోకి వస్తుండడంతో ఈ పార్క్‌లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్రలో చేర్చేందుకు కేంద్రం సానుకూలంగా ఉండడంతో మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

22 కంపెనీలతో ఒప్పందం.. పెట్టుబడి పెట్టింది మాత్రం మూడే

'ఫామ్ టు ఫ్యాషన్.. ఫైబర్ టు ఫ్యాబ్రిక్' నినాదంతో వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలో 2017లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసింది. రూ.1,350 కోట్లతో 1,150 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ పార్కుతో పెద్దసంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయని అంతా భావించారు. ఈ పార్కులో పెట్టుబడులకు గత ప్రభుత్వం 2017లో 22 కంపెనీలతో రూ.3,900 కోట్లకు ఒప్పందం చేసుకోగా ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్రమే ఇందులో అడుగు పెట్టాయి. ఇందులో కేరళకు చెందిన కిటెక్స్ సంస్థ 2021 జూలై 7న ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని రూ.1,200కోట్ల వ్యయంతో 187 ఎకరాల్లో పిల్లల దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. అలాగే గణేషా ఎకోపెట్, ఎకోటెక్ కంపెనీలు రూ.588 కోట్ల వ్యయంతో సుమారు 50ఎకరాల్లో రెండు యూనిట్లను ప్రారంభించాయి. గతేడాది దక్షిణ కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ ఎనిమిది ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది కానీ ఇప్పటి వరకు ఉత్పత్తి ప్రారంభించలేదు.



వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు

ప్రభుత్వం చొరవ.. కంపెనీల ఆసక్తి..

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షించలేకపోయింది. దాంతో 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పార్కుపై దృష్టి పెట్టింది. గతేడాది జూన్ 29న సీఎం రేవంత్ టెక్స్‌టైల్ పార్కులో పర్యటించి పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఆగస్టులో సీఎం దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లినప్పుడు టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టిన యంగాన్ కంపెనీతో పాటు కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, మరో 25 అగ్రశ్రేణి కంపెనీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి పెట్టుబడులకు ఆహ్వానించారు. దాంతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో అమెరికా, దక్షిణ కొరియా, కేరళ, ఢిల్లీకి చెందిన పలు కంపెనీల ప్రతినిధులు వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. ఇక్కడున్న సౌకర్యాలు, రవాణా, ముడి సరుకు లభ్యత తదితర అంశాలను పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా ఉన్నా రవాణాకు కొంత సమస్య ఉందని గుర్తించారు. అయితే వరంగల్‌కు త్వరలోనే విమానాశ్రయం వస్తున్న విషయాన్ని వారికి అధికారులు గుర్తు చేశారు. దాంతో ఆగస్టులో మరో రెండు కంపెనీలు టెక్స్‌టైల్ పార్కుకు వచ్చేందుకు ముందుకొచ్చాయి. ఈ నెల 18నుంచి జపాన్‌లో జరుగనున్న వ్యాపారవేత్తల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం మెగా టెక్స్‌టైల్ పార్కులోకి పెట్టుబడులను ఆహ్వానించనుంది. ప్రస్తుతం పెట్టుబడులకు రవాణా సౌక ర్యం అడ్డంకిగా ఉంది. అయితే త్వరలో విమానాశ్రయం వస్తున్న నేపథ్యంలో మరిన్ని పెట్టబడులు ఆకర్షించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

పీఎం మిత్రలో చోటుపై ఆశలు

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) పథకంలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2021-22లో వస్త్ర పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మెగా ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టి పీఎం మిత్ర పథకాన్ని ప్రారంభించింది. ఫార్మ్, ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్, ఫారిన్(ఫైవ్ ఎఫ్) విధానంతో టైక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందు కోసం 2021-22 నుంచి 2027-28 ఆర్థిక సంవత్సర వరకు రూ.4,445కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసే ఏడు టైక్స్ టైల్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయిస్తున్నట్లు 2023 మార్చి 18న మోదీ ప్రకటించారు. అయితే అప్పటికే రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఉండటంతో పీఎం మిత్ర కింద దీన్ని అభివృద్ధి చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అయితే పీఎం మిత్ర మార్గదర్శకాలకు అనుగుణంగా కేఎంటీపీ లేదని కేంద్రం ఆ ప్రతిపాదనను పక్కన పెట్టింది. పీఎం మిత్ర పథకంలో కేంద్రం వాటా 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతంగా ఉంటుంది. పీఎం మిత్ర మార్గదర్శకాలను పాటిస్తే మొదటి దశలో రూ.300 కోట్లు, రెండో దశలో రూ.200 కోట్లు, మూడో దశలో రూ.500 కోట్లు కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. అంతేకాకుండా టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేసే కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇస్తుంది. అయితే ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ పార్కును పీఎం మిత్రలో చేర్చే విషయాన్ని ప్రధాన మోదీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని సమాచారం. ఆ దిశగా అధికారులు చేర్చేలా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు మే నెలలో అధికారికంగా ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే పదుల సంఖ్యలో కొత్త కంపెనీలు వరంగల్‌కు క్యూ కట్టే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

గుట్టుగా వ్యాధులు

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షల ఆధారంగా రూపొందించిన నివేదిక ఇది. దాని ప్రకారం.. తెలంగాణలోని పలు అపోలో ఆస్పత్రుల్లో 44,448 మందికి పరీక్షలు చేయగా.. వారిలో 10,427 మంది (23%) అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్టు తేలింది. మరో 24,246 మంది (55%) ప్రీహైపర్‌టెన్షన్ (అంటే బీపీ రావడానికి ముందు) దశలో ఉన్నట్టు వెల్లడైంది. అలాగే.. 40,897 మందికిగాను 10,355 మంది (25%) మధుమేహ బాధితులు ఉండగా.. డయాబెటిస్ రావడానికి ముందు దశలో ఏకంగా 14 వేల మంది (34%) ఉన్నారు. ఇక.. పరీక్షలు చేయించుకున్నవారిలో 63 శాతం మంది ఊబకాయంతో.. 19% మంది అధికబరువుతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. డిస్‌లిపిడెమియా (అంటే అసాధారణ స్థాయిలో కొలెస్ట్రాల్ స్థాయులు ఉండడం)తో బాధపడుతున్నవారు 47% మంది ఉన్నారు. కుంగుబాటు, వ్యాకులత వంటి మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు చెరో 3 శాతం మంది ఉన్నట్టు తేలింది. కాలేయ సంబంధిత పరీక్షలు 32,333 మందికి చేయగా.. వారిలో 49 శాతం మంది గ్రేడ్ 1 ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. మరో 5 శాతం మంది రెండో దశ ఫ్యాటీ లివర్‌తో.. 80 మంది గ్రేడ్ 3, ఆరుగురు గ్రేడ్ 4 ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నట్టు తేలింది. నిత్యం కాసేపు ఎండలో ఉంటే ఉచితంగా వచ్చే డి విటమిన్ లోపంతో బాధపడుతున్నవారు ఏకంగా 82 శాతం మంది ఉండడం గమనార్హం.

దేశవ్యాప్త గణాంకాలు..

దేశవ్యాప్తంగా 4.5 లక్షల మందికి బీపీ పరీక్ష చేయగా.. వారిలో 26% మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. 23% మంది మధుమేహంతో, 65 శాతం మంది ఫ్యాటీలివర్‌తో, 46 శాతం మంది అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయే) సమస్యతో బాధపడుతున్నట్టు అపోలో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా.. ఫ్యాటీలివర్ బారిన పడిన వారిలో 85 శాతం మందికి అసలు మద్యపానం అలవాటే లేదని.. అథెరోస్క్లెరోసిస్ బాధితుల్లో 2.5 శాతం మంది 40 ఏళ్లలోపువారే కావడం ఆందోళనకరమని నివేదిక పేర్కొంది. అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. అపోలో పరీక్షలు చేసినవారిలో మెనోపాజ్‌కు ముందు మధుమేహం బారిన పడినవారు 14% ఉంటే.. మెనోపాజ్ తర్వాత ఆ సంఖ్య 40 శాతానికి చేరిందని పేర్కొంది. బాలల్లోనూ, యువతలోనూ పెరుగుతున్న ఊబకాయంపై ఆ నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల పిల్లల్లో 8 శాతం మంది, కాలేజీ విద్యార్థులు 28 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. యువతలో 19 శాతం మందిలో ముందస్తు రక్తపోటు (ప్రీహైపర్‌టెన్షన్) సమస్య కనిపించడం. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం, యువతలో ఒత్తిడి పెరిగిపోవడం ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. ఇక.. దేశవ్యాప్తంగా 53 వేల మందికి నిద్ర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు చేయగా వారిలో 24 శాతం మంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఏప్నియాతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. రక్తహీనత సమస్యతో 45% మంది మహిళలు, 26% మంది పురుషులు బాధపడుతుండగా.. విటమిన్ డి లోపం స్త్రీ, పురుషుల్లో వరుసగా 77%, 82 శాతంగా ఉంది. విటమిన్ బి12 లోపం 38 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళల్లో ఉన్నట్టు తేలింది. 40 ఏళ్లలోపు వారిలో ఈ లోపం మరింత స్పష్టంగా కనిపించింది. బి12 లోపం ఉన్నవారు వైద్యులను సంప్రదించి, దాన్ని సరిచేసుకోకపోతే.. పలు ఆరోగ్యసమస్యల బారినపడే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ముందస్తు వైద్యపరీక్షలు, జీవనశైలి మార్పుల వంటి వాటి అవసరాన్ని నివేదిక నొక్కిచెప్పింది.

ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై దృష్టిపెట్టాలి

బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలున్నా.. వాటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవట్లేదని, అలా కాకుండా ముందుగా పరీక్షలు చేయించుకుంటే వీటిలో చాలా జబ్బులు వచ్చే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని నివేదిక సూచించింది. నివేదికలోని అంశాలపై అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్ అంటే భవిష్యత్‌లో నిర్ణయం తీసుకునే అంశం కాదని, ప్రస్తుతం దేశ శ్రేయస్సుకు అదే మూల స్తంభం అని ఆయన అభిప్రాయపడ్డారు. మద్యం సేవించకపోయినా ఫ్యాటీ లివర్ వ్యాధి రావడం.. కొత్త రోగనిర్ధారణ పరీక్షల అవసరాన్ని తెలియజేస్తోందని, సంప్రదాయ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఎంతమాత్రం సరిపోవని అపోలో ఆస్పత్రుల ఎండీ సునీతా రెడ్డి అన్నారు.

మూసీ ప్రాజెక్టుకు సహకరించండి..

- రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శిని కోరిన రాష్ట్ర ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పునరుజ్జీవ అభివృద్ధి ప్రాజెక్టుకు సహకారమందించాలని రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి రాకేశ్ మిట్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కోరారు. సోమవారం హైదరాబాద్‌కు రాకేశ్ మిట్టల్ వచ్చిన నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని రక్షణ శాఖ కార్యాలయంలో మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్‌తో పాటు మూసీ రివర్ ఫ్రంట్ అధికారులు, హెచ్ఎండీఏ అధికారులు సమావేశమయ్యారు. మూసీనది ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి తగిన సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన్ను కోరారు. కంటోన్మెంట్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఎలివేటెడ్ డబుల్ డెక్కర్ కారిడార్ల పురోగతిపై సమీక్షించారు. రక్షణశాఖ నుంచి అనుమతులు వచ్చినప్పటి నుంచి పనులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. మూసీ వెంట గోల్కొండ, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో రక్షణ శాఖకు చెందిన 900 ఎకరాలుండగా.. వాటిని తమకివ్వాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ భూములకు బదులు మరో ప్రాంతంలో భూములిస్తామని తెలపగా.. ఇందుకు రక్షణ అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పునర్విభజనతో దక్షిణాదికి తీవ్ర అన్యాయం

రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తోంది.. ఈడీ పెట్టిన కేసుల్లో 96 శాతం విపక్ష నేతలపైనే

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్
- దక్షిణాది రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలి
- వీసీకే పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్
- రౌండ్ టేబుల్ భేటీలో పునర్విభజనను వ్యతిరేకించిన వివిధ పార్టీలు, సంఘాలు



హైదరాబాద్‌లో 'పునర్విభజన'పై సదస్సులో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పలు పార్టీలు, ప్రజా సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బేగంపేట ప్లాజాహోటల్‌లో సోమవారం తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో 'పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన-దక్షిణ భారత భవిష్యత్తుపై' సదస్సు నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ అంశంపై అసెంబ్లీలో బిల్లు పెట్టేలా సీఎంతో మాట్లాడతామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు కనీసం 35 శాతం అధికంగా నియోజకవర్గాలను పెంచాలని, లేదంటే మరో 25 ఏళ్ల పాటు పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా రాజకీయ పార్టీల మధ్య ఎలాంటి వైరుధ్యాలున్నా ఈ అంశంపై కలిసికట్టుగా పోరాటం చేస్తామన్నారు. మోదీ శాశ్వతంగా ప్రధానిగా ఉండాలనుకుంటున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామని, ఎంతవరకైనా వెళతామన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని, ఈడీ పెట్టిన కేసుల్లో 96 శాతం ప్రతిపక్ష పార్టీల నేతలపై ఉన్నాయన్నారు. కేంద్రం గత 11 ఏళ్లలో తెలంగాణకు ఇచ్చింది ఏమిటంటే సున్నా అని ఎద్దేవా చేశారు. తమిళనాడు వీసీకే పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చిదంబరం ఎంపీ తొల్.తిరమావళవన్ మాట్లాడుతూ పునర్విభజన కుట్రలపై దక్షిణాది రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోదీ, అమిత్ షా ఆర్ఎస్ఎస్‌లో పెరిగినవాళ్లని, ఆ సంస్థ ప్రణాళికలను ముందుకు తీసుకువెళ్లేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు. దళితులు, ఆదివాసీలు, ముస్లింల ఓట్లు అధికంగా ఉన్న నియోజకవర్గాలను విభజన చేసి, అశాస్త్రీయంగా వాటి సరిహద్దులు మార్చడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తమిళనాడు విల్లుపురం ఎంపీ డీ రవికుమార్ మాట్లాడుతూ పునర్విభజనతో దక్షిణాదిలో 35 సీట్లు పెరిగితే, ఒక్క బిహార్‌లోనే 39 సీట్లు పెరుగుతాయన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 80నుంచి 140కి పెరిగే అవకాశం ఉందన్నారు. ఇదే జరిగితే యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఏం అనుకుంటే అది జరిగే ప్రమాదం ఉందన్నారు. జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ పునర్విభజన వెనక దక్షిణాది రాష్ట్రాల ప్రజాస్వామిక ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనే కుట్ర ఉందన్నారు. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు 30 శాతం నిధులు వస్తే ఉత్తరాది రాష్ట్రాలకు 250 శాతం ఖర్చుపెడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ కార్యదర్శి పశ్యపద్మ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు కె.గోవర్ధన్, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్ కూడా ప్రసంగించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.